thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 213 కరీంనగర్ శుక్రవారం, 10 అక్టోబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

### కమీషన్ పెంపు కోసం వంట గ్యాస్ డీలర్ల సమ్మె హెచ్చరిక

న్యూఢిల్లీ : తమ సమస్యలను పరిష్కరించకుంటే దేశ వ్యాప్త సమ్మె చేస్తామని వంటగ్యాస్ డీలర్లు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇందుకు మూడు వారాల సమయం ఇస్తున్నట్టు ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల సంఘం అధ్యక్షుడు బి.ఎస.శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పెట్రోలియం, సహజవాయుల మంత్రిత్వ శాఖకు కూడా లేఖ రాసినట్టు తెలిపారు. సిలిండర్ల పంపిణీకి సంబంధించిన నిర్వహణ వ్యయం పెరుగుతున్న దృష్ట్యా ప్రస్తుతం ఇస్తున్న కమీషన్ సరిపోవడం లేదని, అందువల్ల దాన్ని కనీసం రూ.150కి పెంచాలని డిమాండు చేశారు. తాము అడగకపోయినా ఆయిల్ కంపెనీలు వాణిజ్య సిలిండర్లను పంపిస్తున్నాయని, ఇది తమకు సమస్యలు తెచ్చిపెడుతున్నాయని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అమలు చేస్తున్న ఈ విధానాన్ని వెంటనే నిలిపివేయాలనీ డిమాండు చేశారు.

## 'స్థానిక' ఎన్నికల్లో లబ్ధికి కాంగ్రెస్ చేసిన కుట్రలు విఫలమయ్యాయి: హరీశ్‌రావు



హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ చేసిన కుట్రలు విఫలమయ్యాయని భారత రాష్ట్ర సమితి నేత హరీశ్‌రావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే వ్యవహారంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా నాటకాలు ఆపాలన్నారు. ఆరు గ్యారంటీల్లాగే 42 శాతం బీసీ రిజర్వేషన్లూ డ్రామా అని వ్యాఖ్యానించారు. 55 ఏళ్లు పరిపాలించిన కాంగ్రెస్ ఏనాడైనా బీసీల కోసం పనిచేసిందా? అని ప్రశ్నించారు. హస్తం పార్టీకి చిత్తశుద్ధి ఉంటే జాతీయ నేతలతో దిల్లీ వేదికగా కొట్లాడాలన్నారు. పార్లమెంటులో ఈ మేరకు చట్టం చేయించాలన్నారు. కలిసి వచ్చేందుకు తమ పార్టీ ఎల్లప్పుడూ సిద్ధమేనని తెలిపారు.



**కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు: కిషన్‌రెడ్డి...** రేవంత్‌రెడ్డి సర్కారు చేతకానితనం వల్లే హైకోర్టు స్టే విధించిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. ప్లాన్‌-బీ సిద్ధం చేసుకుని కోర్టులో తూతూమంత్రంగా వాదించారని ఆరోపించారు. బీసీలను హస్తం పార్టీ రాజకీయంగా వాడుకుంటోందని వ్యాఖ్యానించారు. కేంద్రంలో కాంగ్రెస్ ఉన్నప్పుడే సుప్రీం కోర్టు రిజర్వేషన్లపై 50శాతం పరిమితి విధించిందని గుర్తుచేశారు. కనీస అవగాహన లేకుండా రేవంత్ ప్రభుత్వం వ్యవహరించిందన్నారు.

**మాపై అంభాడాలు వేయొద్దు..** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు స్టే విధించేందుకు కాంగ్రెస్ పార్టీనే కారణమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు తమ పార్టీ కట్టుబడి ఉందన్నారు. అసెంబ్లీలో బీసీ బిల్లుకు, ఆర్డినెన్స్‌కు పూర్తిగా మద్దతిచ్చినట్లు గుర్తుచేశారు. భాజపా ఎంపీ ఆర్.కృష్ణయ్య ఇంప్లీడ్ పిటిషన్ వేశారని చెప్పారు. గవర్నర్‌కు బిల్లు పంపి 3 నెలలు కూడా ఓపిక పట్టలేదని విమర్శించారు. జీవో ఇచ్చి షెడ్యూల్ ప్రకటించడంలో లోగుట్టు ఏంటని ప్రశ్నించారు. కోర్టు స్టేకు ప్రభుత్వానిదే బాధ్యతని, తమపై అభాండాలు వేయొద్దన్నారు.


## అన్నదాతకు శుభవార్త!

### నెలకు రూ.5000 పెన్షన్..




న్యూఢిల్లీ, అక్టోబర్ 09: అసంఘటిత రంగంలోకి కార్మికులకు పెన్షన్ అందించేందుకు అటల్ పెన్షన్ యోజన పథకాన్ని కేంద్రం తీసుకు వచ్చిన సంగతి తెలిసిందే. అందులో తాజాగా కేంద్రం కీలక మార్పులు చేర్పులు చేసింది. చందాదారుడు సమర్పించే.. సబ్‌స్క్రైబర్ రిజిస్ట్రేషన్ ఫారాన్ని మార్చినట్లు వెల్లడించింది. పాత పద్దతి ప్రకారం 2025, సెప్టెంబర్ 30వ తేదీ వరకే రిజిస్ట్రేషన్లు ముగిశాయని కేంద్రం స్పష్టం చేసింది. అయితే 2025, అక్టోబర్ 1వ తేదీ నుంచి కొత్త ఫారం తీసుకు వచ్చినట్లు తెలిపింది. ఈ పథకాన్ని అత్యంత సులభతరం చేయడం కోసమే ఈ సంస్కరణ ఉద్దేశ్యమని స్పష్టం చేసింది. అక్టోబర్ 1వ తేదీ నుంచి సవరించిన అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) ఫారం మాత్రమే రిజిస్ట్రేషన్ కోసం ఆమోదిస్తున్నట్లు చెప్పింది. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ జారీ చేసిన కొత్త మార్గదర్శకాలను అనుసరించి ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తగిన మార్పులు చేసినట్లు వివరించింది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఇప్పటి వరకు ఉన్న రిజిస్ట్రేషన్ ఫార్మాట్‌ను సెప్టెంబర్ 30వ తేదీ వరకు కొనసాగించడం లేదని వివరణ ఇచ్చింది. ఎందుకంటే.. సెంట్రల్ రికార్డ్ కీపింగ్ ఏజెన్సీ ప్రోటీన్ (గతంలో NSDL) పాత ఫార్మేట్‌ను ఆమోదించదని తెలిపింది. దేశంలోని వ్యాపారులు, గిగ్ వర్కర్లు సహా పెన్షన్ పథకం పరిధిలోకి రాని ఉద్యోగులు ఈ పథకంలో చేరవచ్చు. అయితే ఖాతాదారుడు.. బ్యాంకు లేదా పోస్టాఫీసులో అకౌంట్ కలిగి ఉండాల్సి ఉంటుంది. భారతీయ పౌరులు ఎవరైనా ఈ పథకంలో చేరవచ్చుని పేర్కొంది. కానీ ఆదాయపు పన్ను చెల్లించే వారికి ఇందులో చేరే అర్హత లేదని క్లియర్ కట్‌గా స్పష్టం చేసింది.

ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి 18 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉన్న వారు అర్హులు. ఇక ఖాతాదారుకు 60 సంవత్సరాలు వచ్చినప్పటి నుంచి పెన్షన్ అందనుంది. నెలకు రూ.210 చొప్పున చెల్లిస్తే గరిష్ఠంగా రూ. 5 వేలు వరకు పెన్షన్ పొందే వీలు ఉంది. కంట్రిబ్యూషన్ ఆధారంగా పెన్షన్ పొందే అవకాశం ఉంటుంది. అంటే.. మీరు జమ చేసే మొత్తం నగదుపై మీ పెన్షన్ ఆధారపడి ఉంటుంది. రైతులు, రైతు కూలీలు, తాపీ పని చేసే వారితోపాటు గిగ్ వర్కర్లు వారికి 60 ఏళ్ల వయసు దాటిన తర్వాత ప్రతి నెల రూ.1000 నుంచి రూ. 5000 వరకు పెన్షన్.. ఈ పథకం ద్వారా అందనుంది.




## జీఓ 9పై హైకోర్టు స్టే..

### విచారణ 4 వారాలు వాయిదా

నేటికి వాయిదా పడగా మధ్యాహ్నం విచారణ చేపట్టిన హైకోర్టు అందరి వాదనలు విన్న ధర్మాసనం విచారణను వాయిదా వేసింది. అంతేకాకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్న జీవో 9పై హైకోర్టు స్టే ఇచ్చింది. హైకోర్టు నిర్ణయంతో స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడినట్టే. నిన్న జరిగిన విచారణలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రిజర్వేషన్లపై ప్రస్తుత పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రిజర్వేషన్ల అంశంపై 23 ఇంప్లీడ్ పిటిషన్‌లు దాఖలు కాగా వాటన్నింటినీ ఒకేసారి వింటామని హైకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్ తెలిపింది.

తదనుగుణంగా హైకోర్టులో తీవ్ర వాదోపవాదనలు జరిగాయి. ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి బలంగా వాదనలు వినిపించినా నిరాశే ఎదురైంది. ఇటు ఏజీ సుదర్శన్ రెడ్డి వాదనలు కూడా తీసిపోయాయి. అయితే బీసీ రిజర్వేషన్లపై అనుకూలంగా నిర్ణయం రాకపోవడంతో హైకోర్టు ముందు బీసీ సంఘాలు ఆందోళన చేపట్టాయి.

## బీసీ రిజర్వేషన్‌లో బిగ్ ట్విస్ట్!

హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ తీవ్ర రాజకీయ దుమారం రేపుతున్న ఈ అంశంలో హైకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. జీఓ 9పై మధ్యంతర స్టే విధిస్తూనే.. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ పరిణామం చర్చనీయాంశంగా మారింది. సుదీర్ఘ వాదనలు జరిగి ఈ రోజు తీర్పు వస్తుందని భావించగా న్యాయస్థానం వాయిదా వేయడం అందరినీ విస్తుగొలిపింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు కల్పించే జీవో 9పై హైకోర్టు మధ్యంతర స్టే ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలుకు నాలుగు వారాల గడువు ఇచ్చింది.

ప్రభుత్వ కౌంటర్‌పై పిటిషనర్ కౌంటర్ వేయడానికి రెండు వారాల గడువు ఇచ్చింది. ఈ నిర్ణయంతో తెలంగాణలో వెలువడిన స్థానిక సంస్థల ఎన్నికలపై గందరగోళం ఏర్పడింది. స్థానిక ఎన్నికలు ఉంటాయా? లేదా? లేకుంటే పాత రిజర్వేషన్ల ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయా? అనేది సందిగ్ధం నెలకొంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో పిటిషన్లు దాఖలవగా.. వాటిపై బుధవారం హైకోర్టు సుదీర్ఘ విచారణ చేపట్టింది.




### జీవో 9 తో లింక్ ఉన్న నోటిఫికేషన్లన్నింటికీ వర్తిస్తుందా?

### పాత రిజర్వేషన్ల ప్రకారం వెళ్తే మళ్లీ నోటిఫికేషన్ మస్ట్

### కొత్త రిజర్వేషన్ ప్రకారమైతే కోర్టు స్టే అడ్డంకి

### కీలకంగా మారిన ఎన్నికల సంఘం డెసిషన్

హైదరాబాద్ : హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులు సరికొత్త చర్చకు దారి తీశాయి. బీసీలకు 42% రిజర్వేషన్లు కేటాయిస్తూ.. ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9కి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై రెండు రోజుల పాటు వాదనలు విన్న హైకోర్టు తుది నిర్ణయం వెల్లడించింది. దీని ప్రకారం జీవో 9 పై స్టే విధించింది. ఇదిలా ఉండగా ఎన్నికల సంఘం ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలు నిర్వహించేందుకు ఇదివరకే షెడ్యూల్ జారీ చేసింది.

ఈ మేరకు జీవో నంబర్ 9 ప్రకారమే రిజర్వేషన్లను ఖరారు చేసింది. దీని ఆధారంగానే 2,963 ఎంపీటీసీ, 292 జెడ్పీటీసీ స్థానాలకు ఇవాళ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు నామినేషన్లు సైతం దాఖలయ్యాయి. ప్రస్తుతం ఈ జీవోపై స్టే విధించింది. దీని ప్రకారం దాఖలైన నామినేషన్ల పరిస్థితి ఏమిటన్న చర్చ మొదలైంది. అదే విధంగా జీవో నంబర్ 9 ఆధారంగా షెడ్యూల్ ఇచ్చిన మిగతా స్థానాల పరిస్థితి ఎలా ఉండబోతోందనేది హాట్ టాపిక్ గా మారింది. పాత పద్దతి ప్రకారం ఎన్నికలకు వెళ్తే మొత్తం రిజర్వేషన్లు మారిపోతాయి. కొత్త పద్దతికి జీవో అడ్డంకిగా మారింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోందనేది చర్చనీయాంశంగా మారింది.




## బీహార్ వార్!

### కొలిక్కి రాని సీట్ల పంపకాలు!

### రెండు కూటముల్లోనూ ఇదే తంతు!

ఎన్నికలు అంటే సీట్ల దగ్గరే పంచాయతీ మొదలవుతుంది. ఒక్కో నియోజకవర్గంలో ఆశావహులు అనేక మంది ఉంటారు. పైగా పొత్తులు ఉంటాయి. అలా అన్ని పార్టీలకు చెందిన నాయకులు సీట్లను ఆశిస్తారు. దాంతో ఎవరికి సీటు ఇవ్వాలి ఏ పార్టీకి ప్రాధాన్యత ఇవ్వాలి అన్నది చర్చగా ఉంటుంది. ఇక చూస్తే చూస్తే బీహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత అధికార ఎన్డీఏ, ప్రతిపక్ష మహా కూటమి తమ సీట్ల పంపకాలలో ఫుల్ బిజీ అయిపోయాయి. రెండు కూటములూ తమ అభ్యర్థుల గురించిన కసరత్తుని ముమ్మరం చేశాయి.

**మీటింగ్స్ తో బిజీ :** సీట్ల విషయం వస్తే అధికార ఎన్డీయేకు దాని సమస్యలు చాలా ఉన్నాయి. అలాగే విపక్షంలోని మహా కూటమికి కూడా దాని బాధలు దానికి ఉన్నాయి. దాంతో ఎవరూ ఎక్కడా ఇంకా అభ్యర్థులను ఖరారు చేయలేదు. మరో వైపు చూస్తే కనుక రెండు కూటములలోని భాగస్వామ్య పార్టీలు వేర్వేరుగా సమావేశాలు నిర్వహిస్తున్నాయి.

**చెరి సగం సీట్లతో :** ఇక బీహార్ లో ఎన్డీయే పార్టీలలో బీజేపీ జేడీయూ చెరి సగం సీట్లను పంచుకోవడానికి సిద్ధపడుతున్నాయి మొత్తం 243 సీట్లు ఉంటే ఇతర మిత్ర పార్టీలకు 28 సీట్లను వదిలేసి 215 సీట్లను చెరి సగం పంచుకోవాలని బీజేపీ జేడీయూ నిర్ణయిచాయి. అయితే తమకు అతి తక్కువ సీట్లు ఇవ్వడం పట్ల కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నాయకత్వంలోని లోక్ జనశక్తి పార్టీ గుస్సా మీద ఉంది అని అంటున్నారు. దాంతో ఆ పార్టీ వైఖరి ఎలా ఉంటుందో చూడాలని చెబుతున్నారు.

**బీజేపీ పెద్దలు సిద్ధం :** ఇక బీహార్ లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల గురించి చర్చించడానికి పాట్నాలోని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో బీజేపీ ఎన్నికల కమిటీ మూడవ సమావేశం నిర్వహించింది ఈ సమావేశానికి కేంద్ర మంత్రి, బీజేపీ ఎన్నికల ఇన్‌ఛార్జ్ ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ జైస్వాల్, ఎన్నికల కమిటీ సభ్యులందరూ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీట్ల పంపిణీ అభ్యర్థులపై చర్చించారు ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలను బట్టి బీజేపీ చాలా స్థానాలకు తన అభ్యర్థుల జాబితాను ఖరారు చేయవచ్చని భావిస్తున్నారు. మరో వైపు చూస్తే జేడీయూ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కూడా అభ్యర్థుల జాబితాకు తుది మెరుగులు దిద్దడం గురించి పార్టీ సీనియర్ నాయకులతో కీలకమైన చర్చలు జరుపుతున్నారు.

**మహా కూటమిలో అదే సీన్ :** ఈసారి తప్పనిసరిగా అధికారంలోకి వస్తామని భావిస్తున్న మహా కూటమి కూడా కసరత్తుని ముమ్మరం చేసింది. ఈ కూటమిలో ముఖ్య భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థుల జాబితా గురించి చర్చించడానికి న్యూఢిల్లీలో తన కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తోంది బీహార్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రాజేష్ రామ్ ఇదే విషయం మీద మాట్లాడుతూ పార్టీ తన వాటా కిందకు వచ్చే సీట్లపై చర్చిస్తానబు అంటున్నారు రాష్ట్రీయ జనతాదళ్ ఇతర కూటమి భాగస్వాముల మధ్య సీట్ల పంపకాలపై సామరస్యంగానే చర్చలు జరుగుతున్నాయని ఆయన అన్నారు.

**సీట్ల పేచీ స్టార్ట్ :** బీహార్ లో మహా కూటమిలో సీట్ల పేచీ స్టార్ట్ అయింది అని అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ ఈసారి అధిక సీట్లను డిమాండ్ చేస్తోంది. ఆర్జేడీ అయితే తాను సొంతంగా 150 సీట్లకు పోటీ చేసి మిగిలిన 93 సీట్లనే మిత్రులకు ఇవ్వాలని చూస్తోంది. కాంగ్రెస్ తాను కూడా సొంతంగా వంద సీట్లకు పోటీ చేయాలని అనుకుంటోంది. ఈ విషయం మీద మహా కూటమి ఎన్నికల సమన్వయ కమిటీ కీలక సమావేశం ఆర్జేడీ నాయకుడు తేజస్వి ప్రసాద్ యాదవ్ అధ్యక్షతన జరిగింది.

సమావేశం తర్వాత సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా మాట్లాడుతూ, సీట్ల పంపకాలకు సంబంధించిన కొన్ని అంశాలను ఖరారు చేస్తున్నామని చెప్పారు. అదే సమయంలో సిపిఐ ఎంఎల్ పార్టీ గౌరవప్రదమైన సంఖ్యలో సీట్లు కావాలని డిమాండ్ చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లు బాగానే తాము గెలుచుకున్నామని దీంతో పార్టీకి మంచి ట్రాక్ రికార్డ్ ఉందని గుర్తు చేస్తోంది. దానిని పరిగణనలోకి తీసుకుంటే నియోజకవర్గాలలో న్యాయమైన తీరున గౌరవప్రదమైన వాటాను తమకు కేటాయించాల్సిన అవసరం ఉందని సిపిఐ ఎంఎల్ కేంద్ర కమిటీ కోరుతోంది. మొత్తానికి రెండు శిబిరాలలో సీట్ల పంచాయతీ పెద్ద ఎత్తున సాగుతోంది.

చురకలు




## ఉదయం నోటిఫికేషన్.. సాయంత్రానికి స్టే.. ఆశావహులకు కొత్త టెన్షన్

హైదరాబాద్ : స్థానిక ఎన్నికల కోసం ఎంతో ఉత్కంఠతో ఎదురు చూస్తున్న ఆశావహులకు హైకోర్టు బ్రేక్ వేసింది. బీసీ రిజర్వేషన్ల విషయంలో హైకోర్టు తీసుకున్న నిర్ణయం క్షేత్రస్థాయిలో నాయకుల ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. ఇవాళ ఉదయమే ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు మొదటి దశ పోలింగ్ కోసం ఎస్ఈసీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇవాళ ఉదయం నోటిఫికేషన్ వెలువడటంతో రిజర్వేషన్లు అనుకూలం ఉన్న ఆశావహులంతా ఆయా స్థానాల్లో నామినేషన్ల దాఖలుకు అంతా సిద్ధం అయ్యారు. ఈ క్రమంలో సాయంత్రానికే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 9పై కోర్టు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం హాట్ టాపిక్ గా మారింది.

**కోర్టు ఆర్డర్ వచ్చాక ఈసీ నిర్ణయం:** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం గతంలోనే నోటిఫికేషన్ షెడ్యూల్ ప్రకటించింది. ఈ షెడ్యూల్ ప్రకారం ఇవాళ ఉదయం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కోసం ఎస్ఈసీ నోటిఫికేషన్ జారీ చేసింది.

అయితే తాజాగా కోర్టు ఈ నోటిఫికేషన్‌పై స్టే విధించడంతో.. కోర్టు ఆర్డర్ కాపీ వచ్చాక ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. అయితే హైకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని పాటించేందుకు ఎస్ఈసీ సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది.

**ఆశావహులకు కొత్త టెన్షన్:** లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆ మేరకు రాష్ట్రవ్యాప్తంగా రిజర్వేషన్లు ఖరారు చేసింది రాష్ట్ర ప్రభుత్వం. ఇప్పుడు ఈ రిజర్వేషన్ల నోటిఫికేషన్ పై కోర్టు స్టే విధించడంతో ఇప్పుడు ఖరారైన నోటిఫికేషన్లే ఎన్నికలు జరిగే నాటికి ఉంటాయా లేదా అనే టెన్షన్ ఆశావహుల్లో వ్యక్తం అవుతోంది. రిజర్వేషన్లు తెలియక ముందు పోటీ విషయంలో పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ కొత్త రిజర్వేషన్లు ఖరారై పక్షం రోజులవుతోంది. దీంతో తమకు రిజర్వేషన్లు సానుకూలంగా వచ్చిన చోట్ల ఆశావహులు ఇప్పటికే గ్రామాల్లో కొంత మేర ఖర్చు పెట్టుకున్నారు.

అంతిమంగా జీవో నంబర్ 9 చెల్లదని కోర్టు తీర్పు వెలువరిస్తే అప్పుడు మా పరిస్థితి ఏంటి అనే ఆందోళనలు బీసీలతో పాటు మిగతా సామాజిక వర్గాల్లో వ్యక్తం అవుతోంది. ఈ విషయంలో చివరాఖరుకు ఏం జరగబోతోందనేది వేచి చూడాలి.




## గ్రూప్1 పరీక్షల వ్యవహారం.. ప్రభుత్వానికి మరోసారి ఊరట

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వానికి మరోసారి సుప్రీం కోర్టులో ఊరట లభించింది. గ్రూప్1 పరీక్షలపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర తీర్పుపై జోక్యానికి సుప్రీం నిరాకరించింది. గ్రూప్ 1 ర్యాంకర్ల నియామకాలపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును వేముల అనుష్ సుప్రీం కోర్టులో సవాలు చేశారు.

జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిపింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర తీర్పుపై జోక్యానికి ధర్మాసనం నిరాకరించింది.

**ఇంతకు ముందు కూడా..** గ్రూప్ -1 ర్యాంకర్ల నియామకాలపై తెలంగాణ హైకోర్టు తీర్పును కొంతమంది అభ్యర్థులు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఈ నేపథ్యంలో జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. హైకోర్టు డివిజన్ బెంచ్ మధ్యంతర తీర్పు ఇచ్చినందున ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చే తుది ఉత్తర్వులకు అనుగుణంగా నియామకాలు ఉండాలని పేర్కొంది. వీలైనంత తొందరగా పిటిషన్లను విచారించి ఆదేశాలివ్వాలని స్పష్టం చేసింది.




హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం తరపున మేం బలమైన వాదనాలు వినిపించాం.. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు ఇలా మధ్యంతర స్టే విధిస్తుందని అనుకోలేదు.. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల కాపీ అందిన తర్వాత ఏం చేయాలనేది నిర్ణయిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో సామాజిక న్యాయంతో ఎన్నికలకు వెళ్తామని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్. బీసీ 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్త శుద్ధితో పనిచేస్తుంది.. కుల సర్వేలు నిర్వహించింది.. డెడికేటెడ్ కమిషన్ వేసింది.. సబ్ కమిటీ వేసి కేబినెట్ ఆమోదం కూడా తెలిపింది.. శాసన సభలో చట్టం చేసి గవర్నర్ కు పంపించాం.. 2018 పంచాయతీ రాజ్ చట్ట సవరణ చేశాం.. ఇవాళ కోర్టు తీర్పు ఇలా వస్తుందని ఊహించదలేదన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడం వల్లే కేంద్రం నుంచి నిధులు రావడం లేదన్నారు మంత్రి పొన్నం. కాంగ్రెస్ హయాంలో సామాజిక న్యాయం జరుగుతుంది.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వంతరపున కోర్టులో బలంగా వినిపిస్తుంటే.. బీఆర్ ఎస్, బీజేపీలు ఎందుకు ఇంప్లీడ్ కాలేదో జవాబు చెప్పాలని నిలదీశారు మంత్రి పొన్నం ప్రభాకర్. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో సామాజిక న్యాయంతో ఎన్నికలకు వెళ్తామని స్పష్టం చేశారు మంత్రి పొన్నం ప్రభాకర్.




హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై అన్ని పరిస్థితులను ఎదుర్కొని ముందుకు వెళ్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పార్టీ నేతలతో నిర్వహించిన భేటీలో ఆయన మాట్లాడారు. "ఇన్‌ఛార్జి మంత్రులు.. ముఖ్య నేతలతో చర్చించి అభ్యర్థులను ఖరారు చేయాలి. నామినేషన్ల ప్రక్రియకు పూర్తిస్థాయిలో సమయం కేటాయించాలి. నామినేషన్ల దరఖాస్తు నమూనా పత్రం క్షేత్రస్థాయికి పంపాలి. రిజర్వేషన్ల దామాషా ప్రకారం అభ్యర్థులను ఖరారు చేయాలి. వారికి బీ ఫారం ఇవ్వాలి.. నో డ్యూ పత్రాలు ఇప్పించాలి. న్యాయపరమైన అంశాల నివృత్తికి గాంధీ భవన్‌లో సమన్వయ కమిటీ ఉండాలి. టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలి. ఎన్నికల ప్రక్రియపై అవగాహన ఉన్నవారు కమిటీలో ఉండేలా చూడాలి. ఎంపీపీలు, జడ్పీ ఛైర్మన్ పదవుల ఎంపికను పీసీసీ నిర్ణయిస్తుంది. పీసీసీ నిర్ణయించే వరకు రాజకీయ ప్రకటనలు చేయవద్దు. హైకోర్టులో బీసీ రిజర్వేషన్ల కేసుపై పీసీసీ చీఫ్ పర్యవేక్షించాలి. ఉన్నత న్యాయస్థానం తీర్పు తర్వాత తదుపరి కార్యాచరణపై రాత్రి మరో భేటీ నిర్వహిస్తాం. తొలివిడత కోసం రాత్రికి అభ్యర్థుల జాబితా సిద్ధం కావాలి" అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## తొలి దశ హ్యామ్ రోడ్ల నిర్మాణానికి రూ.10,986 కోట్లు: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా దశల వారీగా హ్యామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) రోడ్ల నిర్మాణం చేపడతామని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. హ్యామ్ రోడ్ల నిర్మాణంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి సచివాలయంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మొదటి దశలో రూ.10,986 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు కోమటిరెడ్డి చెప్పారు.

మొదటి దశ రోడ్ల నిర్మాణానికి వచ్చే నెలలో టెండర్లు పిలుస్తామన్నా రు. మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు రెండు వరుసల హ్యామ్ రోడ్లు.. జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి నాలుగు వరుసల రోడ్ల నిర్మాణం చేస్తామని వివరించారు.




## మహిళలకు ఉచిత బస్సు.. పురుషులకు రెట్టింపు వసూళ్లు: కేటీఆర్

హైదరాబాద్: రాష్ట్రంలో సర్కారు నడపట్లేదు.. సర్కస్ నడుపుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. బస్ భవన్ వద్ద నిరసనలో భాగంగా ఆయన మాట్లాడారు. "ఉదయం మా పార్టీ నేతలను గృహ నిర్బంధం చేశారు.. తర్వాత వెళ్లవచ్చన్నారు. ఇక్కడికి వచ్చాక మళ్లీ అరెస్టు చేస్తున్నారు. ఏం చేస్తున్నారో అర్థం కావట్లేదు. ఉచిత బస్సు పథకం పెట్టి ఆర్టీసీని నష్టాల్లోకి నెట్టారు. ఆ నష్టాలను భరించాల్సింది ప్రభుత్వమే. మహిళలకు ఉచిత బస్సు కల్పించి.. పురుషులకు రెట్టింపు వసూళ్లు చేస్తున్నారు. ఒక్కో కుటుంబంపై టికెట్ ధరల భారం పెరిగింది. ఆర్టీసీ బస్సు పాసుల ధరలు 25 శాతం పెంచారు. మెట్రో నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీని తరిమేశారు. మెట్రో, ఆర్టీసీ లేకుండా మొత్తం ప్రైవేటుపరం చేసే కుట్ర జరుగుతోంది" అని కేటీఆర్ అన్నారు.

**ఆర్టీసీ ఎండీకి వినతిపత్రం అందజేత...** అనంతరం బస్ భవన్‌లో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి భారత రాష్ట్ర సమితి నేతలు వినతిపత్రం అందజేశారు. కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు తదితరులు వెళ్లారు.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పెంచిన ఆర్టీసీ బస్సు ఛార్జీలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కంపెనీల ఏర్పాటుకు అమెరికాలో కూడా లేని సులువైన విధానాన్ని తెచ్చాం: కేటీఆర్

హైదరాబాద్: దేశంలో 'జీసీసీ'ల ఏర్పాటులో హైదరాబాద్‌ది ముఖ్య పాత్ర అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన జీసీసీ మూడో సమ్మిట్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సుమారు 350కిపైగా జీసీసీలు హైదరాబాద్‌లో ఉన్నాయని తెలిపారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో టీఎస్ ఐపాస్ ద్వారా కంపెనీల ఏర్పాటును సులభతరం చేసినట్లు వివరించారు. సంస్థల ఏర్పాటుకు అమెరికాలో కూడా లేని సులువైన విధానాన్ని తెచ్చినట్లు తెలిపారు. మరిన్ని కంపెనీలు తెలంగాణకు రావాలని కోరుకుంటున్నామన్నారు.




## హైకోర్టు ఎదుట బీసీ సంఘాల ఆందోళన.. బీసీల నోటికాడ ముద్ద లాక్కున్నారు

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించేలా జారీ చేసిన జీవో 9పై హైకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు ఎదుట బీసీ సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. గేట్ నెం.4 దగ్గర నినాదాలు చేస్తూ.. రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మీడియాతో మాట్లాడారు.. బీసీల నోటికాడ ముద్దను ఆపారని ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తొందరపాటు చర్యలతో అన్యాయం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ స్పందన చూశాక బంద్‌కు పిలుపునిస్తామని పేర్కొన్నారు. కొంతమంది బీసీలకు పదవులు వస్తుంటే ఓర్వలేక పోతున్నారని మండిపడ్డారు. త్వరలో బీసీల సత్తా ఏంటో చూపిస్తామని ఆర్.కృష్ణయ్య ధీమా వ్యక్తం చేశారు.

## భగవంతునికి భక్తుడికి మధ్య అనుసంధానంగా వ్యవహరిస్తా: సుమంత్ రెడ్డి


న్యూఢిల్లీ, అక్టోబర్ 9: ఢిల్లీ టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడిగా ఎదుగుండ్ల సుమంత్ రెడ్డి ఈరోజు (గురువారం) ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సుమంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఢిల్లీ టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడిగా ఎంపిక కావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. భగవంతునికి భక్తునికి మధ్య అనుసంధానంగా వ్యవహరిస్తానని అన్నారు. ఢిల్లీ టీటీడీ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఢిల్లీలో స్వామి వారి భక్తులకు ఎప్పటికప్పుడు స్వామివారి కార్యక్రమాలు తెలియజేస్తానని.. తిరుమలలో స్వామివారికి జరిగే కైంకర్యాలు ఢిల్లీ టీటీడీ ఆలయంలో జరిగేలా చూస్తానని వెల్లడించారు. తెలుగువారు, శ్రీవారి భక్తులతో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి ఆలయానికి కావలసిన వసతులు ఏర్పాటు చేస్తానన్నారు. ఏపీ భవన్‌లో టీటీడీ కౌంటర్ మళ్ళీ అందుబాటులోకి తీసుకువస్తానని సుమంత్ రెడ్డి పేర్కొన్నారు.

**అలా చేస్తే ఉపేక్షించం: మాధవ్...** కాగా.. ఈ కార్యక్రమంలో ఏపీ బీజేపీ అధ్యక్షులు మాధవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని టీటీడీ లోకల్ అడ్వైజర్ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సుమంత్ రెడ్డికి అభినందనలు తెలియజేశారు. దేశవ్యాప్తంగా వెంకటేశ్వర స్వామి వైభవాన్ని తెలియజేసే విధంగా టీటీడీ అనేక రకాల దేవాలయాలను నిర్మిస్తోందన్నారు. తిరుమల తిరుపతిలో శ్రీవారికి ఎలాంటి సేవలు జరుగుతాయో ఢిల్లీలో కూడా అలాంటి సేవలు కొనసాగిస్తామని వెల్లడించారు. ఏపీ భవన్‌లో ఉన్న టీటీడీ దర్శన కౌంటర్‌ను తిరిగి పున ప్రారంభిస్తామని ప్రకటించారు. టీటీడీ పవిత్రకు ఎక్కడ భంగం కలిగించిన ఉపేక్షించే పనిలేదని స్పష్టం చేశారు. టీటీడీ వైభవం మరింత ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తామన్నారు. టీటీడీ అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ కృషి చేస్తోందని మాధవ్ వెల్లడించారు.



# ఆకాశవాణి అగ్రగణ్య కళాకారుడు నేదునూరి

## – అక్టోబర్ 10...నేదునూరి కృష్ణమూర్తి జయంతి



నేదునూరి కృష్ణమూర్తి (1927, అక్టోబరు 10 – 2014, డిసెంబరు 8) కర్ణాటక సంగీత విద్వాంసుడు, సంగీత కళానిధి బిరుదు పొందిన వాడు. మొదట్లో వయొలిన్ మీద ఆసక్తితో ఉన్నా తర్వాత గురువుల సలహాపై గాత్ర సంగీతం వైపు మొగ్గు చూపా డు. శ్రీపాద పినాక పాణి వంటి వారి వద్ద శిష్యరికం చేశాడు. అన్నమాచార్య సంకీర్త నలు, రామదాస కీర్తనలను స్వర పరిచాడు. నాదసుధా తరంగిణి అనే ట్రస్టును ఏర్పాటు చేసి స్వరపరిచిన కీర్తనలను వాటి నొటేషన్లతో సహా ప్రచురిం చాడు. కృష్ణమూర్తి అక్టోబరు 10, 1927 న తూర్పు గోదావరి జిల్లాలోని కొత్తపల్లి గ్రామంలో రామమూర్తి పంతులు, విజయలక్ష్మి దంప తులకు జన్మించాడు. ఇంట్లో అందరికన్నా చిన్నవాడు. ఆయన తండ్రి పిఠాపురం రాజా వారి సంస్థాన కార్యాలయంలో పనిచేస్తూండే వారు. నేదునూరి 1940 లో విజయనగరం మహారాజా సంగీత కళాశాలలో వయొలిన్, గాత్రంలో ప్రాథమిక శిక్షణ పొందాడు. కీర్తిశేషులు ద్వారం నరసింగరావు నాయుడు శిష్యుడిగా ఉన్నాడు. 1945 నుంచి సంగీత సభలలో పాల్గొంటూ వచ్చాడు. 1949లో ప్రముఖ సంగీత విద్వాంసుడు, సంగీత కళానిధి పద్మభూషణ్ డాక్టర్ శ్రీపాద పినాకపాణి వద్ద చేసి సంగీతంలో గమకాలు, ఇతర మెళకువలలో శిక్షణ పొంది, సంగీత నైపుణ్యానికి మెరుగులు దిద్దాడు. ఆల్ ఇండియా రేడియోలో అగ్రగణ్య కళాకారుడిగా వెలుగులోకి వచ్చాడు. 1951 నుండి ఐదు దశాబ్దాలకు పైగా మద్రాసు సంగీత అకాడమీలో ప్రదర్శనలు ఇస్తూ వచ్చాడు. బాల్యం నుండి ఆయనకు సంగీతంలో మంచి అభిరుచి ఉండేది. అష్టపదులు, తరంగాలు, రామాయణ కృతులు పాడారు. చిన్నతనంలో నేదునూరి గ్రామంలో పెరిగిన ఆయన, విద్వాన్ అప్పా రావు వద్ద వర్ణాలుబీ కల్లూరి వేణు గోపాల రావు వద్ద అష్ట పదులు, తరంగాలు నేర్చు కున్నారు. అప్పల నరసింహం సహకారం తో విజయ నగరం మహారాజా కాలేజీలో చేరాడు. ఆయన అనేక అన్నమయ్య కృతులకు బాణీలు కట్టాడు. "నానాటి బ్రతుకు నాటకము" కీర్తనకు నేదునూరి కట్టిన బాణీని ప్రశంసిస్తూ ఎం. ఎస్. సుబ్బలక్ష్మి "నేదునూరి గారూ, ఆ ఒక్కపాటకు బాణీని కట్టినందుకు మీకు సంగీత కళానిధి ఇవ్వచ్చండి" అని మెచ్చుకున్న సంఘటన. 1991 లో సంగీత కళానిధి పురస్కారం ఇచ్చినప్పుడు సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ ఆయన పేరును ప్రతిపాదించగా, సుబ్బలక్ష్మి ఆ ప్రతిపాదనకు ఆమోద ముద్ర వేశారు. 2013 లో కొప్పరపు కవుల ప్రతిభా పురస్కారానికి కూడా ఎంపికయ్యాడు. సంగీత లోకంలో ప్రముఖ స్థానం సంపాయించు కున్నాడు. సంగీత అకాడమీలో యాభై యేళ్ళకు పైగా పాడాడు. తన సుదీర్ఘ సంగీత యాత్రలో అనేక సంగీత కోవిదు లయిన ద్వారం వెంకట స్వామి నాయుడు, డాక్టర్ శ్రీపాద పినాక పాణి, లాల్గుడి జయరామన్, ఎం ఎస్ సుబ్బులక్ష్మి, పేరి శ్రీరామ మూర్తి (వయొలిన్), వెంకట రమణ (మృదంగం), నేమాని సోమ యాజులు (ఘటం) ఇత్యాదు లచే నేదునూరి కొనియాడ బడ్డాడు. నేదునూరి విజయవాడ జీ వీ ఆర్ ప్రభుత్వ సంగీత, నాట్య కళాశాల, ప్రధాన అధ్యాప కుడిగా, సికింద్రా బాద్, విజయ నగరం, తిరుపతి సంగీత కళాశాలలో పని చేసాడు. వేంకటేశ్వర, నాగార్జున విశ్వ విద్యాలయాలలో ఆర్ట్స్ విభాగం డీన్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా, ఆల్ ఇండియా రేడియో, సంగీత విభాగ ఆడిషన్ బోర్డ్ సభ్యుడిగా పనిచేసాడు. కొంతకాలం ఆంధ్ర విశ్వ విద్యాలయం గౌరవ ఆచార్యుడిగా ఉన్నాడు. నేదునూరి కృష్ణమూర్తి స్వర పరచిన కీర్తనలలో – దాశరథి శతకం పద్యాలు, రాగ సుధా రసాలతో భద్రాచల రామదాస కీర్తనలు సీడీల రూపంలో తెచ్చారు. అన్నమాచార్య సంకీర్తనలు, పద కదంబం మీద పలు సీడీలు, కేసెట్లు వెలువరిం చారు. ఆల్ ఇండియా రేడియో భక్తి రంజనిలో కూర్చిన నారాయణ తీర్థ తరంగాలు, రామదాస కీర్తనలు వాసికెక్కాయి. టీ టీ డీ – ఆస్థాన విద్వాంసులుగా నియమితులైయ్యాడు. అన్నమాచార్య కృతులని కూర్చి సంగీత లోకానికి అందించాడు. మద్రాసు సంగీత అకాడమి నుండి సంగీత కళానిధి గౌరవం అందు కున్నాడు.

శ్రీ రాజా లక్ష్మీ పురస్కారం (2002), నేషనల్ ఎమినెన్స్ అవార్డు (2006), ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నుండి కళా నీరాజనం పురస్కారం (1995), 2013 లో కొప్పరపు కవుల ప్రతిభా పురస్కారం అవార్డులు, గౌరవ పురస్కారాలు అందుకున్నాడు. నేదునూరి ప్రముఖ శిష్యులలో కళాప్రపూర్ణ చిట్టి అబ్బాయి, శ్రీమతి కోక సత్యవతి, శ్రీమతి కె. సరస్వతి వుధ్యార్తి, జి. బాలకృష్ణ ప్రసాద్, శ్రీమతి శోభారాజు, మల్లాది సోదరులు (శివరామ ప్రసాద్, రవి కుమార్) ఉన్నారు. నేదునూరి 2014 డిసెంబరు 8న, అనారోగ్యంతో బాధపడుతూ 87 సంవత్సరాల వయసులో దేహం చాలించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# ఇంటర్నెట్ ను ఏఐ అంతం చేస్తుందా?




మనం ఏదైనా సమాచారం కావాలంటే వెంటనే గూగుల్‌లో వెతుకుతాం. అప్పుడు గూగుల్ మనకు కొన్ని వెబ్‌సైట్‌ల లింక్‌లను చూపిస్తుంది. ఆ లింక్‌లపై క్లిక్ చేసి వెబ్‌సైట్‌లలోకి వెళ్లి కావాల్సిన సమాచారాన్ని చూసుకుంటాం. అక్కడ ఉండే ప్రకటనలను కూడా చూస్తాం. దీనివల్ల వెబ్‌సైట్‌లకు డబ్బులు వస్తాయి. ఇంటర్నెట్ మొదలైనప్పటి నుంచీ ఇదే ప్రాసెస్ కొనసాగుతోంది. దీన్నే సింపుల్ బార్గెయిన్ అంటారు. అయితే ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఈ పద్ధతిని మార్చేస్తోంది. AI వల్ల మనం చూసిన ఇంటర్నెట్ ఇక మీదట అలా ఉండకపోవచ్చు అని కొందరు నిపుణులు అంటున్నారు. నిజంగా AI ఇంటర్నెట్‌ను నాశనం చేస్తుందా? లేక కొత్త రూపాన్ని ఇస్తుందా? అనేది వివరంగా తెలుసుకుందాం.

**–ఇంటర్నెట్ స్వభావంలో మార్పు...** ఇంటర్నెట్ స్వభావం పూర్తిగా మారిపోయిందని స్టాక్ ఓవర్‌ఫ్లో అనే కంపెనీ సీఈఓ ప్రశాంత్ చంద్రశేఖర్ చెప్పారు. ఏఐ ఇప్పుడు చాలా వెబ్‌సైట్‌లకు జనం వెళ్లడాన్ని ఆపేస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. అంటే మనం ఏదైనా సమాచారం అడిగినప్పుడు, ఏఐ నేరుగా ఆన్సర్ చేస్తే మనం వెబ్‌సైట్‌లకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. దీనివల్ల వెబ్‌సైట్‌లకు వచ్చే ఆదాయం తగ్గిపోతుంది.

**– కొత్త ఏఐ బ్రౌజర్‌లు, ఏజెంట్‌లు...** ఇటీవల పెర్ప్లెక్సిటీ అనే ఒక ఏఐ కంపెనీ కామెట్ అనే కొత్త వెబ్ బ్రౌజర్‌ను రిలీజ్ చేసింది. ఇది స్క్రోల్ చేయడం కంటే మాట్లాడినట్లు ఉంటుందని గిజ్మోడో అనే ఒక టెక్ వెబ్‌సైట్ చెప్పింది. అంటే, మనం చాలా పేజీలు ఓపెన్ చేసి లింక్‌లపై నొక్కకుండా, ఈ బ్రౌజర్ మనం అడిగిన దానికి సరైన సమాధానాన్ని నేరుగా అందిస్తుంది. అలాగే ఓపెన్ ఏఐ కూడా త్వరలో ఆపరేటర్ అనే తన సొంత ఏఐ ఏజెంట్‌ను తీసుకురాబోతోంది. ఇది మనుషులు వెబ్‌సైట్‌లను చూసినట్లే, నొక్కడం, రాయడం, పైకి కిందకి కదపడం వంటివి చేయగలదని అంటున్నారు. ఈ పోటీలో వెనుకబడకుండా గూగుల్ కూడా తన సెర్చ్ ఇంజిన్‌కు ఏఐ మోడ్‌ను తీసుకొచ్చింది. ఇందులో నార్మల్ సెర్చ్ రిజల్ట్స్‌కు బదులుగా ఒక చాట్‌బాట్ మన ప్రశ్నలకు చిన్న వ్యాసం లాగా సమాధానం ఇస్తుంది.

**– ఇంటర్నెట్‌కు కొత్త భవిష్యత్తు?...** ఈ మార్పులు సక్సెస్ అయితే మొత్తం ఇంటర్నెట్ పనితీరునే పూర్తిగా మార్చేస్తాయని గిజ్మోడో అభిప్రాయపడింది. వార్తలు ఇచ్చేవాళ్లు, ప్రకటనలు ఇచ్చేవాళ్లు, ఆన్‌లైన్‌లో వస్తువులు అమ్మేవాళ్లు... వారి వెబ్‌సైట్‌లు ఈ ఏఐ ఏజెంట్లను స్కిప్ చేసే అవకాశం ఉంది. అయితే, ఇంటర్నెట్ మాత్రం ఎక్కడికీ పోవడం లేదని నిపుణులు అంటున్నారు. ప్రమాదంలో ఉన్నది ఓపెన్ వెబ్ అని కొందరు భయపడుతున్నారు. ఈ కొత్త ఇంటర్నెట్ సమాధానాలను ఎప్పుడూ సులభంగా ఇస్తుంది కానీ, ఓపెన్ వెబ్‌ను ఇంతలా పాపులర్ చేసిన కొన్ని విషయాలకు ముగింపు పలకవచ్చు. అంటే మనం ఆన్‌లైన్‌లో ఒకదాని తర్వాత ఒకటి చూస్తూ, అనుకోకుండా కొత్త విషయాలను కనుగొనే అవకాశం కోల్పోవచ్చు. ఇది కేవలం సమాచారం మాత్రమే అందించే ఒక మిషన్‌గా మారే అవకాశం ఉంది. మరి ఈ మార్పులు ఇంటర్నెట్‌ను ఏ విధంగా ప్రభావితం చేస్తాయో వేచి చూడాలి.




భారత్–అమెరికా బంధాన్ని ట్రంప్ వీరభక్తుడొకరు విచ్ఛిన్నం చేస్తున్నారు. తరచూ నోటికొచ్చిన ప్రకటనలు చేస్తూ ఇప్పటికే ఉన్న వివాదాలపై 'పెట్రోల్' చిలకరిస్తున్నారు. ఇరుదేశాల మధ్య బంధాన్ని నిర్మించడానికి గత అధ్యక్షులు చేసిన ప్రయత్నాలను బూడిదపాలు చేస్తున్నారు. స్వయంగా రిపబ్లికన్ మద్దతుదారులు.. ట్రంప్ వర్గీయులు నెత్తీనోరు బాదుకొంటున్నా.. ట్రంప్ అతడికి పూర్తి స్వేచ్ఛనిచ్చారు. దీంతో ఈ భక్తుడు ఆగడం లేదు.. అతడి పేరు పీటర్ నవారో. గతంలో ట్రంప్ కోసం ఏకంగా నాలుగు నెలలు అమెరికా జైల్లో గడిపి శ్వేతసౌధంలోకి అడుగుపెట్టారు. ట్రంప్ వాణిజ్యయుద్ధం వెనక వ్యూహం అతడిదే అని చాలామంది నమ్ముతారు..! ట్రంప్ రెండోసారి పగ్గాలు చేపట్టాక 75 ఏళ్ల ఆర్థికవేత్త పీటర్ నవారోను తన వాణిజ్య సలహాదారుగా ట్రంప్ శ్వేతసౌధంలోకి తీసుకొచ్చారు. అతడి నేపథ్యం తెలిసిన చాలామంది అతడి నియామకాన్ని చూసి ఆశ్చర్యపోయారు.

**రిపబ్లికన్‌గా మారిన డెమోక్రట్..** 1970ల్లో నవారో జాతీయవాది కాదు. అతడు ఓ డెమోక్రటిక్ సానుభూతిపరుడు. వియత్నాం యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ, పర్యావరణ పరిరక్షణను కోరుతూ కాలిఫోర్నియాలో ఉద్యమించారు. ఆయన హార్వర్డు విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ చేశారు. ఇక శాన్‌డియా మేయర్, కాంగ్రెస్ ఇలా పలు పదవులకు పోటీ చేసి ఓడిపోయారు. యూజీఐలో ఎకనామిక్స్, పబ్లిక్ పాలసీలో ప్రొఫెసర్‌గా చేశారు. 1990ల్లో ఆయన తన వైఖరి మెల్లగా సంప్రదాయ జాతీయవాదం వైపు మళ్లింది. స్వేచ్ఛా వాణిజ్యాన్ని వ్యతిరేకించడం, అమెరికా (%ఖూూా%)లో రక్షణాత్మక వాణిజ్య విధానాలు వంటి అంశాల్ని సమర్థించేవారు. 2011లో 'డెత్ బై చైనా' అనే పుస్తకం రాశారు. దానినే డాక్యుమెంటరీగా చిత్రీకరించారు. 2016లో ట్రంప్‌నకు అల్లుడు జరేడ్ కుష్నెర్ ద్వారా పరిచయం అయ్యాడు. తొలి కార్యవర్గంలో కూడా వైట్‌హౌస్ నేషనల్ ట్రేడ్ కౌన్సిల్ డైరెక్టర్‌గా పనిచేశారు. అప్పట్లో చైనాపై వాణిజ్యయుద్ధం, కొవిడ్ సమయంలో పాలసీ, 2020 ఎన్నికల ఫలితాల తర్వాత 'క్యాపిటల్ హిల్స్' ఘటనలో నవారో ప్రమేయం ఉందంటారు. 2020 అల్లర్ల విషయంలో 2023లో ఆయన్ను అమెరికా కాంగ్రెస్ విచారణకు పిలిస్తే వెళ్లకపోవడంతో నాలుగు నెలల పాటు జైల్లో వేశారు. దీంతో ఆయనకు ట్రంప్ వీరభక్తుడిగా ముద్ర పడింది.

**నోటి దురుసుతో మస్క్‌నే వెళ్లగొట్టిన ఘనుడు...** 2024లో అమెరికా ఎన్నికలు ముగిసేనాటికి ట్రంప్–మస్క్‌ల మధ్య స్నేహం విపరీతంగా పెరిగిపోయింది. ఓ రకంగా టెస్లా అధినేతే షాడో ప్రెసిడెంట్ అనేవారు. కానీ, వాణిజ్యంలో నవారో సూచించే రక్షణాత్మక వైఖరి, టారిఫ్ యుద్ధం ఆయనకు నచ్చేది కాదు. టెస్లా విడిభాగాలు విదేశాల్లో తయారై అమెరికాకు వస్తే వాటిని ఇక్కడ అసెంబ్లింగ్ చేస్తున్నారని మస్క్‌ను దెప్పిపొడిచారు. ఓ దశలో 'కార్ అసెంబ్లర్' అని వ్యాఖ్యానించారు. ఓసారి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమక్షంలోనే మస్క్–నవారో తీవ్రంగా గొడవ పడ్డారన్న వార్త గుప్పుమంది. నవారో 'మూరు?దు' అంటూ మస్క్ బహిరంగానే పోస్టు పెట్టారు. ట్రంప్ నవారో పక్షాన ఉన్నట్లు అనిపించిన తర్వాత నుంచే మస్క్ మెల్లగా శ్వేతసౌధం నుంచి దూరమయ్యారు. ఇప్పుడు ట్రంప్–మస్క్‌ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేటట్లుంది. ట్రంప్ కార్యవర్గంలో వారితో నవారో గొడవపడటం ఇదే తొలిసారి కాదు, 2018లో నాటి ట్రెజరీ సెక్రటరీ స్టీవెన్‌తో కూడా ఓ చైనా ప్రభుత్వ కార్యాలయ భవనం లాన్‌లో బహిరంగానే గొడవ పడ్డారు. అంతేకాదు.. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు నరకంలో ప్రత్యేక స్థానం ఉంటుందని వివాదాస్పద వ్యాఖ్యలు చేసి క్షమాపణలు చెప్పారు.

**రెండోసారి అరాచకమే..** రెండోసారి ట్రంప్ కార్యవర్గంలో సలహాదారుగా పదవి దక్కాక అల్యూమినియం దిగుమతులపై 25శాతం సుంకం వెనక నవారోనే ఉన్నారు. ఇక భారత్‌పై ఆంక్షల విషయంలో ట్రంప్‌నకు మద్దతుగా నవారో స్వామిభక్తి ప్రదర్శిస్తున్నారు. ఈ యుద్ధం ఆగితే నోబెల్ బహుమతి వస్తుందని ట్రంప్ విశ్వసిస్తుండటంతో.. రష్యా–ఉక్రెయిన్ పోరు ఆపాలంటే భారత్ చమురు కొనుగోళ్లు నిలిచిపోవాల్సిందేనని విచిత్రవాదన తెర పైకి తెచ్చారు. న్యూదిల్లీతో సంబంధాలను దెబ్బతీస్తే.. అమెరికా రక్షణ లక్ష్యాలకు పెనుముప్పు అని నిక్కీహేలీ వంటి వారు నెత్తీనోరు బాదుకొంటున్నా ఈ నవారో ఆగడం లేదు.

**మా కంటే చైనానే ఎక్కువ కొంటోంది...** భారత్ కంటే ఎక్కువ చమురు చైనా, అధిక సీఎన్‌జీ ఐరోపా దేశాలు కొనుగోలు చేస్తున్నా నవారో నోరు మెదపడం లేదు. రష్యా ఆంక్షల చమురును భారత్ మారు బేరానికి విక్రయించి లబ్ధి పొందుతోందని అక్కసు ప్రదర్శిస్తున్నారు. కొన్నేళ్లతరబడి భారత్–అమెరికా నేతలు ఓర్పుతో నిర్మించిన వ్యూహాత్మక బంధంపై 'రష్యా చమురు'ను నవారో చిలకరిస్తున్నారు.

# న్యూడ్ క్రూయిజ్ షిప్ జర్నీ న్యూడ్ గా వారం పాటు ఎంజాయ్?

మియామీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన ప్రసిద్ధ "న్యూడ్ క్రూయిజ్" ఇప్పుడు కరీబియన్ దీవుల వైపు తన సాహసోపేత ప్రయాణాన్ని ప్రారంభించింది. ఈ వినూత్న ప్రయాణంలో పాలుపంచుకోవడానికి మీకు కావలసింది దుస్తులు కాదు.. కేవలం ధైర్యం, ఆత్మవిశ్వాసం మాత్రమే! బేర్ నెసెసిటీస్ అనే సంస్థ ఈ ప్రత్యేకమైన క్రూయిజ్‌ను నిర్వహిస్తుంది. ఇది ప్రతి సంవత్సరం జరిగే అతిపెద్ద, పెద్దల కోసం మాత్రమే ఉద్దేశించిన విహారయాత్రల్లో ఒకటి. ఈ క్రూయిజ్ యొక్క ప్రధాన ప్రత్యేకత ఏమిటంటే.. ఇది "క్లోథింగ్–ఆప్షనల్" (వస్త్రధారణ తప్పనిసరి కానిది).

అంటే మీరు పూర్తిగా న్యూడ్‌గా అయినా ఉండొచ్చు, లేదా స్వల్పంగా వస్త్రాలు ధరించినా సరే, ఇది పూర్తిగా మీ వ్యక్తిగత స్వేచ్ఛపై ఆధారపడి ఉంటుంది. ఈ క్రూయిజ్‌లో ప్రయాణీకులు ఒక వారం పాటు అపరిమితమైన స్వేచ్ఛా వాతావరణంలో విశ్రాంతి తీసుకోవచ్చు, వినోదించవచ్చు. సూర్యరశ్మిని ఆస్వాదించవచ్చు. సముద్ర తీరాల వద్ద న్యూడ్ ఫ్రెండ్లీ ఎక్స్కర్షన్లు, పూల్ సైడ్ పార్టీలు, ఉత్సాహభరితమైన డాన్సింగ్ ఈవెంట్‌లు, ప్రత్యేక ప్రదర్శనలు.. ఇలా ఎన్నో ఆహ్లాదకరమైన



కార్యక్రమాలు ఈ ప్రయాణంలో భాగంగా ఉంటాయి. ఇది కేవలం సాధారణ సెలవులు మాత్రమే కాదు. ఇది మీ శరీరాన్ని దాని సహజ రూపంలో స్వీకరించడంలో, మనసులోని అన్ని అడ్డంకులను అధిగమించడంలో ఒక సాహసిక యాత్ర. బహుశా, ఈ ప్రయాణం తర్వాత "స్వేచ్ఛ అంటే ఏమిటి?" అనే ప్రశ్నకు మీకు సరికొత్త అర్థం లభించవచ్చు. కాబట్టి మీ బట్టల బ్యాగులు ప్యాక్ చేయాల్సిన పనిలేదు! ఒక చిన్న హ్యాండ్‌బ్యాగ్, సన్‌స్క్రీన్, బోలెడంత స్వేచ్ఛ, ధైర్యం తీసుకుంటే చాలు. అపరిమితమైన ఈ న్యూడ్ క్రూయిజ్‌కు స్వాగతం! ముఖ్య గమనిక: ఇది పూర్తిగా 18 సంవత్సరాలు నిండిన వారి కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేయబడిన ప్రయాణం.

అన్ని భద్రతా మార్గదర్శకాలను పాటిస్తూ, ప్రతి ఒక్కరి హద్దులను గౌరవించడమే ఇందులో ప్రధాన ఉద్దేశ్యం.

# రూ.1.8 కోట్లతో మరణాన్ని మోసం చెయ్యొచ్చంట... ఎలాగో తెలుసా?

ఒక వ్యక్తి చనిపోయిన తర్వత మళ్లీ బ్రతకడం సాధ్యమేనా? ఒకటి రెండు సందర్భాల్లో గుండె ఆగిపోయిన కొన్ని నిమిషాల తర్వాత మళ్లీ బ్రతికారంటూ ఒకటి రెండు సంఘటనలు వినిపించినా.. పూర్తిగా మరణించిన రోజుల తర్వాత మళ్లీ బ్రతకడం సాధ్యమేనా? ఈ సమయంలో... మాగ్జిమం జనాలు చెప్పే సమాధానానికి భిన్నమైన సమాధానం చెబుతోంది జర్మన్ కు చెందిన స్టార్టప్ కంపెనీ! అవును... చనిపోయినప్పటికీ తిరిగి బతికించే అవకాశం కల్పిస్తానంటోంది జర్మన్ స్టార్టప్ కంపెనీ టుమారో బయో. వ్యక్తి చనిపోయిన తర్వాత వారి శరీరం, మెదడును క్రయోఫ్రీజరేషన్ ల్యాబ్ లో –196 డిగ్రీ సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలో భద్రపరచడంతో ఇది సాధ్యమవుతుందని అంటున్నారు. మాజీ క్యాన్సర్ పరిశోధకుడు డాక్టర్ ఎమిల్ కెండ్జియోరా, ఇంజనీర్ ఫెర్నాండో అజెవెడో పిన్హీరో స్థాపించిన ఈ కంపెనీ.. చట్టబద్ధమైన మరణం తర్వాత అతి తక్కువ ఉష్ణోగ్రతల వద్ద నిల్వ చేయాలని



ఎంచుకునే వ్యక్తుల కోసం దీర్ఘకాలిక క్రయోప్రెజర్వేషన్ సేవలను అందిస్తుంది. అది ఎప్పటివరకూ అంటే... భవిష్యత్తులో మెడికల్ టెక్నాలజీ అభివృద్ధి చెంది జీవ పునరుద్ధరణకు అవకాశం కలిగే వరకూ! దీనికి సంబంధించి ధరల పట్టిక కూడా విడుదలై ఉంది. ఇందులో భాగంగా.. పూర్తి శరీరాన్ని ఫ్రీజర్ చేయాలంటే 2 లక్షల డాలరు (సుమారు రూ. 1.8 కోట్లు) కాగా.. మెదడుకు 78వేల డాలర్లు (సుమారు రూ. 67.2 లక్షలు) చెల్లించాల్సి ఉంటుంది! ఈ సందర్భంగా స్పందించిన డాక్టర్ ఎమిల్ కెండ్జియోరా... కంపెనీ ఇప్పటివరకూ 20 మానవ మృతదేహాలను, 10 పెంపుడు జంతువులను క్రయోప్రిజర్వ్ చేసినట్లు తెలిపారు. అంతేకాదు.. ఇప్పటివరకూ సుమారు 800 కంటే ఎక్కువ మంది సైన్ అప్ చేశారు! ఇదే సమయంలో... అమెరికా, యూరప్ అంతటా 1,000 మంది సైన్ అప్ లను చేరుకునే దిశగా ముందుకు కదులుతున్నట్లు తెలిపారు. ఇదే సమయంలో... ఎలుకలలో అవయవ పునరుజ్జీవనానికి కొన్ని ఆధారాలు కూడా ఉన్నాయని కెండ్జియోరా అన్నారు. 2023లో యూనివర్శిటీ ఆఫ్ మిన్నెసోటా ట్విన్ సిటీస్ పరిశోధకులు ఎలుక మూత్రపిండాలను క్రయోజెనిక్ గా సుమారు 100 రోజులు నిల్వ చేసి.. వాటిని తిరిగి వేడి చేసి, క్రయోప్రొటెక్టివ్ ద్రవాలను తొలగించి, వాటిని తిరిగి ఐదు ఎలుకలలోకి మార్పిడి చేయగా.. 30 రోజుల్లోపు అవి పూర్తి పనితీరు కనబరిచాయని తెలిపారు!

చురకలు

## సంపాదకీయం

# బీహార్ లో బీజేపీ ఓడితే మోడీ సర్కార్ కూలుతుందా ?

కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇప్పటికి మూడు దఫాలుగా అధికారంలో ఉంటూ వచ్చింది. అయితే 2024 ఎన్నికల్లో మాత్రం సొంతంగా మెజారిటీ అయితే రాలేదు. బీజేపీకి 240 ఎంపీ సీట్లు మాత్రమే వచ్చాయి. దాంతో ఏపీ నుంచి తెలుగుదేశం బీహార్ లో ఉన్న జేడీయూ మద్దతు అనే రెండు ఊతకర్రలతో ముందుకు సాగుతోంది. ఇక బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భవిష్యత్తు బీహార్ ఎన్నికల ఫలితాల మీద ఉందా అన్న చర్చ సాగుతోంది.

**గ్రాఫ్ తగ్గుతున్న వేళ :**ఇక చూస్తే బీజేపీకి గ్రాఫ్ మెల్లగా తగ్గుతోంది అని విశ్లేషకులు చెబుతున్నారు. బీజేపీ ఆపరేషన్ సింధూర్ విషయంలో వ్యవహరించిన తీరు ట్రంప్ పదే పదే భారత్ ని తానే యుద్ధం ఆపించాను అని చెప్పడం దానికి ధీటుగా బదులు ఇవ్వలేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం మీద జనంలో అయితే సందేహాలు అలాగే ఉన్నాయి. ఒక ఈ మధ్యలో ఓట్ల చోరీ అని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అతి పెద్ద ప్రచారం స్టార్ట్ చేశారు. ఆయన జనంలోకి వెళ్ళి ఈసీ మీద బీజేపీ మీద బలమైన ఆరోపణలు చేస్తున్నారు. అవి బాగానే చర్చకు వస్తున్నాయి. ఇక బీహార్ లో చూస్తే రాహుల్ ఓటు అధికార్ యాత్ర పేరుతో చేస్తున్న పర్యటనలకు మంచి స్పందన లభిస్తోంది అని అంటున్నారు.

**బీహార్ లో ఎదురు గాలి వీస్తే :** ఈ నేపధ్యంలో బీహార్ లో కాంగ్రెస్ నాయకులు జనంలోకి వెళ్ళి చాలానే ప్రచారం చేస్తున్నారు. కేంద్రంలో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భవితవ్యం బీహార్ ఓటర్లు ఇచ్చే తీర్పు మీదనే ఉంది అని వారు అంటున్నారు. కాంగ్రెస్ మహిళా నాయకురాలు అల్కా లాంబా అయితే కాస్తా ముందుకు వెళ్ళి బీహార్ నుంచి బీజేపీని తరిమి కొట్టండి దేశంలోనే ఆ పార్టీ గద్దె దిగుతుంది అని ప్రచారం చేస్తున్నారు. ఎన్డీయే కూటమి విచ్చిన్నం అవుతుందని ఆ విధంగా మోడీ గద్దె దిగుతారు అని కూడా ఆమె గంభీరమైన ప్రకటనలు చేస్తున్నారు.

**బాబు నితీష్ ఇద్దరూ :** అదెలా సాధ్యమో ఆమె చెబుతున్నారు. బీహార్ లో బీజేపీ నాయకత్వం లోని ఎన్డీయే ప్రభుత్వం కూలితే జేడీయూ నేత నితీష్ కుమార్ కూడా ఎన్డీయే నుంచి బయటకు వస్తారని ఆమె జోస్యం చెబుతున్నారు. అంతే కాదు ఏపీ నుంచి చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ కూడా ఎన్డీయే కూటమి నుంచి బయటకు వస్తుందని ఆమె గట్టిగానే చెబుతున్నారు. ఈ రెండు పార్టీల మద్దతు పోతే కనుక ఎన్డీయే సర్కార్ కేంద్రంలో కూలుతుందని ఆ విధంగా ప్రజలకు బీజేపీ ఇబ్బందులు తొలగిపోతాయని అంటున్నారు.

**ఇది సాధ్యమేనా :** ఏపీ నుంచి టీడీపీ బీహార్ నుంచి జేడీయూ ఎన్డీయే ప్రభుత్వం తో తెగదెంపులు చేసుకుంటారా అన్నది కూడా చర్చకు వస్తోంది. అసలు ఇది జరిగే పనేనా అని కూడా అంటున్నారు. అయితే రాజకీయాల్లో ఎపుడు ఏమి జరుగుతుందో ఎవరూ ఊహించలేరని అంటున్నారు ఈ మధ్యనే జగన్ రాహుల్ గాంధీ బాబుల మధ్య హాట్ లైన్ నడుస్తోందని ఆరోపించారు. ఆ విషయం కూడా పెద్ద ఎత్తున జాతీయ స్థాయిలో చర్చ జరిగింది. కానీ ఇపుడు కాంగ్రెస్ మహిళా నాయకురాలు అల్కా లాంబా దీని మీద చేస్తున్న ప్రకటనలు చెబుతున్న జోస్యాలు దేశంలో అతి పెద్ద చర్చకు ఆస్కారం ఇస్తున్నాయి. మొత్తం మీద చూస్తే బీహార్ కి కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ఏదో బంధం ఉందా అన్నదే అంతా ఆలోచిస్తున్నారు. ఇవన్నీ లెక్క తేలాలి అంటే నవంబర్ వరకూ వేచి చూడాల్సిందే.

# భారత సాహిత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన రచయిత ఆర్కే నారాయణ్ - అక్టోబర్ 10.. మాల్గుడి పట్టణ సృష్టికర్త జన్మదినం




సాహిత్యం ద్వారా భారత దేశాన్ని బయటి ప్రపంచానికి పరిచయం చేసిన వారిలో నారాయణ్ ఒకడు. భారత దేశ ఆంగ్ల తొలి తర సాహిత్య రంగానికి చెందిన ముగ్గురు గొప్ప ఇంగ్లీష రచయిత లలో ఆయన ఒకడు. ముల్క్ రాజ్ ఆనంద్, మరియు రాజారావులు మిగిలిన ఇద్దరు. గురువు, మిత్రుడైన గ్రహం గ్రీన్ సహాయంతో నారాయణ్ వెలుగులోకి వచ్చాడు. ఆయన రాసిన మొదటి నాలుగు పుస్తకాలను ప్రచురించ డానికి ప్రచురణ కర్తలను ఒప్పించడంలో గ్రహం గ్రీన్ ముఖ్యపాత్ర పోషించాడు. ఆయన మొదటి రచన "డెవెలప్మెంట్ అఫ్ మారిటైం లాస్ అఫ్ 17త్ సెంచరీ ఇంగ్లాండ్" అనే పుస్తక పరిచయం. 1951 సంవత్సరపు అత్యుత్తమ అసలైన నవలగా పేరొందిన "ది ఫైనాన్షియల్ ఎక్సుర్ట్", "సాహిత్య అకాడెమీ పురస్కారం" గెలిచిన "ది గైడ్" నారాయణ్ రాసిన ఇతర నవల లలో కొన్ని. ది గైడ్ నవల హిందీ, ఇంగ్లీషలలో సినిమాగా తీయబడింది. ఆర్.కే. నారాయణ్‌గా పిలువబడే రాశిపురం కృష్ణస్వామి అయ్యర్ నారాయణస్వామి ( 1906 అక్టోబరు 10 - 2001 మే 13)న ఆర్.కే. నారాయణ్ మద్రాస్ (ప్రస్తుత చెన్నై) లో జన్మించాడు. ఆయన తండ్రి ఒక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు. నారాయణ్ అదే పాఠశాలలో కొన్నాళ్ళు చదివాడు. ఉద్యోగరీత్యా తండ్రి తరచూ బదిలీ అవుతూ ఉండడంతో, నారాయణ్ తన బాల్యంలో కొన్నాళ్ళు అమ్మమ్మ పార్వతి వద్ద పెరిగాడు. అమ్మమ్మ పార్వతి... నారాయణ్‌కు గణితం, పురాణాలు, భారతీయ శాస్త్రీయ సంగీతం, సంస్కృతం నేర్పించింది. ఆయన తమ్ముడు ఆర్.కె.లక్ష్మణ్ ప్రకారం, కుటుంబ సభ్యులు అందరు సాధారణంగా ఇంగ్లీష లోనే సంభాషించే వారు. నారాయణ్, ఆయన తోబుట్టువులు ఏదైనా వ్యాకరణ తప్పులు చేస్తే, కుటుంబ సభ్యులు సహించేవారు కాదు. ఆయన ఒక గొప్ప భారతీయ రచయిత. ఇతడు "మాల్గుడి" అనే ఒక కాల్పనిక పట్టణాన్ని సృష్టించి దానిలోని ప్రజలు, వారి వ్యవ హారాల గురించి ధారావాహిక నవలలు, కథలు వ్రాసాడు. మాల్గుడి, నారాయణ్ సృష్టించిన ఒక కాల్పనిక, పాక్షిక నగర వాతావరణం కలిగిన దక్షిణ భారత పట్టణం. ఆయన ఈ పట్టణాన్ని సెప్టెంబరు 1930న విజయ దశమి నాడు సృష్టించాడు. మొదట ఆయన మదిలో ఒక రైల్వే స్టేషను మెదిలి, తరువాత నెమ్మదిగా మాల్గుడి అనే పేరు తట్టినట్లు ఇతడు చెప్పుకున్నాడు. రామాయణ కాలం నుండి ఉన్న నిష్కళంకమైన చరిత్ర గల పట్టణంగా మాల్గుడి సృష్టించ బడింది. శ్రీరామచంద్రుడు ఈ పట్టణం మీదుగా వెళ్ళినట్లు వ్రాయబడిందిబి బుద్ధుడు కూడా మార్గ మధ్యంలో ఈ పట్టణాన్ని సందర్శించినట్లు వ్రాయబడింది. నారాయణ్ ఈ పట్టణానికి కచ్చితమైన భౌగోళిక హద్దులు ఎప్పుడూ పెట్టలేదు. కథలో వచ్చే సంఘటనలకు అనుగుణంగా ఊరి రూపురేఖలు తరచూ మార్చి, భవిష్యత్తు కథలకు రంగం సిద్దం చేసేవాడు. నారాయణ్ రాసిన కథలలో అనేకం మాల్గుడి అనే ఒక కల్పిత పట్టణం భూమికగా జరుగు తాయి. మొదటి సారిగా కాల్పనిక పట్టణం... స్వామి అండ్ ఫ్రెండ్స్ నవలలో పరిచయం చేయబడింది. డా. జేమ్స్ ఎం. ఫెన్నెలీ, నారాయణ్ రాసిన అనేక పుస్తకాలు, కథల ఆధారంగా మాల్గుడి రేఖాచిత్రాన్ని రూపొందించాడు. భారత దేశములో మారుతున్న రాజకీయ పరిణామాల బట్టి మాల్గుడి కూడా మారుతూ వచ్చింది. ఆయన కథలు సామాజిక సంబంధాలని ఎత్తి చూపి, రోజూవారి జరిగే యథార్థ సంఘటనల ద్వారా పాత్రలకు ప్రాణం పోస్తాయి. 1980లలో, భారత దేశంలో జాతీయ వాదం గట్టిగా పెరుగుతున్న సమయంలో, పట్టణాలకు, ప్రాంతాలకు బ్రిటిష్ పేర్లని మార్చేయడం వంటి కార్యక్రమాలు జరుగుతూ ఉండేవి. కొంత కాలం తరువాత నారాయణ్‌కు అమెరికా సంయుక్త రాష్ట్రాలలో గుర్తింపు లభించింది. "మిచిగన్ స్టేట్ యూనివర్సిటీ ప్రెస్" ఆయన పుస్తకాలను ప్రచురించడం ప్రారంబించింది. మొదటిసారి అమెరికా దేశానికి "రాక్ ఫెల్లర్ ఫౌండేషన్ వారి ఫెలోషిప్" మీద వెళ్ళాడు. అక్కడ మిచిగన్ స్టేట్ యూనివర్సిటీ, యూనివర్సిటీ అఫ్ కాలిఫోర్నియా, బెర్క్లీ వంటి అనేక విశ్వ విద్యాలయాలలో ప్రసంగాలు చేశాడు. ఈ తరుణంలో జాన్ అప్డైక్ ఆయన రచనను గమనించి, "చార్లెస్ డికెన్స్"తో పోల్చాడు. అనేక నవలలు, వ్యాసాలు, చిన్న కథలు రాసిన నారాయణ్, భారత సాహిత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన వ్యక్తిగా పేరొందాడు. శశి థరూర్, శశి దేశ్‌పాండే, వి.ఎస్. నయపాల్, వ్యాట్ మేసన్, శ్రీనివాస అయ్యంగార్, విలియం వాల్ష్, అనితా దేశాయ్ వంటి దేశ విదేశాల విమర్శకులు నారాయణ్ రచనలపై విశ్లేషణలు చేశారు. అరవై ఏళ్ళకు పైగా రచనలు చేసిన నారాయణ్‌కు అనేక పురస్కారాలు, గౌరవాలు అందాయి. భారత దేశపు రెండవ అత్యుత్తమ పౌర పురస్కారమైన "పద్మ విభూషణ్" పురస్కారాన్ని ఆయన అందుకున్నాడు. పెద్దల సభ ఐన "రాజ్యసభకు నామినేట్" చేయబడ్డాడు. ఆయనకు లభించిన మొదటి పెద్ద గుర్తింపు, "ది గైడ్" నవలకు 1958లో బహూకరించ బడిన "కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు" లభించింది. 1980లో రాయల్ సొసైటీ అఫ్ లిటరేచర్ వారు "ఏ.సి.బెన్సన్ మెడల్" బహూకరించారు. ఆయన ఆ సొసైటిలో ఒక సభ్యుడు. 1982లో ఇతడిని అమెరికన్ అకాడమీ అఫ్ ఆర్ట్స్ అండ్ లెటర్స్ వారు గౌరవ సభ్యుడుగా ఎన్నుకున్నారు. ఆయన పేరు పలుమార్లు సాహిత్యంలో "నోబెల్ బహుమతి"కి పరిశీలించ బడింది, కాని ఆ పురస్కారం ఇతనికి దక్కలేదు. యూనివెర్సిటీ అఫ్ లీడ్స్ (1967), మైసూరు విశ్వ విద్యాలయం (1976), ఢిల్లీ విశ్వ విద్యాలయం (1973) మొదలైన విశ్వ విద్యాలయాలు గౌరవ డాక్టరేట్ ఇచ్చి గౌరవించాయి. సాహిత్య రంగానికి చేసిన సేవకు గుర్తింపుగా నారాయణ్ భారత "రాజ్య సభ"కు ఆరు సంవత్సరాల కాలానికి నియమితు డైనాడు. ఆయన మరణించడానికి ఒక సంవత్సరం ముందు, 2000లో భారత దేశపు రెండవ అతి గొప్ప పౌరపురస్కారం "పద్మ విభూషణ్" ఆయనను వరించింది. మైసూరులో ఆయన నివసించిన గృహాన్ని 2016లో ఇతని గౌరవ సూచకంగా ఒక మ్యూజియంగా మార్చారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**


# అపర ధన్వంతరి దీవి గోపాలాచార్యులు - అక్టోబర్ 10...దీవి గోపాలాచార్యులు జయంతి



వేదముల వలెనే ఆయుర్వేదం బ్రహ్మచే స్వయంగా తెలుసుకొనబడి, బ్రహ్మ నుండి దక్షప్రజాపతి, ఆయన నుండి అశ్వినీ దేవతలు, వారి నుండి ఇంద్రుడు ఆయుర్వేదమును నేర్చుకున్నారన్నది పురాణ వాక్యం. అనేక వ్యాధులను నయం చేయాలన్న సదుద్దేశంతో భరద్వాజ, ఆత్రేయ, కశ్యప, కాశ్యప, నిమి మొదలగు ఋషులు ఇంద్రుని వేడుకోగా, కాయ, బాల, గ్రహ, ఊర్ధ్వాంగ (శాలక్య), శల్య, దంష్ట్ర, జరా, వృష అను 8 విభాగాలతో కూడిన ఆయుర్వేదమును ఆ ఋషులకు ఇంద్రుడు ఉపదేశించగా , ఆ ఋషులు భూలోకమున శిష్యులకు ఉపదేశించారని, అగ్నివేశుడు మొదటిగా అగ్నివేశ తంత్రము అనే గ్రంథమును రచించగా, ఆయుర్వేద అవతరణ జరిగినట్లు కథనాలు. "ఆయువిందతివేత్తివా ఆయుర్వేదః" అన్నది నానుడి. అంటే ఆయువును గూర్చిన విజ్ఞానం. ఇది భారత దేశంలో అతి పురాతనకాలం నుండి వాడుకలో ఉన్న వైద్యం. ఆధునిక వైద్యం కారణంగా, ఇది కొంచం వెనకబడినా ప్రస్తుతకాలంలో తిరిగి ప్రాచుర్యాన్ని సంతరించుకుంటున్నది. శస్త్రచికిత్స చేసే కొన్ని వైద్యరీతుల్లో ఆయుర్వేదం ఒకటి. శాఖోపశాఖలుగా విస్తరించిన ఈ వైద్య ప్రక్రియలు ఆధునిక వైద్యానికి లొంగని కొన్ని రకాలైన దీర్ఘకాలిక వ్యాధుల్ని, మొండి వ్యాధుల్ని సైతం నయం చేస్తాయని చెబుతారు. భారత దేశంలో సహస్రాబ్దుల నుండి ఆచరణలో ఉన్న ఆయుర్వేదంను నిషేధించాలని బ్రిటిష్ ప్రభుత్వం భావించి అది అశాస్త్రీయం అని నిరూపించటానికి కి ఒక సంఘం ఏర్పరచి, దానితో అశ్వగంధ బలాతిబల మొదలైన మహా మూలికలను నిష్ప్రయోజనం అని నిరూపింప జేసి ఆయుర్వేదాన్ని భూస్థాపితం చేసే తీవ్ర ప్రయత్నం చేసింది. ప్రమాదం పసిగట్టి భారత వైద్య ప్రతినిధిగా ఎదిరించి నిలిచి "ఆయుర్వేద కాంగ్రెస్ " స్థాపించి ఆసేతు హిమనగం, బర్మా, కాబూల్ లలో పర్యటించి, మహా పండితులను ఏకం చేసి ఉద్యమానికి బాసటగా మద్రాస్ లో ఆయుర్వేద కళాశాల స్థాపించి, అనేక ఆయుర్వేద గ్రంథాలకు సులభ వ్యాఖ్యలు రాసి ప్రచురించి ఆయుర్వేదం మహోన్నత వైద్య విధానం అని ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తీ పండిత దీవి గోపాలాచార్యులు. ఆయన ఆనాడు అంతగా కృషి చేయక పోతే, నేడు ఆయుర్వేదం మచ్చుకైనా కనిపించేది కాదు. దీవి గోపాలాచార్యులు (అక్టోబరు 10, 1872 - సెప్టెంబరు 29, 1920) వైద్య శాస్త్రవేత్త, హిందూ సంప్రదాయ వైద్య పరిశోధకులు, ఆయుర్వేద పండితులు, అఖిల భారత ఆయుర్వేద విద్యాపీఠానికి పూర్వాధ్యక్షులు. ఆయుర్వేద వైద్య చికిత్సకు దేశస్థాయిలో కీర్తి ప్రతిష్టలు తెచ్చిన అపర ధన్వంతరిగా పేరు సంపాదించారు. ఆధునిక కాలంలో ఆయుర్వేద వైద్య చికిత్సకు పునరుజ్జీవం కల్పించారు. దక్షిణా పథంలో ఆయుర్వేద వైద్యానికి పునఃప్రాణ ప్రతిష్ఠ చేసి, యావద్భారత ఖ్యాతి గాంచిన ఏకైక ఆంధ్రుడు. ఆయన స్వగ్రామం. కృష్ణా జిల్లా, నాగాయలంక మండలం (దివిసీమ) లోని భావదేవరపల్లి గ్రామం . అయితే బందరులో 1872, అక్టోబరు 10 న జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసానంతరం 1886 లో తిరుపతి వెళ్ళి మహంతు పాఠశాలలో కొంతకాలం చదివారు. సంస్కృత భాషాధ్యయనం పూర్తి చేసిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా పర్యటనలు చేశారు. సామాజిక సేవకు ప్రాచీన హిందూ సంప్రదాయ వైద్య విధానమే ఉత్తమమని నిర్ధారణకు వచ్చారు. కర్ణాటక రాష్ట్రం చేరి, మైసూరులోని సంస్కృత కళాశాలలో చేరి, ఆయుర్వేద వైద్య విద్యార్థిగా విద్యాభ్యాసం చేశారు. ప్రాచీన హిందూ వైద్య శాస్త్రాలలో ప్రధాన విభాగంగా రూపొందిన ఆయుర్వేద వైద్య చికిత్సా శాస్త్రమును ఔపోసన పట్టారు. 1893 లో వైద్య విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకొని రెండేళ్ళపాటు విస్తృతంగా దేశ పర్యటనలు చేశారు. నగరాలలోని, కుగ్రామాల లోని భిషగ్వర్యులను శుశ్రూషతో సేవించి, వైద్య పరిశోధనలు చేశారు. ఆయా ప్రాంతములలోని ప్రకృతి వనరులను, మూలికలను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఆ సమయంలో (1894-95) కలరా, ప్లేగు వ్యాధులు దేశమంతా వ్యాపించి ఉన్నాయి. సరైన చికిత్స, ప్రామాణిక మందులు లేక వందలాది మంది మృత్యువాత పడటం చూసిన ఈయన మనసు తల్లడిల్లి పోయింది. బెంగళూరు లోని థియోసాఫికల్ సొసైటీ వారి ఆసుపత్రిలో వైద్యులుగా చేరి చాలాకాలం వైద్య సేవలు అందిస్తూ, ప్రత్యక్ష శాస్త్రానుభవాన్ని సంపాదించారు. 1898-99 లో బెంగళూరు నగరాన్ని కూడా గొప్ప భయంకర ప్లేగు వ్యాధి చుట్టు ముట్టింది. ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. మైసూరు మహారాజు ఈయనను రాష్ట్ర ఆస్థాన చికిత్సకులుగా నియమించారు. ప్లేగు, కలరా వ్యాధుల నిరోధానికి ప్రాచీన హిందూ సంప్రదాయ వైద్యాన్ని ఉపయోగించుకొని "శతధౌత ఘృతం" "హైమాది పంక్రమ్ (పానకం)" అనే రసాయ నాలను సృష్టించి ఔషధ రూపంలో వ్యాధిగ్రస్తులకు అందించారు. ఆ విధంగా ప్రజలకు ఎంతో మేలు ఒన కూర్చారు. తర్వాత చెన్నపట్టణం చేరి, శ్రీకన్యకా పరమేశ్వరి ఆయుర్వేద కాలేజి అండ్ హాస్పిటల్ లో ప్రొఫెసర్ గా, వైద్యులుగా పనిచేశారు. ఇంగ్లీష రాకున్నా ఎనిమిది భారతీయ భాషలు మీద సాధికారత సంపాదించు కున్నారు. వైద్యులుగా పనిచేస్తున్న సమయం లోనే మద్రాసులోనే ఆయుర్వేదా శ్రమమును నెలకొల్పి, మరణించే వరకు అక్కడే ఉన్నారు. మద్రాసు ఆయుర్వేద కాలేజీకి కొంతకాలం ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు. ఆయుర్వేదాంగ శల్యతంత్రము అనే గ్రంథం రచించారు. దేశీయ ఆయుర్వేద వైద్యానికి ప్రాచుర్యం తీసుకు రావాలనే మహదాశయంతో "ఆయుర్వేదా శ్రమ గ్రంథమాల"ను ఏర్పాటు చేసి వివిధ భారతీయ భాషలలోని ప్రాచీన గ్రంథాలను సేకరించి, ఎంతో అరుదైన వాటిని అనువదింప జేశారు. ఈ గ్రంథమాల నుంచి దాదాపు 22 అతి ముఖ్యమైన వైద్య శాస్త్ర గ్రంథాలు వెలువడినాయి. వాటిలో మాధవ నిదానం, అర్క ప్రణాళిక, ఆయుర్వేద వైద్య పరిభాష, రస ప్రదీపిక, భేషకల్పం మొదలైన శీర్షికలతో ప్రాచీన హిందు వైద్య గ్రంథాలకు తెలుగులో చక్కని వ్యాఖ్యానాలు జోడించి, వివరించారు. ఆయన వైద్య సేవలు గుర్తింపుగా, నాసిక్ (ప్లేగు వ్యాధితో అట్టుడికి పోయిన పట్టణం) లో "ఆయుర్వేద మార్తాండ", కలకత్తాలో "భిషజ్మణి" బిరుదులు అందుకున్నారు (1907), అయిదవ జార్జి బ్రిటీష్ పాలక ప్రభుత్వం తరపున "వైద్యరత్న" బిరుదును అందించి (1913) ప్రతిష్ఠాత్మక గౌరవ మన్ననలు అందించారు. ఆయుర్వేద వైద్య జగత్తుకు ప్రచారం కల్పించటానికి అహరహం కష్టించారు. ఆయన జీవితమే భారతదేశ ఆయుర్వేద చరిత్రగా భాసిల్లింది. 1901లో మద్రాసు ఉమ్మడి రాష్ట్రంలో తొలి ఆయుర్వేద కళాశాలను స్థాపించారు. 1902లో చెన్నపురి ఆయుర్వేద ప్రచారిణి సభ ప్రారంభించారు. 1905 లో ఆయుర్వేద కళాశాల తొలి పట్ట భద్రుల బృందం బయటికి వచ్చింది. 1917లో ఆయన అఖిల భారతా యుర్వేద విద్యాపీఠానికి అధ్యక్షత వహించి దేశ వ్యాప్తంగా ఆయుర్వేద అభివృద్ధికి కృషిచేశారు. వైద్యరత్న, ఆయుర్వేద మార్తాండ భిష్మణి బిరుదు పొంది ప్రఖ్యాతిచెందారు. దేశవ్యాప్తంగా ఆయుర్వేదాన్ని ప్రచారం చేయడంలో, విస్తృతమైన వ్యాప్తికి కృషిచేయడంలోనూ ప్రశస్తిపొందారు. పలు జాతీయ సదస్సుల్లో, కార్యకలాపాల్లో ప్రసంగాలు చేశారు. 1919 లో "శ్రీ ధన్వంతరి" పక్ష పత్రికను స్థాపించి ఆంధ్ర దేశమంతటా వ్యాపింప జేశారు. ఆయుర్వేద వైద్య ప్రచారానికి తమ సంపాదనంతటినీ ఖర్చు చేశారు. "ఆల్ ఇండియా ఆయుర్వేదిక్ కాంగ్రెస్"కు అధ్యక్షులుగా కొద్దికాలం ఉన్నారు. ఆయుర్వేద వైద్య ప్రక్రియలో నూతన ఆవిష్కారాలు చేసిన ఈయన 1920, సెప్టెంబరు 29 న మృతి చెందారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# ఒత్తిళ్లే మానసిక వైకల్యానికి మూలం - మానసిక ఉద్రేకాల నిగ్రహం అవసరం - అక్టోబర్ 10... 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం'




ప్రతీ ఏడాది అక్టోబర్ 10న 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం' జరుపు కుంటున్నాం. నేటి ఔతాహిక యువ తరంలో శారీరక సమస్యలతో పాటు మానసిక సమస్యలు ఉన్న వారి సంఖ్య పెరుగుతోంది. కొందరు వాటిని బయటకు చెప్పుకోలేక సత మవుతూ ఉంటారు. సమాజం వాటిని మరొక కోణం లోనే చూస్తున్న. ఈ నేపథ్యంలో మానసిక అనారోగ్య సమస్యను సాధారణ అనారోగ్యంగా భావించాలని తెలి పేందుకే ఈ రోజు నిర్వహిస్తున్నారు. 1992లో వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెంటల్ హెల్త్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మనిషి పుట్టాక ఎలాంటి వైకల్యం లేకుండా ఉంటే అతడి జీవితం హ్యాపీగా సాగుతుంది. ఐతే చిన్న వైకల్యం ఉన్నా అది జీవితాంతం అతడిని పీడిస్తుంది. ఐతే కొందరు పుట్టుకతో ఆరోగ్యకరంగా బాగానే ఉన్నప్పటికీ హఠాత్తుగా మానిసిక రోగులుగా మారి పోతుంటారు. నిజానికి మనలో 40 శాతం పిచ్చి వాళ్ళేననేది నిపుణుల అంచనా అది మెడికల్ అనాలిసిస్ మాత్రమే. ఇంకా ఫ్రాంకుగా, నిఖార్సుగా చెప్పాలంటే పూర్తి నార్మల్ గా వుండేవాళ్లు బహుశా ఏ రెండు శాతమో వుంటారు. మనచుట్టూ ఎంత అబ్ నార్మాలిటీ?! ఎన్ని వింత పోకడలు? తిండి పిచ్చి, డబ్బు పిచ్చి, నగల పిచ్చి, పుస్తకాల పిచ్చి పేరుపిచ్చి, సినిమాల పిచ్చి.. గొప్పలు చెప్పడం, అప్పులు చేయడం ఆడంబరాలు పోవడం, షాపింగు, అతి వాగుడు, మితిమీరిన కోపం... వైద్య పరి భాషలో డిప్రెషన్, యాంగ్జయిటీ, యాంగ్జయిటీ న్యూరోసిస్, బైపోలార్ డిజార్డర్, సోషల్ యాంగ్జయిటీ డిజార్డర్, పానిక్ డిజార్డర్, అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్, పోస్ట్ ట్రమాటిక్ స్ట్రెస్ డిజార్డర్, ఫోబియా, మానియా స్కిజోఫ్రీనియా, డిల్యూషనల్ డిజార్డర్, స్లీప్ డిజార్డర్ ఇన్సోమ్నియా), ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్, సుపీరియారిటీ కాంప్లెక్స్ ఇల్యూషన్, అడిక్షన్ లాంటి మానసిక వైకల్యాలు అనేకం ఉన్నాయి. స్థూలంగా చెప్పాలంటే మానసిక ఉద్రేకాలను నిగ్రహించు కోలేకపోవడమే రుగ్మతను తెచ్చి పెడ్తుంది. ఏ లక్షణమైనా సరే అవధులు దాటినప్పుడు అది పిచ్చి చేష్ట అవుతుంది. హద్దుల్లో మనం వుండి, బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తున్నంత వరకు ఎవరూ మనని తప్పుపట్టారు. మానసిక వైకల్యం వచ్చిన వారిలో సగానికి పైగా 14 ఏళ్ల లోపు వయసు నుంచి ఈ సమస్య ప్రారంభ మవుతుంది. మొత్తం 20 శాతం మంది బాల బాలికల్లో ఈ అవలక్షణం ఉన్నట్లు తేలింది. భయంకర సంఘటనలు, సామాజిక పరిస్థితుల కారణంగా మానసిక వైకల్యం చెందడం సర్వ సాధారణమైన కారణంగా చెపుతారు. మానసిక సమస్యతో బాధపడే వారిని గుండె సంబంధిత సమస్యలు, మధుమేహం, గ్యాస్ట్రిక్ సమస్యలు కూడా వెంటాడుతాయి. మానసికంగా బలహీనంగా ఉన్నవారు పూర్తిగా ఆ సమస్యలో కూరుకుపోవడానికి కారణం సదరు వ్యక్తి కుటుంబ సభ్యులు కూడా కారణమవుతున్నారు. సమాజంలో మానసిక అనారోగ్యంతో బాధ పడుతున్న వారికి కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి. 1). సంఘానికి వ్యతిరేకంగా ప్రవర్తించడం.... కొంతమంది వ్యక్తులు ప్రత్యేకించి కొన్నిసార్లు విపరీతమైన కోపాన్ని ప్రదర్శిస్తిస్తూ అరుస్తూ పిచ్చిగా ప్రవర్తిస్తుంటారు. వీరి ప్రవర్తన ఇతరులకు హాని కలిగించేదిగా ఉంటుంది. 2).అమ్నోసియా... ఇది కూడా సర్వసాధారణంగా కనబడేదే. వీరిలో కనిపించే లక్షణం మర్చిపోవడం. బ్రెయిన్ డ్యామేజ్ కారణంగా చెప్పినవి, జరిగినవి మర్చి పోతుంటారు. 3).ఆస్పర్జర్స్ సిండ్రోమ్.... వీరిని కూపస్త మండూకాలని చెప్పవచ్చు. సమాజంలో ఎవ్వరితోనూ వీరికి సంబంధాలు ఉండవు. ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడుతుంటారు. ఎవరితోనూ మాట్లాడేందుకు ఇష్టపడరు. ప్రత్యేకమైన వ్యక్తులుగా అగుపిస్తుంటారు. 4).మహా ఒత్తిడి... ఈ ఒత్తిడి అనేది చాలా పెద్దపదం. దీని కారణంగా చాలామంది ప్రాణాలు తీసుకున్న సంఘటనలున్నాయి. ఈ ఒత్తిడి సమస్య కారణంగా వారిపై వారికి నమ్మకం సన్నగిల్లుతుంది. సంతోష కరమైన పండుగలు ఇతరత్రా ఏవి వచ్చినా వాటిని జరుపు కునేందుకు ఆసక్తి చూపరు. ప్రతిదాన్ని విమర్శిస్తూ తిట్టుకుంటూ ఉంటారు. నలుగురితో కలిసి తిరగడం వీరికి అస్సలు ఇష్టం ఉండదు. ఇలాంటి వారి మానసిక స్థితిని మామూలు స్థితికి తీసుకు రాకపోతే ఆత్మ హత్యలకు పాల్పడేందుకు అవకాశం ఉంటుంది. 5).ఓసీడీ... ఒబెసివ్ కంపల్సివ్ డిజార్డర్... అంటే వీరు ఒకరకంగా మతిమరుపు టైపే. పెట్టిన చోట వస్తువు ఉందో లేదో అని పదేపదే చెక్ చేసుకుంటూ ఉంటారు. అలాగే ప్రతి చిన్నదానికి చేతులు కడుక్కోవడం, ఇంట్లో ఉన్న వస్తువులను లెక్కబెట్టడం, అకస్మాత్తుగా స్నానం చేయడం, తలుపులు వేసి ఉన్నాయో లేదో అని పలుమార్లు చెక్ చేసుకోవడం వంటివి చేస్తుంటారు. అలాగే వదిలేస్తే ఇవి కూడా ఆ వ్యక్తిలో ఆత్మహత్యల వైపు తీసుకెళతాయి. కాబట్టి మానసిక వైకల్యం ఉన్న వారి విషయంలో కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకో వలసిన అవసరం ఉంటుంది. వృద్ధాప్యం మరో బాల్యం లాంటిది. పండుటాకులకూ పసిబిడ్డలకూ పెద్దగా తేడా ఉండదు. వృద్ధులతో వ్యవహరించేటప్పుడు కాస్త సున్నితంగా ఉండటం చాలా అవసరం. సగటు ఆయుర్దాయుం పెరగడంతో వృద్ధుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతోంది. వృద్ధుల సంఖ్యతోపాటే మలి వయసులో మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడే వారి సంఖ్యా పెరుగుతోంది. మానసిక చికిత్సా విభాగానికి వచ్చే ప్రతి వంద మందిలో 25 మంది వృద్ధులుంటున్నారు. వీరిలో అత్యధికులు డిప్రెషన్, నిద్రలేమి ఆందోళన, డిమెన్షియా వంటి ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. మానసిక రుగ్మతలు ఉన్నవారికి మెరుగైన చికిత్స అందుబాటులో ఉంది. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ఆసుపత్రికి తీసుకువస్తే వ్యాధిని పూర్తిగా నియంత్రించ వచ్చు. అలాంటి వ్యాధి సోకితే జబ్బు తీవ్రత కంటే ఎక్కువగా మనం తల్లడిల్లిపోతాం. మనతో బాటు మనవాళ్ళూ ఆందోళన చెందుతారు. నాడీ సంబంధిత ప్రసరణ వ్యవస్థ (న్యూరో ట్రాన్స్ మిట్టర్స్)...మానసిక రుగ్మతలు మెదడులోని న్యూరో ట్రాన్స్ మిట్టర్స్ అని పిలువ బడే ప్రత్యేక రసాయనాలలో కలిగే అసాధారణమైన సమతుల్యానికి సంబంధం కలిగి ఉంటాయి. మెదడులో ఉండే నాడీ కణాలు ఒకదానితో మరొకటి సంబంధాన్ని నెరపుతూ ఉండడానికి సహకరించు కుంటాయి. ఒకవేళ ఈ రసాయనాలలో సమతౌల్యం లోపించినా లేక అవి సరిగా పనిచేస్తూ ఉండకపోయినా, మెదడులో సంకేతాలు ఒకచోట నుండి మరొకచోటకు సరిగా పంపబడుతూ ఉండవు, మానసిక అనారోగ్య లక్షణాలకు దారి తీస్తాయి. జన్యు శాస్త్రం... కుటుంబాలలో వస్తూ వుండే మానసిక రుగ్మతలు తమ కుటుంబంలో మరో ఏ సభ్యుడికైనా అటువంటివి ఉన్నట్లయితే, మిగతా వారు కూడా అటువంటి మానసిక రుగ్మతల బారిన పడే అవకాశాలను ఎక్కువగా కలిగి ఉంటారని సూచిస్తున్నాయి. మానసిక రుగ్మత, వైకల్యం అనేది అనేక జన్యువుల పరస్పరక్రియ, ప్రభావం (ఇంటరాక్షన్) వల్ల మరియు ఇతర అంశాల వల్ల %-% అంటే ఒత్తిడి, దుర్వినియోగం, లేకపోతే ఒక శరాఘాతం (ట్రోమా) కలిగించే సంఘటన వంటివాటి వల్ల సంభవిస్తుంది. ఒక వ్యక్తి వారసత్వంగా ఈ రుగ్మతకు గురయ్యే అవకాశాన్ని కలిగి వున్నప్పుడు ఆ వ్యక్తిలో ఇవి అనారోగ్యాన్ని మరింత ప్రభావితం చేయడమో లేక అనారోగ్యాన్ని ఉసిగొల్పడమో చేస్తాయి. అంటు రోగాలు...మెదడు దెబ్బ తినడానికి మరియు మానసిక రుగ్మత వృద్ధి చెందడానికి లేక క్షీణించిపోతూ ఉండే పరిస్థితిని తెలియజేసే రోగ లక్షణాలతో సంబంధం కలిగి వుంటాయి. ఉదాహరణకు పీడియాట్రిక్ ఆటో ఇమ్యూన్ న్యూరో సైకియాట్రిక్ డిజార్డర్ (పి.ఏ.ఎన్.డి.ఏ) గా పిలువబడే పరిస్థితి పిల్లలలో స్ట్రెప్టోకోకస్ బ్యాక్టీరియా అనేది అబ్సెస్సివ్-కంపల్సివ్ డిజార్డర్ (నిరంతరం ఒకే భావంతో ఉండే స్థితి-తప్పనిసరి, బలవంత మైన వైకల్యం) మరియు ఇతర మానసిక రుగ్మతలు పెరగడంతో సంబంధం కలిగి ఉంటుంది. మెదడులో లోపాలు లేక గాయం...మెదడులో లేక మెదడు లోని కొన్ని భాగాలలో లోపాలు కలుగడం లేక గాయాలు కలిగి వుండడం అన్నది కొన్ని మానసిక రుగ్మతలతో సంబంధం కలిగి ఉంటుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు



## బకాయిల వసూళ్లపై దృష్టేదీ?

హైదరాబాద్: కోట్ల రూపాయలు అద్దెలు ఎగ్గొట్టినా.. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. బకాయిదారులకు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకొంటున్నారు తప్ప బకాయి వసూళ్లపై అధికారులు దృష్టి సారించడం లేదు. రెవెన్యూ రికవరీ యాక్టు ప్రయోగిస్తామని ప్రకటించినప్పటికీ ఆ దిశగా కార్యాచరణ లేదు. బ్లాక్‌లిస్టులో పెట్టిన గుత్తేదారులు ఇతరపేర్లతో మళ్లీ కాంట్రాక్టులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. హెచ్ఎండీఏ బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు పరిధిలోని ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్‌రోడ్డు, సంజీవయ్యపార్కు తదితర ప్రాంతాల్లో వాణిజ్య కార్యకలాపాలు నడుస్తున్నాయి. వీటిని ప్రైవేటు వ్యక్తులు తీసుకొని నెలానెలా హెచ్ఎండీఏకు అద్దెలు చెల్లిస్తున్నారు. ఏటా తక్కువలో తక్కువ రూ. 25-30 కోట్లు ఆదాయం సమకూరుతోంది. వీటిని అద్దెకు తీసుకొన్న చాలామంది బకాయిలు ఎగవేస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి రూ.కోట్లలో నష్టం వాటిల్లుతోంది. గతంలో లుంబినీ పార్కులో ఓ రెస్టారెంట్ దాదాపు రూ. 1.5 కోట్లు బకాయి పడింది. చివరికి చెల్లింపు చేయకుండా కోర్టును ఆశ్రయించింది. అక్కడా వ్యతిరేకంగా తీర్పు రావడంతో రెస్టారెంట్‌ను హెచ్ఎండీఏ స్వాధీనం చేసుకుంది.

సరైన ప్రణాళికతో రూ.కోట్ల ఆదాయం: పర్యాటకులతో రద్దీగా ఉండే హుస్సేన్‌సాగర్ చుట్టూ హెచ్ఎండీఏ దృష్టిపెడితే రూ.కోట్లలో ఆదాయం వచ్చే అవకాశం ఉంది. దీనికి సరైన ప్రణాళికతో ముందుకు రావడం లేదు. అద్దెలకు తీసుకున్న వారు.. ధరావతుకు మించి బకాయిలు పెడుతున్నా పట్టించుకోకపోవడంతో అవి రూ.కోట్లలోకి చేరుతున్నాయి.

**పేరుకున్న బకాయిలు ఇలా...**

అమోఘ రెస్టారెంట్ - రూ. 1.50 కోట్లు
ఐమాక్స్ పార్కింగ్ ఏరియా - రూ. 45 లక్షలు
ఎన్టీఆర్ గార్డెన్ క్లోక్‌రూం - రూ. 16 లక్షలు
ఎన్టీఆర్ గార్డెన్ పార్కింగ్ ఏరియా - రూ. 21 లక్షలు
లుంబినిపార్కు క్లాక్‌రూం - రూ. 11 లక్షలు
సంజీవయ్య పార్కు ఫేస్ యాక్టివిటీ - రూ. 1.61 లక్షలు

## అంత్యక్రియలకు అగచాట్లే

చొప్పదండి: చొప్పదండి పురపాలక సంఘం పరిధిలోని శ్మశానవాటికల్లో మౌలిక వసతులు లేక అంత్యక్రియలకు పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు నిర్మాణాలు ఉన్నా.. అవి సరిపోవటం లేదు. పైగా నిర్వహణ లోపంతో అధ్వానంగా తయారయ్యాయి. సదుపాయాలు మచ్చుకు కూడా కనిపించటం లేదు. శానకుంట శ్మశానవాటికలో రూ.కోటితో గత నాలుగేళ్ల క్రితం కట్టెల నిల్వకు, పిండ ప్రదానం చేసేందుకు రెండు గదుల నిర్మాణం ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. మొత్తం పిచ్చిమొక్కలు పెరిగి మృతదేహాల దహనానికి ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఒకే రోజు ఇద్దరికి మించి వ్యక్తులు మృతి చెందితే కిందిభాగంలో కాల్చాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. లేకపోతే రోడ్డుకు సమీపంలో దహనం చేస్తున్నారు. కావాల్సినంత స్థలం ఉన్నప్పటికీ పరిసరాలు శుభ్రం చేసేవారు కరవయ్యారు. స్నానాలు చేసేందుకు ఏర్పాటు చేసిన నల్లాలు విరిగిపోయాయి. ఆ గదిలో పాకురు తేలి ప్రమాదకరంగా మారింది.

**అసంపూర్తి నిర్మాణం**

గుమ్లాపూర్ అడ్డరోడ్డులో పట్టణవాసుల కోసం నాలుగేళ్ల క్రితం పట్టణ ప్రగతి నిధులు రూ. 60 లక్షల వ్యయంతో వైకుంఠధామం నిర్మాణానికి



శంకుస్థాపన చేశారు. నేటికి పనులు పూర్తి కాలేదు. చుట్టూ ప్రహరీ, దహనం చేసేందుకు రెండు నిర్మాణాలు, స్నానాల గదులు మాత్రమే నిర్మించి వదిలేశారు. 90 శాతం పనులు పూర్తి కాగా.. వినియోగంలోకి తీసుకురావాల్సిన దిశగా ఎవరూ చర్యలు తీసుకోవటం లేదు. గ్రామాల్లో ఆహ్లాదకరంగా వైకుంఠధామాలు ఉండగా పట్టణంలో ఇందుకు భిన్నంగా దర్శనమిస్తున్నాయి. గుమ్లాపూర్ అడ్డరోడ్డు వైపు ఉన్న వారు రోడ్డుపక్కనే మృతదేహాలను దహనం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో నీటి వసతి లేక ఇళ్లకు వెళ్లి స్నానాలు చేయాల్సిన పరిస్థితి ఉంది.

**నిధుల సమస్యతో పెండింగ్**

నిధుల సమస్యతో వైకుంఠధామాల్లో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపిస్తాం. పట్టణవాసులకు అంత్యక్రియలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం. రెండు నిర్మాణాలు పూర్తయితే అన్ని వసతులు సమకూరుతాయి.- నాగరాజు, పురపాలిక కమిషనర్ చొప్పదండ

## కనెక్షన్ మార్పుతో భారీగా రాబడి

హైదరాబాద్: రాబడిని పెంచుకునేందుకు జలమండలి చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. గృహావసరాల కోసం నీటి కనెక్షన్ తీసుకుని వాణిజ్య అవసరాలకు వినియోగించుకుంటున్న వాటిపై వేటు వేస్తోంది. ఇలాంటివి సుమారు లక్షకు పైగా ఉంటాయని అంచనా వేసి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తోంది. ఎండీ కె.అశోక్‌రెడ్డి ఈ అంశంపై సమీక్షించి ప్రత్యేకంగా బృందాలను ఎంపికచేశారు. ఇవి క్షేత్రస్థాయి పరిశీలనలో కనెక్షన్ల వినియోగం తీరుని గుర్తించి మార్పునకు అర్హమైన వాటిని సిఫారసు చేస్తున్నారు. వీటిలో ప్రధానంగా వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, షోరూంలు, పెద్దపెద్ద రెస్టారెంట్లు సహా ఇతర వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించేవి ఉన్నట్లు గుర్తించారు. సర్వే కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఉపయోగిస్తున్నారు. నివాసం ఫొటోను అప్‌లోడ్ చేసి కేటగిరీ మార్పునకు సిఫారసు చేస్తున్నారు. ఉచిత తాగునీటి పరిధిలో ఉంటే తొలగించి కమర్షియల్ బిల్లుల జారీకి రంగం సిద్ధం చేశారు. 20 రోజులకుపైగా ఈ డ్రైవ్ కొనసాగుతోంది. తాజాగా గుర్తించిన వాటితో సుమారు రూ. 10 కోట్ల మేర రాబడి పెరిగే అవకాశాలు ఉన్నట్లు జలమండలి అంచనా వేస్తోంది.

# ఆర్థిక నేరాలు ఆందోళనకరం



సంగారెడ్డి: ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో నేరాల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా ఆర్థికపరమైన నేరాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. పట్టణీకరణతో పాటు రాజధాని నగరానికి జిల్లాలు సమీపంలో ఉండటంతో స్థిరాస్తి, ఇతరత్రా వ్యాపారాలు జోరందుకుంటున్నాయి. ఇదే అదనుగా కొందరు అక్రమార్కులు మాయమాటలు చెప్పి ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ 2023 సంవత్సరానికి సంబంధించిన ఎన్‌సీఆర్‌బీ(నేషనల్ క్రైమ్ రికార్డ్సు బ్యూరో)లో నమోదైన నేర గణాంకాలను తాజాగా వెల్లడించింది.

**కేసుల నమోదులో సిద్దిపేట అగ్రస్థానం**

ఎన్‌సీఆర్‌బీ-2023 నివేదిక ప్రకారం సిద్దిపేట జిల్లాలో అత్యధికంగా కేసులు నమోదయ్యాయి. రెండో స్థానంలో సంగారెడ్డి, మూడో స్థానంలో మెదక్ ఉన్నాయి. వీటిలో పోల్చితే వికారాబాద్‌లో తక్కువ కేసులు నమోదయ్యాయి. ఉమ్మడి జిల్లాలో సంగారెడ్డిలో అత్యధికంగా 57 హత్యకేసులు నమోదయ్యాయి.

**సంగారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువ**

వాహనాలను అజాగ్రత్తగా నడపడం, మద్యం తాగి డ్రైవింగ్ చేయడం తదితర కారణాలతో సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగాయి. విస్తీర్ణం పరంగా చిన్న జిల్లా అయినప్పటికీ మెదక్‌లోనూ రోడ్డు ప్రమాదాలు భారీగానే నమోదయ్యాయి.

పట్టణీకరణతో పాటు.. మద్యం, గంజాయి వినియోగం పెరగడం, పొరుగు రాష్ట్రాల యువత అధికంగా ఉండడం తదితర కారణాల వల్ల సంగారెడ్డి జిల్లాలో ర్యాష్‌డ్రైవింగ్ కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. ఈ కేసుల నమోదులో జంటనగరాల తర్వాత సంగారెడ్డి జిల్లా ఉన్నట్లు ఎన్‌సీఆర్‌బీ-23 నివేదిక స్పష్టం చేస్తోంది.

జాతీయ, ప్రధాన రహదారులతో పాటు పట్టణాల పరిధిలోని రోడ్లపై స్పీడ్‌గన్‌లు ఏర్పాటు చేసి వాహనాల అతివేగాన్ని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కిడ్నాప్ కేసులు వికారాబాద్ జిల్లాలో అత్యధికంగా 64 నమోదు కాగా.. తర్వాతి స్థానంలో సిద్దిపేట జిల్లా ఉంది.

# నిండుగా గోదాంలు



పెద్దపల్లి : ఎగుమతులు లేకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని భారత ఆహార సంస్థకు చెందిన గోదాములన్నీ నిండిపోయాయి. మిల్లర్ల నుంచి తీసుకోవాల్సిన బియ్యం(సీఎంఆర్) నిల్వ చేసేందుకు ఖాళీ లేకపోవడంతో బియ్యం సేకరణ దాదాపు నిలిచిపోయింది. దీంతో బియ్యం నిల్వకు మిల్లర్లు తంటాలు పడుతున్నారు. 2024-25 వానాకాలం సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ సేకరణ తుది దశకు చేరుకుంది. వానాకాలం కోటా పూర్తి చేసి యాసంగి సీజన్‌పై అధికారులు దృష్టిపెట్టాల్సి ఉండగా గోదాములు నిండిపోవడం పౌరసరఫరాల శాఖ అధికారులకు తలనొప్పిగా మారింది.

**నెలాఖరుకు పూర్తి చేయాల్సి ఉండగా..**

యాసంగి సీజన్‌కు సంబంధించి ఉమ్మడి జిల్లాలో 10,83,427 మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణ జరగాల్సి ఉండగా 4,96,044 మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణ జరిగింది. ఇప్పటి వరకు కేవలం 44.25 శాతం కోటా సేకరించారు. నెలాఖరుకు కోటా పూర్తి చేయాల్సి ఉండగా గోదాములు లభ్యత లేకపోవడంతో గడువు పొడిగించే అవకాశముంది.

**సిరిసిల్ల తక్కువగా..**

వానాకాలం సీజన్‌కు సంబంధించి పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలు ముందంజలో ఉన్నాయి. పెద్దపల్లిలో 99 శాతం, కరీంనగర్‌లో 95 శాతం సేకరణ పూర్తయింది. రేషన్ దుకాణాలకు సన్నబియ్యం సరఫరా కోసం సేకరణ వేగవంతం చేయడంతో ప్రక్రియ తుది దశకు చేరింది. ఈ సీజన్ పూర్తి చేయడానికి నవంబరు 12 వరకు గడువుంది. వానాకాలంలో 7,26,321 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్లు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 5,86,714 మెట్రిక్ టన్నులు ఇచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో అతి తక్కువగా 52 శాతం కోటా పూర్తయింది.

**జగిత్యాలలో ఏడు ప్రాంతాల్లో..**

పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాలలో భారత ఆహార సంస్థకు సంబంధించి 22 ప్రాంతాల్లో 6,06,45 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములున్నాయి. వీటిలో కరీంనగర్ జిల్లా పరిధిలో 18,354 మెట్రిక్ టన్నులు, పెద్దపల్లి జిల్లా పరిధిలో 4,519 మెట్రిక్ టన్నులు నిల్వ చేసుకునేందుకు అవకాశముంది. జగిత్యాలలోని 7 ప్రాంతాల్లో నూరు శాతం గోదాములు నిండిపోయాయి. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా 86,667 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన రాఘవపూర్‌లోని గోదాములు పూర్తిగా నిండిపోయాయి.

# అటు తొలగింపులు.. ఇటు నిర్మాణాలు



వేములవాడ: వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా నిర్మాణాలు చేపట్టడంతోపాటు భక్తులకు అన్ని వసతులు కల్పించే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేసి పనులు చేపట్టారు. ఇందులో భాగంగా రాజన్న ఆలయంలో విస్తరణకు అవసరమైన స్థలాన్ని సిద్ధం చేసేందుకు ఇప్పటికే కళాభవనం, ఎన్ఆర్ గెస్ట్‌హౌస్, ఈవో కార్యాలయ భవనాలను తొలగించారు. క్యూలైన్లను, ఇతర భవనాలను ఒక్కొక్కటిగా తొలగించే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) ఆధ్వర్యంలో మూడు దశల్లో 2027 నాటికి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలకు రూపకల్పన చేశారు. ఇందులో మొదటి దశలో రూ. 111 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. శ్రీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల నేపథ్యంలో భక్తులు భీమేశ్వరస్వామివారిని దర్శించుకునేందుకు వీలుగా ఆలయంలో రూ. 3.44 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. శ్రీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో భక్తులు చెల్లించుకునే వివిధ రకాల మొక్కులకు సంబంధించిన అన్ని రకాల షెడ్ల నిర్మాణ పనులు భీమేశ్వరాలయంలో చేపట్టారు. శంకరమఠంలో నిత్యకల్యాణ మండపం, సత్యనారాయణ వ్రతం, నిత్య చండీహోమం కోసం షెడ్లు, ఆలయంలో నివేదన, అభిషేక మండపాల షెడ్లు, నటరాజ్ విగ్రహం పక్కన భక్తుల క్యూలైన్, కోడె మొక్కుల క్యూలైన్ షెడ్ల నిర్మాణం పనులు చివరి దశల్లో ఉన్నాయి. విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకొని భీమేశ్వరాలయంలో కోడె మొక్కుల ధ్వజ స్తంభాలను ఆలయ అధికారులు, అర్చకులు ప్రతిష్ఠించారు. ఇక్కడ భక్తులకు అన్ని వసతులు సమకూరిన తరువాతే ప్రధాన ఆలయాన్ని మూసివేసి రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

**కార్యాలయాల మార్పు** ఆలయ విస్తరణ పనులు చురుగ్గా సాగడంతో ఇప్పటికే ఆలయానికి సంబంధించిన కార్యాలయాలన్నింటిని ఆలయ అధికారులు తాత్కాలికంగా భీమేశ్వరసదన్ వసతి గృహంలోకి మార్చారు. ఈవో కార్యాలయంతో పాటు ఇంజినీరింగ్, గణాంక, పరిపాలన, లీజుల విభాగంతో పాటు ఇతరత్రా విభాగాలను తాత్కాలికంగా మార్చారు. ఈ కార్యాలయాలన్నీ ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు పూర్తి అయ్యేంత వరకు భీమేశ్వర సదన్ వసతి గృహంలో కొనసాగున్నాయి.

**పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నాం**

భీమేశ్వరస్వామివారి ఆలయంలో భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇక్కడ అన్ని వసతులు సమకూరిన తరువాత నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే భీమేశ్వరాలయంలో భక్తుల దర్శనాలు కొనసాగుతాయి. - ఎల్.రమాదేవి, ఆలయ ఈవో, వేములవాడ

## నాలుగేళ్లుగా 'ఆగుతూ.. సాగుతూ!'

కోరుట్ల: పట్టణంలో కూరగాయలు, మాంసం, పూలు, పండ్ల దుకాణాలు రోడ్లపై, ఎక్కడెక్కడో ఉండటంతో.. వాటన్నింటిని కలిపి ఒకేచోట ఏర్పాటు చేయిస్తే సౌలభ్యంగా ఉంటుందని భావించిన ప్రభుత్వం 2021-22 సంవత్సరంలో ఏకీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వీటి నిర్మాణం పూర్తయితే పట్టణ ప్రజల సౌకర్యార్థం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని యోచించింది. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా జీవో నం. 65 ద్వారా పురపాలిక సంఘాలకు ప్రత్యేక నిధులు విడుదల చేసింది. వీటితోపాటు పురపాలిక సంఘంలోనున్న పట్టణ ప్రగతి నిధులను వెచ్చించుకోవచ్చని ఆదేశాలు జారీ చేసింది.

**రూ. 7 కోట్లకుపైగా నిధులు**

పట్టణంలో ఏకీకృత మార్కెట్ నిర్మాణానికి మొత్తం రూ. 7.35 కోట్లు కేటాయించారు. మొదట్లో మార్కెట్ నిర్మాణానికి ఆర్టీసీ డిపో స్థలం కేటాయించేందుకు అధికారులు పలుమార్లు పరిశీలించారు. అందులో ఏర్పాటు సాధ్యం కాదని స్థల కేటాయింపులో తీవ్ర జాప్యం జరిగింది. ఎట్టకేలకు పట్టణ శివారులోని మెట్‌పల్లి రోడ్డులోనున్న వ్యవసాయ మార్కెట్ యార్డులోని 1.20 ఎకరాల స్థలాన్ని కేటాయించారు.



మూడున్నర ఏళ్ల క్రితం గుత్తేదారు పనులను ప్రారంభించారు. రెండు భారీ షెడ్లను నిర్మించారు. అందులో కూరగాయలు, మాంసం, పూలు, పండ్ల దుకాణాల కోసం మొత్తం 134 దుకాణాలు నిర్మించి సిద్ధం చేశారు.

**బిల్లుల చెల్లింపుల్లో జాప్యం**

రెండున్నర ఏళ్ల క్రితం రంగులు, విద్యుత్తు, నీటి పైపులైన్లను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు చేపట్టిన నిర్మాణానికి సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరగడంతో గుత్తేదారు పనులను మధ్యలోనే నిలిపివేశారు. మార్కెట్ ముఖద్వారం, చుట్టూ ప్రహరీ, సిమెంట్ రోడ్లు, పార్కింగ్, మూత్రశాలలు, తాగునీటి సౌకర్యం, కోల్డ్ స్టోరేజి, ఇతర నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. పనులు ఎప్పుడు పూర్తవుతాయోనని రైతులు, పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. మార్కెట్‌ను ప్రారంభించకముందే రంగులు వెలిసిపోయి నిర్మాణాలు దెబ్బతినేలా ఉన్నాయి. వ్యాపారులు చేసేదిలేక నందిచౌక్, గడి గురుజు, కటికేవాడ, ఐబీ రోడ్లపైనే కూరగాయలు, చేపలు, మాంసం విక్రయాలు చేపడుతున్నారు.

## ఉపాధి.. కొక్కొరోకో

రాజపేట: మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా సాగాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక రకాలుగా ప్రోత్సహిస్తోంది. వారుచేసే పనితో పాటు అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని భావిస్తోంది. మహిళా స్వయం సహాయక సంఘం సభ్యుల అభ్యున్నతికి పథకాలు అమలు చేస్తోంది. పెరటికోళ్ల పెంపకం ప్రోత్సహిస్తోంది. తాజాగా జిల్లాలో ఒక్కో గ్రామైక్య సంఘంలో ముగ్గురు సభ్యులకు రూ. 2 వేల రుణం కింద కోడి పిల్లల పంపిణీ కార్యక్రమం త్వరలో ప్రారంభించనుంది. ఒక్కొక్కరికి ఒక యూనిట్ కింద 20 కోడి పిల్లలు అందించనున్నారు. వీరు ప్రతి నెలా రూ. 200 వాయిదా చెల్లించాల్సి ఉంటుంది. వివరాలు క్లుప్తంగా..

**ప్రస్తుతం సభ్యుల గుర్తింపు ప్రక్రియ** కోళ్ల పెంపకందారులు గుడ్లతో కోడి పిల్లల పునరుత్పత్తి చేస్తే వారి నుంచి కోడి పిల్లలను కొనుగోలు చేసి ఇతర సభ్యులకు పంపిణీ చేసే అవకాశం ఉండనుంది. గతంలో జిల్లాలో కొన్ని మదర్ యూనిట్లు ఏర్పాటైనట్లుగా తెలుస్తోంది. నిరంతరం ఆదాయ వనరుగా మారే అవకాశం ఉండనుంది. ప్రస్తుతం జిల్లాలోని ఒక్కో గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో మూడు యూనిట్లు అందించే యోచనలో అధికారులు నిమగ్నమై ఉన్నట్లుగా సమాచారం. అయితే ప్రస్తుతం గుర్తింపు ప్రక్రియ జరుగుతున్నట్లుగా డీపీఎం సీహెచ్.రవీందర్ 'న్యూస్‌టుడే'తో వెల్లడించారు.

**యూనిట్లు మంజూరు ఇలా..**

భువనగిరి, ఆలేరు, బొమ్మలరామారం,చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, భూదాన్ పోచంపల్లి, రాజపేట మండలాలకు 150 యూనిట్ల చొప్పున, అడ్డగూడూరు, ఆత్మకూర్(ఎం), బీబీనగర్, తుర్కపల్లి, మోటకొండూరు, రామన్నపేట, వలిగొండ మండలాలకు వంద, యాదగిరిగుట్ట, గుండాల 50 యూనిట్లు మంజూరయ్యాయి.

**పంపిణీ వివరాలు..**

ప్రస్తుతం మంజూరైనవి: 1850
ఒక్కో యూనిట్‌లో కోడిపిల్లలు : 20
యూనిట్‌కు అందించే రుణం: రూ. 2వేలు
చెల్లించాల్సిన నెలవారీ కిస్తు : రూ. 200

**అదనపు ఆదాయ వనరుగా..**

నాగిరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

మహిళల ఆదాయ అభివృద్ధికి దేశీయ కోడి పిల్లల పెంపకం దోహదపడుతుంది. ముఖ్యంగా పెరటికోళ్లతో పాటు పెరటి తోటలు, కూరగాయల సాగు, పాడి పరిశ్రమ వంటి యూనిట్లను మహిళా సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి.

## రెండుచోట్ల తాగునీరు కలుషితం..

ఖమ్మం : జిల్లా వ్యాప్తంగా అధిక వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి, నీటి వనరులన్నీ పూర్తిగా నిండాయి. రహదారుల పక్కన వరద నీరు నిలుస్తోంది. ఈ క్రమంలో కొన్ని గ్రామాల్లో తాగునీరు కలుషితం అవుతోంది. గ్రామీణ తాగునీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు ఖమ్మం, మధిర, సత్తుపల్లి తాగునీటి ప్రయోగశాలల్లో నీటి నమూనాలు పరీక్షించి ఫలితాలు తెలుసుకుంటున్నారు.

2025 జూన్ నుంచి సెప్టెంబరు 16 వరకు 2,729 తాగునీటి నమూనాలు పరీక్షించారు. 88 నమూనాల్లో అధిక మోతాదులో రసాయన పదార్థాలు గుర్తించారు. మరో 556 నమూనాలు సేకరించి బ్యాక్టీరియలాజికల్ పరీక్షలు జరపగా ఎనిమిది నమూనాల్లో పాజిటివ్ ఉన్నట్లు తేల్చారు.

**సమస్య ఎక్కడ?** ఖమ్మం రూరల్ మండలం కస్నాతండా, ఆరెకోడు గ్రామ పంచాయతీల పరిధిలోని బోర్లు, బావులు, ట్యాంకుల నుంచి ఈనెల 5, 6 తేదీల్లో సేకరించిన నీటి నమూనాల్లో బ్యాక్టీరియా, అధిక రసాయన పదార్థాలున్నట్టు తేలింది. వీటిని ప్రజలు తాగొద్దని పంచాయతీ కార్యదర్శులకు లేఖ ద్వారా తెలిపారు. వారం రోజులుగా బావులు, ట్యాంకులు శుభ్రం చేయిస్తున్నారు. కస్నాతండాలోని బావిలో నీటిని తోడేసి క్లోరినేషన్ చేయించారు. బోర్లు, ట్యాంకు లను శుభ్రపరుస్తు న్నారు. జిల్లాలోని మూడు ప్రయోగశాలల్లో నిరంతరం తాగునీటి పరీక్షలు చేస్తున్నాం. ఎక్కడైనా తేడా ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే క్లోరినేషన్ చేయిస్తున్నాం. భగీరథ పైపులైన్ల ద్వారా శుద్ధి చేసిన నీరు సరఫరా అవుతున్నా కొన్నిచోట్ల పరీక్షిస్తున్నాం. పుష్పలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, ఖమ్మం

# ఉత్తమ ఫలితాలే లక్ష్యం

సిరిసిల్ల : పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. మంగళవారం నుంచి జనవరి 9వ తేదీ వరకు 73 రోజుల పాటు వార్షిక పరీక్షలు ముగిసేదాకా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు అనుగుణంగా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణకు ఉపాధ్యాయులు సిద్ధం అవుతున్నారు.

**3,834 మంది విద్యార్థులు**

జిల్లాలో మొత్తం 3,834 మంది పదో తరగతి విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించడంపై విద్యాశాఖ దృష్టి సారించింది. జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, ఆదర్శ, కస్తూర్బా, ఎయిడెడ్, తెలంగాణ గురుకుల పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు రోజుకు గంటపాటు సాయంత్రం 4:15 నుంచి 5:15 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. ప్రతిరోజు నిర్వహించిన ప్రత్యేక తరగతుల రికార్డు అందుబాటులో ఉండాలని.. సంబంధిత ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని.. ప్రత్యేక తరగతులు ఆరుబయట కాకుండా తరగతి గదిలోనే నిర్వహించాలని ఉన్నతాధికారులు సూచించారు.

గతేడాది డీసీఈబీ ద్వారా సబ్జెక్టు నిపుణులతో ప్రతి సబ్జెక్టు నుంచి సుమారుగా 60 ముఖ్యమైన ప్రశ్నలు ఇచ్చారు. ఈ సంవత్సరం



డిసెంబరు నుంచి గతేడాది మాదిరిగానే ప్రతి సబ్జెక్టు నుంచి ముఖ్యమైన ప్రశ్నలు ఇచ్చి విద్యార్థులచే ప్రాక్టీస్ చేయించనున్నారు.

ప్రతీ పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించనున్నారు. ఎప్పటికప్పుడు సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేస్తూ వారి సామర్థ్యాలను మెరుగుపరచనున్నారు.

ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు గతంలో జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు దాతలుగా మారి అల్పాహారం అందించారు. ఈ సంవత్సరం సైతం అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం అవసరమైన చొరవ చూపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**జిల్లాను మొదటి స్థానంలో నిలుపుతాం**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాం. దీనికోసం ఎఫ్ఏ-1 పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా వారిని 3 గ్రేడులుగా విభజించి విద్యాబోధన చేయనున్నాం. ప్రతి ఉపాధ్యాయుడికి వారి సబ్జెక్టుకు సంబంధించిన ప్రణాళికను అందజేశాం. సెలబస్ పూర్తయిన తర్వాత రివిజన్ క్లాసులు నిర్వహించాలి. ఆ తర్వాత డీసీఈబీ ద్వారా సబ్జెక్టు నిపుణులతో తయారు చేయించిన ముఖ్యమైన ప్రశ్నలతో సాధన చేయించనున్నాం. జిల్లాను మొదటి స్థానంలో నిలుపుతాం.

– శ్రీనివాస్, డీసీఈబీ సెక్రెటరీ

# నత్త.. నమిలేస్తోంది..!

గుర్రంపోడు: తెగుళ్లు చీడ పీడలతో సతమతమవుతున్న రైతులకు నత్త గుల్లల రూపంలో మరో ప్రమాదం వచ్చి పడింది. ఈసారి వానాకాలం సీజన్ నుంచి పండ్లు, ఆకుకూరలు, కూరగాయల తోటల్లో రాత్రివేళ లేత చిగుళ్లు, ఆకులు, కొమ్మలు, పూత, కాయలను నత్తలు కొరికి నమిలేస్తున్నాయి. ఉదయం ఎండ సమయానికి కనిపించకుండా పోతున్నాయి. ఏం జరుగుతుందోనని అన్నదాతలు తెలుసుకునే లోపే పంట అంతా నాశనం అవుతోంది.

జిల్లాలో బత్తాయి, దానిమ్మ, బొప్పాయి వంటి పండ్ల తోటలతో పాటు వంగ, టమాట, బీర, వంటి కూరగాయలు, పాలకూర, తోటకూర, గోంగూర వంటి ఆకుకూరలు, విస్తారంగా పండిస్తారు. సరిగ్గా జూన్ నుంచి సెప్టెంబరు మాసాల్లో తోటలకు ఇగుళ్లు రావడం, పూత పూయడం జరుగుతుంది. ప్రతిసారి ఒకటి రెండు కనిపించే నత్తలు ఈసారి అధిక సంఖ్యలో కనిపించడంతో రైతులు అనుమానించినా...అవి రాత్రి పూట వచ్చి రాత్రంతా పూతను ఇగుళ్లను కొరికిపోవడం మాత్రం ఆలస్యంగా గ్రహించి లబోదిబోమంటున్నారు. ప్రతి రైతు నత్తల బాధితులుగా మిగిలిపోవడం గమనార్హం. అధిక తేమ, నీరు భూమిలోకి ఇంకని నేలల్లో నత్తల పెరుగుదల అధికంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

తెలంగాణ ప్రాంతంలో నత్తల ఉనికి చాలా తక్కువ. ఇక్కడి పొడిబారిన నేలలు, మెట్ట భూముల్లో నత్తలు జీవించలేవు. బాగా తడి ప్రాంతంలో తేమ కూడిన వాతావరణంలో ఇవి మనుగడ సాగిస్తాయి. అయితే ప్రస్తుతం కనిపించే నత్తలు ఆఫ్రికా నుంచి నర్సరీ మొక్కల ద్వారా



ఇక్కడికి దిగుమతి అయి ఉంటాయని ఉద్యాన నిపుణులు భావిస్తున్నారు. పైగా ఈసారి నిత్యం కురిసే వానలతో అవి బాగా వృద్ధి చెంది ఉంటాయని చెబుతున్నారు.

వీటి నివారణకు నాలుగు లీటర్ల నీటిలో కిలో ఉప్పు కలిపి ద్రావణంగా తయారు చేసి అందులో గోనె సంచిని ముంచి నత్తలు గుంపులుగా ఉన్న చోట వేయటం ద్వారా ఉప్పు ఘాట్‌కి నత్తలు చనిపోతాయని ఉద్యానవన నిపుణులు చెబుతున్నారు.

అంచనా వేయిస్తాం...

సుభాషిణి, జిల్లా ఉద్యానవన అధికారి ...

పంటల మీద పడి నత్తలు ధ్వంసం చేయటం కొత్తగా గమనిస్తున్నాం. గతంలో ఈ సమస్య మన రాష్ట్రంలో లేదు. అధికారులను పంట భూములకు పంపించి తీవ్రతను అంచనా వేయిస్తాం. ఉద్యాన శాస్త్రవేత్తలతో చర్చించిన అనంతరం తగిన రసాయన మందులను రైతులకు సూచిస్తాం.

# మన కోచింగ్ సెంటర్లు భద్రమేనా?



హైదరాబాద్ : ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. షార్ట్‌సర్క్యూట్ కారణంగా పేలుడు సంభవించిన దుర్ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందగా మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

ఢిల్లీలో ఏడాది క్రితం ఓకోచింగ్ సెంటర్ లైబ్రరీలో వరద చేరడంతో బయటకు వచ్చే అవకాశం లేక ముగ్గురు దుర్మరణం చెందారు. ఆ శిక్షణ కేంద్రాన్ని సెల్లార్‌లో నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

ఉత్తర్‌ప్రదేశ్‌లో శనివారం జరిగిన దుర్ఘటనతో అందరి దృష్టి నగరంలో నడుస్తున కోచింగ్ సెంటర్లపై పడింది. భాగ్యనగరంలో అమీర్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, అశోక్‌నగర్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ ప్రాంతాల్లో వందల కొద్దీ శిక్షణా కేంద్రాలున్నాయి. తెలుగురాష్ట్రాల్లో పోటీ పరీక్షల సన్నద్ధమయ్యే అభ్యర్థులు గ్రూప్స్‌తో పాటు సివిల్స్ పరీక్షల శిక్షణకు పెద్ద సంఖ్యలో నగరానికి వస్తుంటారు. అధికారిక లెక్కల ప్రకారం సుమారు 120శిక్షణ కేంద్రాలున్నాయి.

**భారీగా ఫీజులు..** నిబంధనలు గాలికి: కోచింగ్ సెంటర్లలో గ్రూప్స్ పరీక్షల శిక్షణ కోసం ఒక్కో అభ్యర్థి నుంచి రూ.50వేల- రూ.80వేలు.. యూపీఎస్సీకి రూ.లక్ష- రూ.1.2లక్షల వరకు వసూలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం నిర్వాహకులు అన్ని రకాల భద్రతా ప్రమాణాలు పాటించాలి. కానీ ఎక్కడా అవి కనిపించవు.

**పాటించాల్సిన భద్రతాప్రమాణాలు**

అగ్నిప్రమాదం సంభవించినప్పుడు తక్షణ స్పందన కోసం అన్నిరకాల పరికరాలు అందుబాటులో ఉంచాలి.

అత్యవసర ద్వారాలు ఉండాలి.

ప్రమాదాలు జరిగినప్పుడు తప్పించుకోవడంపై అభ్యర్థులకు అప్పుడప్పుడూ మాక్‌డ్రిల్స్ సైతం నిర్వహిస్తుండాలి.

రానున్నది కొలువుల జాతర

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే గ్రూప్-1, 2 ఉద్యోగాలు భర్తీ చేయడంతో త్వరలోనే మరిన్ని పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడానికి కసరత్తు ప్రారంభించింది. వేయికళ్లతో ఎదురుచూస్తున్న యువత నోటిఫికేషన్లు వచ్చిన వెంటనే అంతా కోచింగ్ సెంటర్ల బాట పడుతారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ, జీహెచ్ఎంసీ అధికారులు ముందుగానే మేల్కొని తనిఖీలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# విధుల్లో వంతులు.. అస్తవ్యస్త సేవలు



తాండూరు : కొడంగల్ మండలం పరిధిలోని రావులపల్లికి చెందిన అఖిల అర్ధరాత్రి ప్రసూతి కోసం వచ్చింది. వైద్యురాలు గదిలో నుంచి బయటకి రాలేదు.. ఫలితంగా గర్భంలో బిడ్డతోసహా మృతి చెందింది. ఘటనపై విచారించి వైద్యవిధాన పరిషత్ అధికారులు వైద్యురాలిని సస్పెండ్ చేశారు.

యాలాల మండలం గోరేపల్లికి చెందిన మహిళ మొదటి కాన్పు కోసం ఆస్పత్రికి రాగా.. వైద్య సిబ్బంది చీదరించుకొంటున్నారని వాపోయింది. ఈ విషయమై ఆస్పత్రిలో గొడవ జరిగింది. తోటి సిబ్బంది సముదాయించారు.

ఒక ఉద్యోగి వాస్తవానికి 8 గంటలపాటు పనిచేయాలి. అలాంటిది 24 గంటలూ నిరంతరంగా విధుల్లో ఉండి వైద్యసేవలు అందిస్తున్నారు. ఇదేదో సేవాభావం అనుకుంటే పొరపాటే. ఒకసారి 24 గంటలపాటు పనిచేసి తరవాత వారం రోజులు డుమ్మా కొట్టడానికే ఇదంతా అని తెలిస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే. ప్రస్తుతం తాండూరు మాతాశిశు సంరక్షణ ప్రభుత్వ ఆస్పత్రిలో ఇదే తంతు కొనసాగుతోంది. వైద్యులు వంతుల వారీగా విభజించుకొని విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో వారికే కాకుండా రోగులకూ ఇబ్బందులు తప్పడం లేదు. ఫలితంగా సరైన వైద్య సేవలు అందక తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై వైద్యవిధాన పరిషత్ అధికారులు పట్టించుకోవాలని, రోజుకు మూడు షిఫ్టుల్లో వైద్యులు పనిచేసేలా చూడాలని రోగులు కోరుతున్నారు.

**రోజూ వందల మందికి..**

తాండూరు జిల్లా ఆస్పత్రికి అనుబంధంగా హైదరాబాద్ మార్గంలో మాతాశిశు సంరక్షణ కేంద్రం కొనసాగుతోంది. రోజూ గర్భిణులు, బాలింతలు, పుట్టిన చిన్నారుల నుంచి 12 ఏళ్ల పిల్లలు ఇక్కడ వైద్యసేవలు పొందుతున్నారు. గైనకాలజిస్టులతోపాటు చిన్నపిల్లల వైద్యులు, మత్తు వైద్యులు, సాధారణ చికిత్స అందించేవారు విధులు నిర్వర్తిస్తున్నారు. మహిళలు, చిన్నారులంతా కలిపి రోజూ 350- 400 మంది వరకు వైద్యసేవల కోసం వస్తుంటారు. 15-20 వరకు సాధారణ ప్రసవాలు, 8-15 వరకు శస్త్రచికిత్సల కేసులు నమోదవుతున్నాయి.

**రాత్రివేళల్లో తప్పని ఇబ్బందులు..**

24 గంటలపాటు రోగులను పరిశీలించడం.. ప్రసూతి, శస్త్ర చికిత్సలు చేస్తుండడంతో అలసిపోయి వైద్యులకూ ఇబ్బందిగా మారుతోంది. దీంతో రాత్రివేళల్లో వారి గదుల్లోకి వెళ్లి నిద్రకు ఉపక్రమిస్తున్నారు. ఈ సమయాల్లో హెడ్‌నర్సులు, నర్సులు, వైద్య సిబ్బంది ప్రసూతి సేవలు అందించాల్సి వస్తోంది. రాత్రివేళల్లో స్త్రీవైద్య నిపుణులు పరీక్షలు చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రసూతి సమయాల్లోనూ సరైన వైద్యం అందక గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై ఆసుపత్రికి చెందిన ఓ సీనియర్ వైద్యుణ్ని వివరణ కోరగా.. ఇది చాలాకాలంగా కొనసాగుతోందన్నారు.

# అంతు చిక్కదు.. ఊపిరాడదు



హైదరాబాద్: రాత్రయితే చాలు నగరంలోని అనేక ప్రాంతాల్లో రసాయన ఘాటు వాసనలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయ్. ఎక్కడి నుంచి వస్తున్నాయో అంతుచిక్కదు..గంటల తరబడి ఊపిరిసలపనివ్వదు. ఆ సమయాల్లో కిటీకీలు, తలుపులు మూసి ఇంట్లోనే ఉండాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) కారకులను గుర్తించడంలో విఫలమవుతోందని ఆరోపిస్తున్నారు. ఘాటు వాసనలతో గొంతునొప్పి, కళ్లలో మంట, శ్వాస ఇబ్బందులు ఉంటున్నాయని, నల్లగండ్ల, బాచుపల్లి, కొండాపూర్, గచ్చిబౌలి, మణికొండ నివాసితులు తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు.

నేరుగా గాల్లోకి.. శివారు ప్రాంతాల్లో 200 బల్క్‌డ్రగ్, ఫార్మా కంపెనీలున్నాయి. వాటిల్లో ఉత్పత్తులు తయారుచేసినప్పుడు విడుదలయ్యే పొగ విపరీతమైన వాసన వస్తుంది. వోలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్ (వీవోసీ) ఎక్కువగా ఉండటంతో వాసనలు ఘాటుగా వస్తుంటాయి. నేరుగా గాల్లోకి వదులుతుండడంతో చుట్టుపక్కల ప్రాంతాలకు విస్తరిస్తుంది. బాచుపల్లి, కూకట్‌పల్లి, గచ్చిబౌలి తదితర ప్రాంతాల వరకు ఈ వాసనలు విస్తరిస్తున్నాయి.

శుద్ధి చేస్తున్నారా..?: పరిశ్రమల నుంచి విడుదలయ్యే పొగ ప్రత్యేకంగా శుద్ధి చేయడానికి వ్యవస్థలు ఉంటాయి. శుద్ధి చేసి గాల్లోకి వదలాలి. దీనిని పీసీబీ అధికారులు తనిఖీ చేయాలి.

**గుర్తించడం సాధ్యమేనా..?**

పీసీబీ వద్ద ఉన్న పరికరాలు వోలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్ సహా కొన్ని కాలుష్య కారకాలను గుర్తించగలవు.సమస్య ఉన్న చోట టెడ్లర్ బ్యాగ్ ద్వారా గాలిని బంధించి పీసీబీ ప్రధాన కార్యాలయంలోని జీసీఎంఎస్ యంత్రంలోకి పంపి కాలుష్య కారకాన్ని గుర్తించొచ్చు.అధికారులు క్షేత్రస్థాయికి చేరుకునే సరికి ఒక్కోసారి వాసనల ఉద్ధృతి తగ్గొచ్చు. ఈ నేపథ్యంలో ఆయా కాలనీలవాసులకే గాలిని బంధించేలా శిక్షణ అందించాలి. పౌర భాగస్వామ్యంతో కారకాలను గుర్తించొచ్చు.

# ఆదాయవృద్ధికి కసరత్తు

కరీంనగర్ : నగరపాలికలు, పురపాలికల్లో వ్యాపార లైసెన్స్‌ల రుసుము ద్వారా ఆదాయం పెంచుకోవడానికి ఉమ్మడి జిల్లాలో ముమ్మర కసరత్తు చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఈ విషయంపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టకపోవడంతో బల్దియాల ఆదాయానికి గండి పడిందని భావిస్తున్న అధికారులు ప్రస్తుతం వాణిజ్య, మిశ్రమ వినియోగ (గృహం, వాణిజ్య భవనం కలిసి ఉన్నవి) ఆస్తుల ప్రకారం ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి చేశారు. ఉమ్మడి జిల్లాలో 44,347 మిశ్రమ ఆస్తులు ఉన్నట్లు రాష్ట్రస్థాయి అధికారులు నివేదిక పంపగా క్షేత్రస్థాయిలో 33,188 దుకాణాలకు లైసెన్స్ లేనట్లు వార్డు అధికారులు గుర్తించారు. వాటికి లైసెన్సులు తీసుకునేలా వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నారు.

**అత్యధికంగా రూ.లక్ష ఫీజు**

రహదారి వెడల్పు ఆధారంగా వాణిజ్య, వ్యాపార దుకాణాలకు పొడవు, వెడల్పు కొలతలు నిర్వహిస్తున్నారు. సాధారణం అయితే ఒక చదరపు అడుగుకు రూ.5 చొప్పున లెక్కిస్తున్నారు.

ఒక్కో దుకాణానికి వ్యాపార లైసెన్స్ కనీసం రూ.200ల నుంచి



అత్యధికంగా రూ.లక్ష ఉంటుంది. దీనికంటే అధిక మొత్తం వేయడానికి వీల్లేకుండా శ్లాబు విధించారు.

పునరుద్ధరించుకోకపోతే..

ఆస్తి పన్ను మాదిరిగానే ఏటా దుకాణాలకు వ్యాపార లైసెన్స్ ఫీజు చెల్లించకపోతే జరిమానా వేస్తారు.

ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే లోపు చెల్లించే వారికి ఎలాంటి అపరాధ రుసుము ఉండదు.

ఆ తర్వాత పునరుద్ధరించుకోవడానికి దరఖాస్తు చేస్తే 25 శాతం జరిమానా వేస్తున్నారు.

ఇవీ సమస్యలు

ఆన్‌లైన్‌లో కనిపిస్తున్న దుకాణాలు, సంస్థలు, క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు.

లైసెన్స్ వివరాలను ఒకసారి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తరువాత వాటిని మార్చడం సాధ్యం కావడం లేదు. దీంతో వ్యాపారి పేరుపై, ఇంటి పేరుపై ట్రేడ్ లైసెన్స్ ఛార్జీలు నమోదవుతూనే ఉన్నాయి.

కొందరు వ్యాపారులు వ్యాపారంలో దెబ్బతిని కొన్నేళ్లు మూసేసి, తరువాత కొత్తగా వ్యాపారం ప్రారంభిస్తున్నారు.

కొత్త వ్యాపారానికి లైసెన్స్ తీసుకోవాలనుకుంటే పాత వ్యాపారం లైసెన్స్‌కు సంబంధించి రుసుము బకాయిలు కట్టమంటున్నారని వ్యాపారులు వాపోతున్నారు.

# ఇరుకు గదులు.. ఇక్కట్ల నడుమ చదువులు

పెద్దపల్లి :విద్యార్థులు వరండాలో ఉన్న ఈ చిత్రం ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో శివకేశవస్వామి ఆలయం వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనిది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 166 మంది విద్యార్థులు, మరో 24 మంది పూర్వప్రాథమిక పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇందులోనే రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో పైపెచ్చులు ఊడిపోయి, ఉరుస్తున్నాయి. మిగిలిన మూడు గదుల్లో తరగతులను నడుపుతుండగా మరో గదిని స్టాఫ్‌రూంగా వినియోగిస్తూనే అందులోనే పాఠాలు బోధిస్తున్నారు. మిగతా తరగతులను వరండాల్లో కొనసాగిస్తున్నారు. తరగతి గదుల కొరతతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

రాచర్ల బొప్పాపూర్‌లో శివకేశవస్వామి ఆలయం వద్ద ఉన్న పాఠశాల భవనం పురాతనంగా మారడంతో రెండు పడక గదుల ఇళ్ల సముదాయం వద్ద నిర్మించిన నూతన పాఠశాల భవనం ఇదీ. రూ.28 లక్షల సీడీపీ, రూ.7.80 లక్షల 'మన ఊరు- మనబడి' నిధులను వెచ్చించారు. గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్తుల్లో నాలుగు తరగతి గదులున్నాయి. ఈ భవనం వెనుకాలే రూ.24 లక్షలతో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, రూ.3.40 లక్షల ఈజీఎస్ నిధులతో వంటగది, బాలురు, బాలికలకు వేర్వేరుగా రూ.12.40 లక్షలతో శౌచాలయాలు,



రూ.9.50 లక్షల ఈజీఎస్ నిధులతో ప్రహరీలను నిర్మించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో రూ.4 లక్షల విలువైన కరెంటు, రంగులు వేసే పనులు మిగిలిపోయాయి. ఇలా అన్ని హంగులతో భవన నిర్మాణం పూర్తయి సుమారు నాలుగేళ్లు దాటుతున్నా వినియోగంలోకి తేవడం లేదు. జిల్లాలో 503 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో దాదాపు 40 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ కింద 283 బడులను ఎంపిక చేశారు. గ్రామీణ, పట్టణ పాఠశాలల్లో విద్యుత్తు, తాగునీరు, భవనాల మరమ్మతులు, శౌచాలయాల మరమ్మతులు, లేనిచోట కొత్తగా నిర్మాణాలు తదితర కనీస వసతుల కల్పనకు రూ.11 కోట్లు వెచ్చించారు. అంతకుముందు 'మన ఊరు- మన బడి'లో భాగంగా 172 పాఠశాలల్లో ఆయా వసతులు కల్పించారు. జిల్లాలో పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన 16 పాఠశాలల్లో సైన్స్‌ల్యాబ్, గ్రంథాలయాలు, కంప్యూటర్ ల్యాబ్ తదితర వాటిని ఏర్పాటు చేశారు. 128 సర్కారు బడుల్లో కనీసం 189 అదనపు తరగతి గదులు అత్యవసరమని విద్యాశాఖ అధికారులు గుర్తించారు. అదనపు తరగతి గదుల నిర్మాణాలకు నిధులు లేక అనేక పాఠశాలలు నీరసించిపోయాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు ఇరుకు గదులు, వరండాలు, చెట్ల కింద తమ చదువులను నెట్టుకొస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి, పాఠశాలల్లో నెలకొన్న అదనపు తరగతి గదుల సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదికలు: వినోద్, జిల్లా విద్యాశాఖ అధికారి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను నిత్యం సందర్శిస్తున్నాం. ఆయా పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు, అదనపు తరగతి గదుల కొరతను గుర్తిస్తున్నాం. ఈ మేరకు ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పిస్తున్నాం. సర్కారు బడుల్లో చదివే విద్యార్థులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చూడడమే మా లక్ష్యం. నిధులు మంజూరు కాగానే అదనపు తరగతి గదుల నిర్మాణాల పనులు చేపడుతాం.

చురకలు



# కేటగిరి.. రాబడిలో కిరికిరి

హైదరాబాద్: ఆర్థిక ఇబ్బందుల్లో సతమతమవుతున్న జలమండలి రాబడి అవకాశాలపై ప్రత్యేక దృష్టిసారిస్తోంది. మహానగరంలో 14.2 లక్షల నీటి కనెక్షన్లు ఉన్నా జలమండలికి వస్తున్న ఆదాయంలో 80 శాతం లక్ష కనెక్షన్ల నుంచే వస్తోంది. మిగిలిన వాటిలో వాణిజ్య కనెక్షన్లు కేవలం 50 వేలు మాత్రమే ఉన్నాయి. నగరంలో గృహావసరాలకు నీటి కనెక్షన్లకు తీసుకుని వాణిజ్య అవసరాలకు వాడుతున్నవి ఎక్కువ ఉన్నట్లు పరిశీలనలో గుర్తించారు. దీనిపై సర్వేకు శ్రీకారం చుట్టారు. ప్రాథమికంగా లక్షకు పైగా హొటళ్లు, రెస్టారెంట్లు, షోరూంలు, ఇతర వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు వెల్లడైంది. పక్కాగా వీటిని నిర్ధారించి కేటగిరిని మార్చనున్నారు. దీనికోసం మీటర్ రీడర్లతో పాటు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్నారు. ప్రతి కనెక్షన్‌ను పరిశీలించి వాణిజ్య అవసరాలకు వినియోగి



స్తుంటే అక్కడికక్కడే వివరాలను నమోదు చేయనున్నారు. ఈ వివరాలను స్థానిక మేనేజర్ పరిశీలించి ధ్రువీకరించుకున్న తర్వాత కేటగిరి మారుస్తారు. ప్రధాన రహదారులు, కీలక వాణిజ్య ప్రాంతాల్లో తొలుత నెలరోజులపాటు సర్వే కొనసాగనుంది. కమర్షియల్ కనెక్షన్లకు ఉచిత పథకం వర్తించకపోగా కిలో లీటరుకు కనీసం రూ.40గా ఉంది. వినియోగం ఆధారంగా ఈ మొత్తం భారీగా పెరుగుతుందని విశ్లేషిస్తున్నారు.

**జల మండలి నీటి కనెక్షన్లు..**


మొత్తం 14.20 లక్షలు ఉచిత పథకం 6.46 లక్షలు

లబ్ధిపొందుతున్న కుటుంబాలు 12.29 లక్షలు

బల్క్ 1 లక్ష వాణిజ్య 50 వేలు

# ట్రాకింగ్ సులభం.. వస్తువులు భద్రం

హైదరాబాద్: జీహెచ్‌ఎంసీలోని అన్ని సెక్షన్లకు అవసరాన్ని బట్టి కంప్యూటర్‌కి సంబంధించిన ఎలక్ట్రానిక్ పరికరాలు, ప్రింటర్లు, జిరాక్స్ యంత్రాలు వంటివన్నీ ఐటీ విభాగం సమకూరుస్తుంది. హోదాను బట్టి కొంతమంది అధికారులకు ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్‌లు, ట్యాబ్‌లు సైతం ఇస్తుంటారు. గతంలో వస్తువులు ఎప్పుడు ఇచ్చారో ఐటీ విభాగం దగ్గర సమాచారం లేకపోవడంతో గందరగోళం జరుగుతున్నట్లు అధికారులు అంచనాకు వచ్చారు. ఈ పద్ధతికి చెక్ పెట్టేలా సమాచారాన్ని డిజిటలైజేషన్ చేయాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయానికి వచ్చింది. ఇందుకు ప్రత్యేకంగా 'అసెట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్'ని ఆవిష్కరించింది. ఈ వ్యవస్థ వల్ల ఉద్యోగులకు కేటాయించిన వస్తువు ఎవరి దగ్గర ఉందో సులభంగా ట్రాకింగ్ చేయవచ్చు. ఫలితంగా వస్తువుల బదిలీ, తిరిగి తీసుకోవడం సులభతరం కానుంది.




**ఇక అన్నీ ఆన్‌లైన్..** 'టీజీ ఆన్‌లైన్' సహకారంతో అసెట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను రూపకల్పన చేశారు. సంబంధిత అధికారులకు ఇచ్చేముందు వస్తువుపై బార్‌కోడ్ అతికిస్తారు. స్కాన్ చేస్తే వివరాలు వెబ్‌సైట్‌లో నమోదవుతాయి. దీంతో ఏ వస్తువు ఎవరు, ఎప్పుడు? తీసుకున్నారనే విషయం సులువుగా తెలుస్తుంది. వస్తువులకు సంబంధించి ఇండెంట్ నుంచి ఆమోదం, జారీ వరకు అంతా వెబ్‌సైట్‌లో నిక్షిప్తం అవుతుంది. గతంలో మాదిరిగా రిజిస్టర్లు తిరగేయాల్సినఅవసరం లేకుండా.. ఒక్క క్లిక్‌తో సమాచారం లభిస్తుంది. అధికారుల నుంచి వచ్చిన విజ్ఞప్తి నుంచి దాన్ని పరిశీలించి ఐటీ అధికారుల ఆమోదం, సరఫరా వరకు వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉంటాయి.

# నొప్పులొస్తే.. నోములే

దేవరకొండ : అంతరిక్షానికి సైతం అవలీలగా వెళ్లొస్తున్న ప్రస్తుత రోజుల్లో పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణులను, అత్యవసర సమయాల్లో రోగులను ఆసుపత్రులకు తరలించేందుకు కొన్ని గ్రామాల్లో నేటికీ రోడ్డు వసతి లేదు. కొన్నిచోట్ల ఉన్నా.. వాహనాలు వెళ్లలేని పరిస్థితి. గిరిజన ప్రాంతమైన దేవరకొండ నియోజకవర్గంలో రోడ్డు మార్గాలు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దశాబ్దాలు గడుస్తున్నా చందంపేట, నేరెడుగొమ్ము, డిండి, పీఏపల్లి మండలాల్లోని కొన్ని గ్రామాలకు నేటికీ రోడ్డు రవాణా సౌకర్యం కల్పించకలేకపోవడం పాలకుల పనితీరుకు అద్దం పడుతోంది. సరైన రోడ్డు మార్గం, వంతెనలు లేక గర్భిణులు, బాలింతలు అంబులెన్స్ సేవలను పొందలేక పోతున్నారు. ఉన్న రోడ్లు సరిగ్గా నిర్మాణం చేపట్టకపోవడంతో వాహనాలు రాలేని పరిస్థితి నెలకొంది. దేవరకొండ నియోజకవర్గానికి కూతవేటు దూరంలో ఉన్న బుడ్డోనితండా నుంచి మర్రిచెట్టుతండాకు మధ్యలో వాగు దాటాల్సి ఉంటుంది. మూడేళ్ల కిందట ఓ గర్భిణి వాగు దాటుతూ అందులో చిక్కుకొని మృత్యువాత పడగా, ఏడాది క్రితం గిరిజన వృద్ధుడు మృతిచెందాడు. పీఏపల్లి మండలం బూడిదగట్టు, పీఏపల్లి నుంచి అంగడిపేట, దేవరకొండ మండలం కొర్రతండా నుంచి ఎర్రబిచ్చతండా, బుడ్డోనితండా నుంచి మర్రిచెట్టుతండా, డిండి మండలం గజరాల్ తండా నుంచి చెరుకుపల్లి, బ్రాహ్మణపల్లి నుంచి వావిల్‌కోల్, నిజాంనగర్ నుంచి కందుకూరు, ఉమ్మడి చందంపేట మండలం గువ్వలగుట్ట, కంబాలపల్లి, పొగిళ్ల, నక్కదుబ్బతండా, బండకిందితండా రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కనీసం అత్యవసర సమయంలో వాహనాలు వచ్చేలా మార్గం నిర్మించాలని 'గిరి'జనం కోరుతున్నారు. నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లో రహదారులను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని ఆర్‌అండ్‌బీ డీఈ భాస్కర్ తెలిపారు.

# టన్నుల్లో వ్యర్థాలు.. నిర్వహణ మూణ్నాళ్లు



హైదరాబాద్: రైతు బజార్లలో నిత్యం టన్నుల కొద్దీ కూరగాయల వ్యర్థాల వెలువడుతున్నాయి. వీటి నిర్వహణపై ఉదాసీనంగా వ్యవహరించడంతో బజార్లు దుర్గంధ భరితంగా మారుతున్నాయి. కొన్నిచోట్ల బయోగ్యాస్ తయారీకి ఏర్పాటు చేసిన ప్లాంట్లు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. కుప్పలుగా పేరుకుపోయిన వ్యర్థాలతో మార్కెట్లు కంపుకొడుతున్నాయని రైతులు, ప్రజలు వాపోతున్నారు.

**బోయిన్‌పల్లి మార్కెట్ రాబడిలేదు..**

బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్‌లో నిత్యం 10 టన్నుల వ్యర్థాలు వెలువడుతున్నాయి. నాలుగేళ్ల క్రితం రూ.33 లక్షలతో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. వ్యర్థాలతో ఉత్పత్తి చేసే గ్యాస్ ద్వారా మార్కెట్‌లో క్యాంటీన్ అవసరాలు, వీధి దీపాలకు ఖర్చులు తీరేవి. ఏడాదికి సుమారు రూ.18 లక్షలు వరకు ఆదాయం సమకూరేది. కాంట్రాక్ట్ సంస్థ టెండర్ ప్రక్రియ పూర్తి కావడంతో ఆరు నెలల క్రితం ప్లాంట్ మూతపడింది. కొత్త కాంట్రాక్ట్‌లో జాప్యంతో మార్కెట్‌లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది.

**మోడల్ బజార్‌లోనూ..**

ఎర్రగడ్డ మోడల్ రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన బయోగ్యాస్ ప్లాంట్ ఏడాదిన్నరగా మూసి ఉంది. ఐదేళ్ల క్రితం దీని కోసం రూ.15 లక్షలు ఖర్చు చేశారు. రోజుకు సుమారు ఐదు టన్నుల వరకు వ్యర్థాలు వెలువడేవి. కొంత బయోగ్యాస్‌కు వినియోగిస్తుండగా.. మిగిలిన వ్యర్థాలతో కంపోస్ట్ తయారు చేసేవారు. ప్రస్తుతం రెండు యూనిట్లు కూడా మూతపడ్డాయి. ప్రస్తుతం కొత్తపేట పండ్లమార్కెట్, ఎల్బీనగర్, హైదరాబాద్, బోయినపల్లి, భరత్‌నగర్, మెహిదీపట్నం, కేపీహెచ్‌బీ సహా పలు రైతు బజార్లలో పారిశుద్ధ్య సమస్య తీవ్రమైంది.

రైతుబజార్లలో నిత్యం వెలువడే వ్యర్థాలు: 3–10 టన్నులు

తరలింపు: రెండు మూడురోజులకోసారి

# కరవు తీరా వాన



శంకరపట్నం : జిల్లాలో పలు మండలాల్లో కరవు తీరా వర్షం కురిసింది. గత మూడు నెలలుగా పెద్దగా వానలు లేని చిగురుమామిడి, సైదాపూర్, హుజూరాబాద్ మండలాల్లో భారీ వాన పడింది. వాగులు వంకలూ పొంగిపొర్లాయి. చెరువులు మత్తళ్లు దూకాయి. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

**జిల్లాలో వర్షపాతం వివరాలు ఇలా..**

జిల్లాలో ఉదయం నుంచి శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు కురిసిన వర్షపాతం ఇలా(మి.మీలలో).. చిగురుమామిడి 211.3, హుజూరాబాద్ 197.8, వి.సైదాపూర్ 108.0, శంకరపట్నం 104.5, తిమ్మాపూర్ 84.8, వీణవంక 84.5, ఇల్లందకుంట 81.0, జమ్మికుంట 70.3, మానకొండూర్ 51.0, గన్నేరువరం 30.0, కరీంనగర్ 13.3, కొత్తపల్లి 11.5, కరీంనగర్ గ్రామీణం 8.5, చొప్పదండి 8.5, రామడుగు 6.5, గంగాధర 2.0 మి.మీటర్లుగా నమోదైనట్లు జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి రాజారాం తెలిపారు.

**నిలిచిన రాకపోకలు**

మెట్‌పల్లి–లింగాపూర్ గ్రామాల శివారు లోలెవల్ వంతెనపై వరద చేరటంతో వాహనాల రాకపోకలు నిలిచాయి. కాచాపూర్, రాజాపూర్ గ్రామాలకు బస్సు సౌకర్యం నిలిచింది. కేశవపట్నం నుంచి పాపయ్యపల్లికి ప్రధాన కాలువ మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి.

సైదాపూర్ మండంలోని బొమ్మకల్–గొడిశాల, ఎగ్లాస్‌పూర్–సోమారం గ్రామాల మధ్యలోని లోలెవల్ కల్వర్టులపై వరద పారడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

**మునిగిన పొలాలు**

శంకరపట్నం మండలంలో ఎన్‌హెచ్–563 నిర్మాణ పనులతో సమీప వరి పొలాల్లో వరద వచ్చి ఇసుక మేటలు వేయగా, రైతులు ఆవేదన చెందారు. పలు గ్రామాల్లో పొలాలు నీట మునిగాయి.

**175 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు**

హుజూరాబాద్ మండలంలోని ఆరు గ్రామాల్లో 175 ఎకరాల వరిపంటకు నష్టం జరిగిందని జిల్లా వ్యవసాయాధికారిణి జె.భాగ్యలక్ష్మి తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారుల ప్రాథమిక నివేదిక ప్రకారం సిర్సాపల్లి–20, కొందుగుల–10, తుమ్మనపల్లి–10, సింగాపూర్–20, హుజూరాబాద్–100, చెల్పూర్–15 ఎకరాల్లో కలిపి మొత్తం మండలంలో 175 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని తేల్చారు.

**విద్యుత్తు సంస్థకు రూ.5 లక్షల నష్టం**

విద్యుత్తు సంస్థకు గురువారం రాత్రి కురిసిన వర్షాలకు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని ఎస్‌ఈ మేక రమేశ్ బాబు తెలిపారు. హుజూరాబాద్ డివిజన్‌లో ఒక నియంత్రిక, పెద్దపాపయ్యపల్లిలో 5 విద్యుత్తు స్తంభాలు కూలిపోయాయని పేర్కొన్నారు. అత్యవసరమైతే టోల్ ఫ్రీ నంబరు 1912కు సంప్రదించాలన్నారు.

**ఇళ్లను చుట్టుముట్టిన వరద.. కాలనీవాసుల ఆందోళన**

శంకరపట్నం తాడికల్ గ్రామ శివారు మేలకుంటలో నీటి ప్రవాహం ఎక్కువై ఇళ్ల చుట్టూ నీరు చేరటంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిన్న నీటిపారుదలశాఖ అధికారులు పొక్లెయిన్‌తో కుంటలో నీరు బయటకు పోయేలా చర్యలు తీసుకున్నారు. ప్రతిసారి ఇక్కట్లు తప్పడంలేదని ఆందోళనకు దిగారు. పంటలు నీట మునిగి రైతులు ఆందోళన చెందుతున్నారు.

# సాగని పనులు.. పరిహారానికి దిగులు



గోదావరిఖని: ఉమ్మడి జిల్లాలో భూసేకరణ సమస్యలతో పలు ప్రాజెక్టుల పనులు ముందుకు సాగడం లేదు. రహదారులు, సాగునీటి ప్రాజెక్టుల పురోగతికి ఈ సమస్య అడ్డంకిగా మారుతోంది.. భూసేకరణ ప్రక్రియలో జాప్యం.. పరిహారం చెల్లింపులో నిర్లక్ష్యం.. సర్వేలో పొరపాట్లతో అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతోంది.

**రహదారుల నిర్మాణంలో జాప్యం** జగిత్యాల నుంచి కరీంనగర్ వరకు చేపట్టే జాతీయ రహదారి 563 భూసేకరణకు ఇంకా సర్వే చేస్తున్నారు. 58 కిలోమీటర్ల మేర నిర్మించే రహదారికి 245.94 హెక్టార్ల భూమి అవసరం ఉంది. పరిహారం చెల్లింపు ఎంతన్నది తేలలేదు. దీంతో పనుల్లో జాప్యం నెలకొంది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జగ్దల్‌పూర్ వరకు నిర్మించే జాతీయ రహదారి 63కి ఇటీవల పర్యావరణ అనుమతులు లభించాయి. ఉమ్మడి జిల్లాలో కోరుట్ల నుంచి ధర్మపురి మీదుగా మంచిర్యాలకు చేరుకునే రహదారికి 250 హెక్టార్ల భూమి అవసరం ఉంది. భూసేకరణ పూర్తయింది. నిధులు కూడా మంజూరయ్యాయి. డబ్బులు చెల్లించక పనులు వేగంగా సాగడం లేదు. మంచిర్యాల నుంచి వరంగల్ వరకు నిర్మించే 163 గ్రీన్‌ఫీల్డ్ రహదారికి 505 ఎకరాల భూమి అవసరం ఉంది. సర్వే పనులు పూర్తి చేశారు. కొంత మందికి పరిహారం చెల్లించారు. మరో 40 మంది నిర్వాసితులకు చెల్లించాల్సి ఉంది. దీని వల్ల అక్కడక్కడ పనుల్లో ఆలస్యమవుతోంది. అందని సాగునీరు గంగాధర, రామడుగు మండలాల మీదుగా సాగే అదనపు కాలువ నిర్మాణం పనుల్లో జాప్యం జరుగుతోంది. ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతల ద్వారా అంతర్గత పైపులైన్, కాలువల ద్వారా నీటిని పెగడపల్లి మండలం దీకొండ, నామాపూర్ పంపుహౌస్‌లకు తరలిస్తారు. అక్కడి నుంచి రామడుగు మండలం తిర్మలాపూర్ నుంచి ఉపరితల కాలువకు నీరందించే పథకంలో భాగంగా చేపట్టిన పనులకు బోయినపల్లి మండలంలో అయిదు గ్రామాల్లోని 165 ఎకరాలకు పరిహారం చెల్లించారు. రామడుగు, గంగాధర మండలాల్లోని 12 రెవెన్యూ గ్రామాల్లో సేకరించిన 446 ఎకరాలకు రూ.115 కోట్లు మాత్రమే చెల్లించారు.

ఇంకా రూ.154 కోట్లు చెల్లించాల్సి ఉంది. దీంతో కాలువ నిర్మాణం పనులు నిలిపివేశారు. జగిత్యాల జిల్లాలోని కథలాపూర్, మేడిపల్లి మండలాలకు కుడి కాలువ ద్వారా 18 గ్రామాలకు సాగు నీరందించే కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులు భూసేకరణ పరిహారం చెల్లింపులో జాప్యంతో నిలిచిపోయాయి. 40 వేల ఎకరాలకు సాగునీరందించే ఈ ప్రాజెక్టు కుడి కాలువ నిర్మాణం భూసేకరణ ప్రక్రియలో జాప్యం వల్ల నిలిచిపోయింది. మధ్యమానేరు నుంచి కాలువల ద్వారా విడుదల చేసేందుకు చేపట్టిన ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి.

# కళాశాల భూమి.. కబ్జాకు యత్నం

సిరిసిల్ల: సిరిసిల్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన భూమికి రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. 1987లో వేములవాడ మండలం అగ్రహారంలో ఏర్పాటైన కళాశాలకు అప్పుడు 25 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. బీఏ, బీఎస్సీ, బీకాం విభాగాల్లో 15 కోర్సులు ఉన్నాయి. 360 సీట్లకుగాను ఈ ఏడాది మొదటి సంవత్సరంలో అన్ని కోర్సుల్లో కలిపి మొత్తం 65 మంది మాత్రమే ప్రవేశాలు పొందారు. ప్రస్తుతం 190 మంది విద్యార్థులు చదువుతున్నారు. పీజీ తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. ఈ భవనంలోనే 2021లో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల తరగతులకు అనుమతులు ఇచ్చారు. అప్పటి నుంచి ఎంఏ ఆంగ్లం, తెలుగు, బీకాం జనరల్ పీజీ కోర్సులు రద్దు చేశారు. ఇటీవల కళాశాలకు పీఎంఉషా(ప్రధాన మంత్రి ఉచ్చతర శిక్షా అభియాన్)లో రూ.10 కోట్లతో మహిళా వసతి గృహనిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అయితే కళాశాలకు కేటాయించిన భూమికి ప్రహరీ లేక హద్దులు మార్చేస్తున్నారు.

**ప్రధాన రహదారి పక్కనే..**

వేములవాడ మండలం ప్రస్తుతం చంద్రగిరి పంచాయతీ పరిధిలోని తెట్టెకుంట సమీపంలో సిరిసిల్ల–కరీంనగర్ ప్రధాన రహదారి పక్కనే డిగ్రీ కళాశాల ఉంది. అగ్రహారం, చంద్రగిరి, చిర్లవంచ ఆర్‌అండ్‌ఆర్




కాలనీలు ఇక్కడ ఏర్పాటు చేయటంతో ఈ ప్రాంతంలో భూములకు డిమాండ్ పెరిగింది. గుంటకు రూ.15లక్షల పైనే పలుకుతోంది. ప్రహరీ లేకపోవడంతో ఒక పక్క నుంచి భగీరథ పైపులైన్, తెట్టెకుంటలోని క్వారీలకు రహదారి నిర్మాణాలు జరిగాయి. ఇదే అదనుగా సమీప కాలనీవాసులు సమాధులను సైతం ఏర్పాటు చేసుకున్నారు. ఓ సామాజిక వర్గం ఏకంగా ఆలయమే నిర్మించింది. సెలవు రోజుల్లో కళాశాల వెనక ప్రాంతం ఆకతాయిలకు కేంద్రంగా మారుతోంది. ఇటీవల మహిళా వసతి గృహ నిర్మాణానికి స్థలం పరిశీలిస్తున్న క్రమంలో ఈ ఆక్రమణలు వెలుగు చూశాయి.

**రెవెన్యూ శాఖ దృష్టికి ఆక్రమణలు**

ఆక్రమణలపై కళాశాల యంత్రాంగం రెవెన్యూ శాఖ దృష్టికి తీసుకెళ్లింది. సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని కోరింది. అంతేకాకుండా చుట్టూ ప్రహరీ నిర్మించి చొరబాట్లు జరగకుండా చూస్తే రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా ఉంటుందన్నారు. ప్రధాన రహదారివైపు దుకాణాల సముదాయం నిర్మిస్తే కళాశాలకు ఆదాయం సమకూరే అవకాశం ఉందన్నారు.

**ప్రహరీ ప్రతిపాదనలు పంపిస్తాం: శంకర్, ప్రిన్సిపల్, సిరిసిల్ల డిగ్రీ కళాశాల** కళాశాల భూముల ఆక్రమణలు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి, రెవెన్యూ సర్వేయర్ల ద్వారా సర్వే చేయించి హద్దులు నిర్ణయించాలని కోరాం. చుట్టూ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు కోసం ఉన్నతాధికారులను ప్రతిపాదనలు పంపనున్నట్లు చెప్పారు.

# రైతన్నా.. నేనున్నానోచ్

నాంపల్లి: వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో ఎరువుల వాడకం అధికమైంది. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు డీలర్లు ప్రభుత్వం నుంచి వచ్చే సరకును నిల్వ చేసి ధరలు పెంచేస్తున్నారు. దీంతో అన్నదాతలకు ఎరువులు దొరకడం లేదు. ఈ క్రమంలో యూరియా, డీఏపీ బస్తాలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలో వాటికి బదులుగా 'నానో' ద్రవాన్ని వాడితే మేలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

**ధర కూడా తక్కువే..**

సాధారణ యూరియా బస్తా రూ.266 వరకు ఉంది. డిమాండ్ కారణంగా కొన్ని చోట్ల బ్లాక్‌లో రూ.450 వరకు విక్రయిస్తున్నారు. తరలింపునకు మరో రూ.50 అదనంగా చెల్లించాల్సి వస్తోంది.. అదే అర లీటరు నానో యూరియా ద్రవం రూ.200–225కు లభిస్తుంది. డీఏపీ బస్తా రూ.1,350 ఉండగా అర లీటరు నానో డీఏపీ రూ.600లకే వస్తోంది. రైతు గరిష్ఠంగా 20 సీసాలు కొంటే ఇఫ్కో సంస్థ రూ.2లక్షల వరకు బీమా సౌకర్యాన్ని సైతం కల్పిస్తోంది. ముందుగా రసీదు తీసుకోవాలి.

**ఇవీ ప్రయోజనాలు..**

యూరియా, డీఏపీలను నేరుగా మొక్క మొదలుకు అందిస్తారు. దీంతో సగం నేలలోనే కలిసి పోతుంది. పంటకు అందేది కొంచెమే. మరో




వైపు భూమి సైతం సారాన్ని కోల్పోతుంది. మిత్ర పురుగులు చనిపోతాయి. నానోతో ఆ ఇబ్బంది ఉండదు. పిచికారీ చేయడంతో ఆకు ద్వారా 85శాతం వరకు నేరుగా మొక్కకు చేరుతుంది. నత్రజనిని సులభంగా చేరవేయొచ్చు. దిగుబడులు కూడా బాగుంటాయి.

**ఆర్థిక భారం తగ్గుతుంది– పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, నల్గొండ**

జిల్లాలో ప్రస్తుతం 5.29 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. జిల్లా రైతులు ఇప్పటి వరకు 35 వేల లీటర్ల నానో యూరియా వినియోగించారు. మరో 25 వేల లీటర్లు జిల్లాలో అందుబాటులో ఉంది. ఎకరాకు 75 కిలోల యూరియా అవసరమైతే.. నానో అర లీటరు సరిపోతుంది. ఆర్థిక భారం తక్కువ, రవాణా ఖర్చు ఉండదు. నానో యూరియా, నానో డీఏపీలతోపాటు పురుగు మందులు కూడా కలిపి పిచికారీ చేసుకోవచ్చు.

# ప్రైవేటు బూచీ.. ఖనిజం దోచి

నంద్యాల : ఉమ్మడి కర్నూలు జిల్లాలో మైనింగ్ దోపిడీ ఆగడం లేదు. సీనరేజీ వసూళ్ల బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించారు. వారు ఇప్పటికీ బాధ్యతలు తీసుకోకపోవడంతో గనుల శాఖ సిబ్బంది కొందరు వసూళ్లకు తెరతీశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 516 మైనింగ్ క్వారీలు ఉన్నాయి. ఫెల్స్పర్, లేటరైట్, సిలికా శాండ్, ఐరన్‌ఓర్ వంటి విలువైన ఖనిజాలు ఉన్నాయి. క్వారీల్లో ఖనిజం తవ్వి బయటకు రావాలంటే తప్పనిసరిగా సీనరేజీ చెల్లించాలి. ఖనిజం విలువను బట్టి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదికి రూ.180 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. ప్రైవేటు సంస్థ బాధ్యతలు తీసుకునే లోపే సొంతింటిని చక్క బెట్టుకోవాలన్నట్లు సిబ్బంది వ్యవహరిస్తున్నారు.

**దస్త్రాలు సమకూర్చుకోక..**

అవసరమైన దస్త్రాలను సదరు సంస్థ సమకూర్చుకోలేదు. ప్రభుత్వానికి ముందస్తుగా చెల్లించాల్సిన మొత్తం ఇప్పటికీ కట్టలేదు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి కాలేదు. ఈ నేపథ్యంలో కర్నూలు, నంద్యాల జిల్లాలోని క్వారీలను భూగర్భ గనుల శాఖ అధికారులు సదరు సంస్థకు అప్పగించలేదు. మరోవైపు గత నెల 25వ తేదీ నుంచి ప్రైవేటు సంస్థ వసూలు చేయాల్సిన సీనరేజీని గనుల శాఖే తీసుకుంటోంది. ఇక్కడే అక్రమాలకు 'తెర' లేచాయి. ప్రభుత్వానికి జమవుతున్నది కొంతైతే.. పక్కకు పోతున్న సొమ్ము బోలెడంత.

**నెలకు రూ.14.05 కోట్లు**

ఉమ్మడి జిల్లాలో క్వారీల నుంచి సీనరేజీ వసూలు చేసే బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ఇందుకు గత నెలలో టెండరు నిర్వహించారు. నెలకు రూ.14.05 కోట్లు చెల్లించేందుకు సుధాకర్ ఇన్‌ఫ్రా సంస్థ ముందుకొచ్చింది. రెండేళ్లపాటు సీనరేజీ వసూలు



చేయనుంది.

గత నెల 25 నుంచే బాధ్యత తీసుకోవాల్సి ఉంది. నెలకు సీనరేజీ రూపేణా రూ.10.45 కోట్లు, జిల్లా ఖనిజ నిధి కింద రూ.3.10 కోట్లు, ఖనిజాన్వేషణ నిధి పేరుతో రూ.22.16 లక్షలు, ఇతర ఖర్చులు రూ.27.50 లక్షలకుపైగా సదరు సంస్థ గనుల శాఖకు చెల్లించాల్సి ఉంది.

**ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు**

బేతంచెర్ల మండలం రామళ్లకోట, యంబాయి, రుద్రవరం, ఆర్ఎస్. రంగాపురం తదితర ప్రాంతాల్లో ఐరన్‌ఓర్ తవ్వకాలకు అడ్డే లేకుండా పోయింది. డోన్, ప్యాపిలి మండలాల్లో క్వార్ట్జ్, ఆదోని ప్రాంతంలో గ్రానైట్ తవ్వకాల విస్తృతి పెరిగింది. డోన్ నియోజకవర్గంలో అక్రమ తవ్వకాలకు ఓ ద్వితీయ శ్రేణి నేత నాయకత్వం వహిస్తున్నారు.

మహానంది మండలం గాజులపల్లె అంకిరెడ్డిపల్లె చెరువులో ఎర్రమట్టి తవ్వకాలు ఊపందుకున్నాయి. లీజు ప్రాంతంలో తనిఖీలు లేకపోవడం అక్రమార్కులకు కలిసి వస్తోంది.

**సరిహద్దులు దాటిస్తున్నారు**

సీనరేజీ వసూళ్లను ప్రైవేటు సంస్థకు అప్పగించడం.. సదరు సంస్థ ప్రతినిధులు ఇప్పటికీ బాధ్యతలు చేపట్టకపోవడంతో క్వారీల్లో లీజుదారులు ఇష్టానుసారంగా తవ్వకాలు చేస్తున్నారు. కొత్త సంస్థ వస్తే తమ పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఉద్దేశంతో లీజుదారులు భారీగా తవ్వకాలు చేపట్టి సరిహద్దులు దాటించేస్తున్నారు.

క్వారీల్లో గనుల శాఖ నిర్దేశించిన ప్రాంతంలో కొలతల ప్రకారం ఎంత ముడి సరకు తవ్వుకోవాలో ఆ ప్రకారం మైనింగ్ జరగాలి. ఇవేమీ పట్టించుకోకుండా గత కొద్ది రోజులుగా గ్రానైట్, కంకర, సున్నపురాయి పెద్దఎత్తున తరలిపోతోంది.

కొలిమిగుండ్ల, అవుకు, బేతంచెర్ల, డోన్, ప్యాపిలి, పాణ్యం మండలాల్లోని క్వారీల్లో రేయింబవళ్లు అడ్డదిడ్డంగా తవ్వకాలు చేపట్టి తరలిస్తున్నారు. పాణ్యం సమీపంలోని గద్దెలకొండలో గత రెండు వారాలుగా పెద్దఎత్తున తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడ ఓ నేత కనుసన్నల్లో మైనింగ్ జరుగుతోంది. అవుకు మండలం రామాపురం, సంగపట్నం, చెర్లోపల్లి, బెలుం తదితర ప్రాంతాల్లోని క్వారీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

# గృహ యోగం.. లక్ష్యం దూరం!

పాలకొల్లు: పేదల గృహ నిర్మాణాలను వీలైనంత త్వరగా పూర్తి చేసే దిశగా కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. దీనిలో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాలు మంజూరు చేయించడంతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అదనపు సాయం అందించింది. అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా గృహ నిర్మాణ లక్ష్యాన్ని అందుకోలేకపోయారు. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనుమతులు ఇచ్చి పనులు మొదలు పెట్టిన గృహాల్లో 55 శాతం మేర మాత్రమే పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ



దశల్లో ఉన్నాయి. దీపావళి నాటికి వీలైనంత ఎక్కువ మంది లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించే దిశగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2024 జూన్ తరువాత 9,107 గృహ నిర్మాణాలు ప్రారంభించగా ఇప్పటికి 5,004 పూర్తయ్యాయి. క్షేత్ర స్థాయిలో పరిస్థితిని పరిశీలిస్తే దీపావళి నాటికి గృహ ప్రవేశాలు చేసే కుటుంబాలు సగం వరకు ఉండే అవకాశం కనబడుతోంది. జిల్లాలో తణుకు, భీమవరం నియోజకవర్గాల్లో మినహా మిగిలిన చోట్ల చేపట్టిన గృహ నిర్మాణాల్లో 60 మాత్రమే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ అంశంపై గృహనిర్మాణ సంస్థ ఈఈ రామాయణం త్రిమూర్తులు స్పందిస్తూ జీఎస్టీ సంస్కరణలతో సిమెంటు, ఇతర నిర్మాణ సామగ్రి ధరలు తగ్గాయని.. దీనిని సద్వినియోగం చేసుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించడంతో పాటు శాఖా పరంగా తగిన సహకారం అందిస్తామన్నారు.

# కర్షకుడికి కంచె



హిందూపురం: రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి రాజధానికి వేగంగా చేరుకోవడానికి, బెంగళూరు– విజయవాడ మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. బెంగళూరు నుంచి వచ్చే జాతీయ రహదారి 44, గుంటూరు వద్ద జాతీయ రహదారి 16లను కలుపుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే(హరిత జాతీయ రహదారి) నిర్మాణాన్ని చేపట్టాయి. 345 కి.మీ.లతో తెలుగు రాష్ట్రాల్లోనే అతి పొడవైన హరిత జాతీయ రహదారిగా గుర్తింపు సాధించబోతోంది.

**వ్యవసాయం చేసేదెలా..?**

ఈ జాతీయ రహదారి, దాని నిర్మాణానికి భూములు కోల్పోయిన రైతులకు మాత్రం కష్టాలు తెచ్చిపెడుతోంది. ప్రధాన రహదారికే కాదు.. దాని పక్కన నిర్మించిన సర్వీసు రోడ్లకు సైతం సిమెంటు దిమ్మెలతో కంచె నిర్మిస్తున్నారు. దీంతో రహదారి పక్కన భూములున్న రైతులు అందులోకి వెళ్లేందుకు అవకాశం లేకుండా పోతోంది. ఇప్పటికే పలుచోట్ల కంచె నిర్మాణం పూర్తికావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పొలాల్లోకి వెళ్లేదెలా.. వ్యవసాయం చేసేది ఎలా అని ప్రశ్నిస్తున్నారు. కంచె నిర్మాణ పనులు చేస్తున్న సిబ్బందితో వాదనకు దిగుతున్నారు. తాము ఏమీ చేయలేమని, రహదారి ప్రణాళిక అలా ఉందని వారు చెబుతుండటంతో రైతుల్లో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ప్రతి పొలానికి దారి వదలాలని డిమాండ్ చేస్తున్నారు.

**రాకపోకలకు ఇబ్బందే..**

రహదారి పక్కన ఉన్న గ్రామాలకు వాటి సమీపంలో రహదారి కింద అండర్ బ్రిడ్జిలను నిర్మించారు. అయితే వర్షం వస్తే చాలు అవి నిండిపోతున్నాయి. రైల్వే శాఖ నిర్మించిన లోవంతెనల మాదిరిగానే ఇవి వానాకాలంలో నీటితో నిండి రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు రైతుల, గ్రామాలకు రాకపోకల విషయంలో ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది.

**ఎక్కడి నుంచి అంటే..**

రహదారి నిర్మాణం జిల్లాలోని చిలమత్తూరు మండలం కోడూరు వద్ద ఎన్‌హెచ్ 44 నుంచి ప్రారంభమవుతుంది. అక్కడ నుంచి కడప జిల్లా పులివెందుల మీదుగా నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లా ముమ్మడివరం వరకు వెళుతుంది. 14 ప్యాకేజీలతో రహదారి నిర్మాణం శరవేగంగా సాగుతోంది.

# కళ్లెదుటే.. కల చెదిరింది



శ్రీకాళహస్తి: అదొక యువత కలల ప్రాజెక్టు.. ఫేజ్-1, 2లు పూర్తయి ఉంటే.. కనీసం 31 వేల మంది స్థానిక యువతకు ఉద్యోగాలు దక్కి ఉండేవి. కానీ.. కలలన్నీ తలకిందులయ్యాయి. ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ప్రాజెక్టు అటకెక్కింది. ప్రస్తుతం ఆ నిర్మానుష్య ప్రాంతంలో నిరుపయోగ భవనాలు కనిపిస్తున్నాయి. అదే శ్రీకాళహస్తి మండలం మన్నవరంలో ఏర్పాటైన ఎన్బీపీపీఎల్ ఎన్టీపీసీ-బీహెచ్ఈఎల్ పవర్ ప్రాజెక్ట్ కథ వెనుక దాగిన విఫల వ్యథ.

**భారీ అంచనాలు**

విద్యుత్తు ఉత్పాదన రంగంలో దిగ్గజ సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఎన్బీపీపీఎల్ ఏర్పాటు సమయంలో ఎన్నో భారీ అంచనాలు వేసుకున్నారు. మన్నవరం ప్రాంతం పారిశ్రామికంగా పురోభివృద్ధిని సాధిస్తుందని ఆశపడ్డారు.

2010 సెప్టెంబరు 1వ తేదీన అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ భూమిపూజ చేశారు.

కర్మాగారం దృష్టి: కోల్, యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌ల పరికరాల తయారీ (ఫేజ్-1), పవర్ ప్లాంట్‌ల బాయిలర్లు, టర్బైన్లు, జనరేటర్లు (ఫేజ్-2)2015లో ఉత్పత్తులు ప్రారంభించినా 2016 ఆఖరుకే మూతపడే స్థాయికి చేరింది.

సామర్థ్యం

ఏడాదికి 5వేల మెగావాట్లకు సమానమైన విద్యుత్తు పరికరాలు తయారు చేయడం

**వైఫల్యాలకు కారణం**

మార్కెట్లోకి వచ్చిన కొత్త కంపెనీలు. బాయిలర్లు, టర్బైన్లు, జనరేటర్లు (బీటీజీ) పరికరాల రంగంలో పోటీ.

ఆర్థిక పరిస్థితులు, పెట్టుబడి అవసరాలు మారడం. ఫేజ్-2 కొనసాగించకూడదని బోర్డు నిర్ణయించడం.

కొద్ది రోజులు చిన్న స్థాయిలో కోల్, యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల పరికరాలు ఉత్పత్తి చేసింది. ప్రస్తుతం అవీ మూత పడ్డాయి.

గ్లోబల్ వార్మింగ్ ప్రభావం నేపథ్యంలో దిగ్గజ సంస్థల అంచనాలన్నీ తలకిందులయ్యాయి. థర్మల్ పవర్ పరికరాల డిమాండ్ తగ్గటం, సోలార్, ప్రత్యామ్నాయ ఎనర్జీ వృద్ధి చెందడంతో ఈ ఉత్పత్తులకు మార్కెటింగ్ వసతి లేక మూతపడింది.

ఏపీ ప్రభుత్వం తీసుకుంటున్న తాజా చర్యలు

వినియోగంలో లేని భూమి: 2009లో కేటాయించిన 753.85 ఎకరాల్లో సుమారు 600 ఎకరాలు ఇప్పటి వరకు వినియోగంలో లేదు. ఈ భూమిని కొత్త పరిశ్రమల కోసం ఉపయోగించేందుకు ప్రయత్నం సాగుతోంది.

కేంద్రంతో సమన్వయం: ఇది సంయుక్త సంస్థ కాబట్టి కేంద్ర విద్యుత్తు మంత్రిత్వ శాఖతో సమన్వయం జరుగుతోంది. భూముల్ని తిరిగి పొందడానికి కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించనున్నారు.

వికల్ప పరిశ్రమల పరిశీలన: సౌరప్యానెల్, లిథియం-ఐయాన్ బ్యాటరీలు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తి పరిశ్రమల ఏర్పాటును పరిశీలిస్తున్నారు. పునరుత్పాదక శక్తి, అధునాతన ఉత్పత్తుల విభాగాలకు సరిపోయేలా ఉంటుంది.

కేంద్ర పథకాల ఉపయోగం: ఈ ప్రాజెక్టును ప్రొడక్షన్ లింక్‌డ్ ఇన్సెంటివ్ పథకంలో చేర్చడానికి ప్రతిపాదనలున్నాయి. తద్వారా ప్రైవేట్ పెట్టుబడుల ఆకర్షణ, ఫ్యాక్టరీల ఏర్పాటు, ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుంది.కంపెనీలు: ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఇక్కడ వ్యయం నిధులు, మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకువచ్చేలా దిగ్గజ సంస్థలు సన్నాహాలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

# మహిళల ఆర్థికాభివృద్ధికి.. 'షీ లీడ్స్ ఆంధ్ర'



చిత్తూరు: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల ఆదాయం ఇప్పటికీ అంతంతే. కొందరు చిన్న దుకాణాలు నిర్వహిస్తున్నా కుటుంబ పోషణకు అవి ఏ మాత్రం సరిపోవడం లేదు. ఈ పరిస్థితుల్లో మార్పు తేవాలని కృతనిశ్చయంతో ఉన్న సీఎం చంద్రబాబు.. తాను ప్రాతినిధ్యం వహిస్తోన్న కుప్పం నుంచే తొలి అడుగు వేశారు. పల్లెల్లో చిన్న దుకాణాలు నిర్వహించే మహిళల చేతికి సాంకేతిక అస్త్రాన్ని అందించి ఆదాయం పెంచుతున్నారు. సరకులకు సమీపంలోని కుప్పం వెళ్లే పరిస్థితి తప్పింది. రవాణా ఖర్చులు తగ్గాయి. రాష్ట్రంలో తొలిసారి పైలెట్ ప్రాజెక్టుగా 'షీ లీడ్స్ ఆంధ్ర' పేరిట ఈ మండలంలో ప్రారంభించారు.

శిక్షణ ఇచ్చి సహేలీలుగా.. 'ఫ్రంటియర్ మార్కెట్స్' అనే సంస్థ కుప్పం మండలంలోని 23 పంచాయతీల నుంచి పలువురు మహిళలను సహేలీలుగా ఎంపిక చేసింది. సహేలీ అంటే స్నేహితురాలు. వీరికి ఆన్‌లైన్‌లో ఆర్డర్లు ఎలా పెట్టాలి, ఎలా ట్రాక్ చేయాలి, వినియోగదారులను ఆకట్టుకునేలా దుకాణాల నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం మండలంలోని 69 దుకాణాలను గుర్తించారు. గ్రామీణ మహిళా వ్యాపారవేత్త (ఆర్‌డబ్ల్యూఈ)లను వీరికి అనుసంధానం చేశారు. 'మేరీ సహేలీ' అనే యాప్ ద్వారా సరకులు ఆర్డర్ చేస్తున్నారు. బయటి మార్కెట్‌తో పోలిస్తే రాయితీ ఎక్కువగా ఉండటం, రవాణా ఖర్చులు మిగలడంతో ఆదాయం పెరిగింది. ఇప్పటివరకు దాదాపు 12 లక్షల ఆర్డర్లు చేశారు. సహేలీలకు ప్రస్తుతం నెలకు రూ.20 వేల వరకు ఆదాయం వస్తోంది.

# తెలంగాణ లారీల్లోనే ఇసుక తరలింపు!

ఏలూరు: చింతలపూడికి సరఫరా అయిన 1.34 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక ఎక్కడ వినియోగించారు? ఏం చేశారు అనే కోణంలో విచారణ చేస్తున్నారు. ఇక్కడకు సరఫరా చేసిన లారీల చిరునామాలన్నీ తెలంగాణ రాష్ట్రానికి చెందినవిగా గుర్తించారు. ఇసుక మాత్రం స్థానికంగా ఉండే వారి ఆధార్, ఫోన్ నంబర్లతో సరఫరా అయినట్లు నిర్ధారించుకున్నారు. చింతలపూడి, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో లారీలు ఉన్నాయి. ఒకవేళ ఇక్కడి నుంచి కాకున్నా తూర్పుగోదావరి జిల్లా నుంచే అనేక లారీలు వచ్చి దింపివెళతాయి. ఇవి కాకుండా తెలంగాణ రాష్ట్రం నుంచి లారీలు తీసుకొచ్చి ఇక్కడ ఎవరు ఇసుక తోలించుకున్నారు అనే కోణంలో ఆరా తీస్తున్నామని గనులశాఖ వర్గాలు తెలిపాయి. ఇప్పటి వరకు తమ పరిశీలనలో అత్యధిక లారీలు తెలంగాణ రిజిస్ట్రేషన్ పేరుతో ఉన్నాయని వివరించారు. ఇసుక బుకింగ్ విషయం తెలియదని తమ పేరుతో ఎవరు బుక్‌చేశారో యంత్రాంగమే నిగ్గు తేల్చాలని సంబంధిత వ్యక్తులు కోరుతున్నారని వివరించారు.

దీన్నిబట్టి స్థానికుల ఆధార్ నంబర్లు, ఫోన్ నంబర్లు సేకరించుకుని



ఇసుక సరిహద్దులు దాటించేశారని స్పష్టమౌతోంది. ఒకవైపు రీజినల్ విజిలెన్స్ అధికారులు మరోవైపు జిల్లా స్థాయి ఇసుక కమిటీ(డీఎల్ఎస్‌సీ) ఆధ్వర్యంలో పరిశీలన చురుగ్గా సాగుతుందని త్వరలోనే నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని గనులశాఖవర్గాలు పేర్కొన్నాయి. కలెక్టర్ వెట్రి సెల్వి ఆదేశాల మేరకు చింతలపూడి తహసీల్దార్, జిల్లా గనులశాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా పలు బృందాలు ఏర్పాటు చేసి ఆయా గ్రామాలకు పంపి విచారణ చేస్తున్నామని అధికారవర్గాలు పేర్కొన్నాయి.

# అవే బిల్లులు.. సంస్థకు చిల్లులు!

ఏలూరు : ఆర్టీసీలో ఆర్థిక లావాదేవీలు పక్కాగా ఉంటాయి. రూపాయి తేడా వచ్చినా.. సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తప్పవు. ప్రతి విభాగంలో పక్కాగా తనిఖీ అధికారులు ఉండటం, ప్రతి లెక్కకు ఆడిట్ చేయడం పరిపాటి. తద్వారా నిధులు పక్కదారి పట్టే అవకాశం ఉండదు. ఇంతటి పకడ్బందీ వ్యవస్థ కలిగిన ఆర్టీసీలో ఎన్నడూ లేనివిధంగా పెద్ద మొత్తంలో సొమ్ము స్వాహా కావడం ఆందోళన కలిగిస్తోంది.

**అయిదేళ్లుగా నిర్వహణ..** ఏలూరు ఆర్టీసీ గ్యారేజీ ఆవరణలో సుమారు అయిదేళ్ల క్రితం ఐఓసీఎల్ పెట్రోలు బంకు ఏర్పాటు చేశారు. దీని నిర్వహణను ఆర్టీసీ అధికారులే పర్యవేక్షిస్తున్నారు. పెట్రోలు, డీజిల్ విక్రయాల బిల్లులను క్రమం తప్పకుండా ఆడిట్ చేస్తుంటారు. అయినా కొందరు సిబ్బంది అధికారుల కళ్లుగప్పి మాయాజాలం చేసేశారు. ఒకసారి సమర్పించిన బిల్లులే మళ్లీ మళ్లీ అందజేసి అక్రమాలకు పాల్పడ్డారు. విషయం అధికారుల దృష్టికి రావడంతో.. ఆర్టీసీ పెట్రోలు బంకు నిధుల వినియోగంపై విచారణకు కమిటీని నియమించారు. ఆర్టీసీ విజయవాడ జోన్ ఈడీ విజయరత్నం ఏలూరొచ్చి విచారిస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు అత్యంత గోప్యంగా ఉంచడం గమనార్హం.

**సూత్రధారి ఆయనేనా..** ఆర్టీసీ బంకుకు సంబంధించి సుమారు రూ.69 లక్షలు పక్కదారి పట్టినట్లు సమాచారం. బంకులో ఏళ్లుగా పని చేస్తున్న సాంకేతిక ఏడీసీ ఒకరు ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. ఆర్టీసీ గ్యారేజీ ఆవరణలోని సంస్థకు చెందిన బంకు తరచూ మొరాయిస్తోంది. ఆ సమయంలో గ్యారేజీ బయట ఉన్న ఐవోసీఎల్ బంకులో బస్సులకు డీజిల్ పోయిస్తుంటారు. దీన్ని అవకాశంగా తీసుకుని కొందరు అవకతవకలకు పాల్పడినట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారంలో కేవలం ఒక ఉద్యోగే ఉన్నారా? ఇతర అధికారులు లేదా సిబ్బంది ఉన్నారా? అన్న కోణంలోనూ విచారణ సాగుతోంది. 'ఆర్టీసీ బంకులో నిధుల దుర్వినియోగంపై విచారణ కొనసాగుతోంది. నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటాం' అని ఆర్టీసీ డీపీటీవో షేక్ షబ్నం తెలిపారు.

# శవాగారంలో ప్రైవేటు దందా

భీమవరం : భీమవరం ప్రాంతీయ ఆసుపత్రిలో శవాలను భద్రపరచాలంటే జేబుకు చిల్లులు పడుతున్నాయి. కుటుంబ సభ్యుల్ని కోల్పోయి బాధలో ఉన్న వారికి శవాగారం వద్ద ఎదురవుతోన్న పరిస్థితులు దయనీయంగా ఉంటున్నాయి. శవపంచనామా ఎంత తొందరగా పూర్తయితే అంత మిగులుతుందని వారు కోరుతున్నారు.

అంతా మాయాజాలం.. భీమవరం ప్రాంతీయ ఆసుపత్రిలోని శవాగారానికి ఉండి, పాలకోడేరు, ఆకివీడు, కాళ్ల, వీరవాసరం, భీమవరం, మొగల్తూరు మండలాలతో పాటు కృష్ణా జిల్లాలోని పలు మండలాల నుంచి మృతదేహాలను తీసుకొస్తారు. ఇక్కడ నెలలో 45కుపైగా శవ పరీక్షలు చేస్తారు. వైకాపా పాలనలో శవాల భద్రత గాలికొదిలేయడంతో



ప్రైవేటు వ్యక్తుల హవా కొనసాగింది. మృతదేహాన్ని ఒకరోజు ఫ్రీజర్‌లో ఉంచాలంటే రూ.3,500 తీసుకుంటున్నారు. ఈ ఆర్థిక భారం తట్టుకోలేకపోతున్నారనే విషయం ఎమ్మెల్యే రామాంజనేయులు దృష్టికి కొందరు తీసుకెళ్లగా రెండు మృతదేహాలను భద్రపరిచే ఫ్రీజర్ సమకూర్చారు. దాన్ని ఎప్పుడూ గదిలోనే ఉంచుతున్నారు. పాడైపోయిందని, అందులో శీతలీకరణ లేదని చెబుతూ ప్రైవేటు ఫ్రీజర్లపైనే ఆధారపడుతున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు దందాకు అంతులేకుండా పోతోందని బాధితులు వాపోతున్నారు. శవాగారం ఆవరణలోనే ప్రైవేటు ఫ్రీజర్లు ఉంచి దందా చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేరని వాపోతున్నారు. అధికారులు దృష్టిసారించి కడచూపులో ఖర్చుల భారం లేకుండా చూడాలని వేడుకుంటున్నారు.

# ఒక మొక్క బతికుంటే ఒట్టు!



గుత్తి: జిల్లాలో గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి పట్టణాల్లో గత ప్రభుత్వ హయాంలో సుందరీకరణ, జగనన్న పచ్చతోరణం పేరుతో భారీగా నిధులు దోచేశారు. వందల్లో మొక్కలు నాటి వేలల్లో లెక్కలు చూసి బిల్లులు చేసుకున్నారు. ప్రస్తుతం ఆయా పట్టణాల్లో ఎక్కడా అప్పట్లో నాటి మొక్కల ఆనవాళ్లు కూడా లేకుండాపోయాయి.

**రూ.లక్షల్లో ..** ప్రధాన కూడళ్లల్లో అధికారులు కళాకారులతో జిల్లాలోని చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతాలు, దేశనాయకుల చిత్రాలను వేయించారు. గుత్తి పురపాలికలోనే ఏకంగా రూ.4 లక్షలు ఖర్చు చేసి చిత్రాలు గీయించారు. స్థానిక మన్రోసత్రం గోడలకు పట్టుకేశవపిళ్లై, సర్ థామస్‌మన్రో, కృష్ణదేవరాయలు, లేపాక్షి, తిమ్మమ్మ మర్రిమాను తదితర చిత్రాలు వేశారు. ఆ చిత్రాలతోపాటు ఈత చెట్లను పెంచారు. ఇప్పుడా వన్నె చిత్రాలు మసకబారాయి. ఆయా పనుల్లో కమీషన్లు దండుకున్నా రన్న ఆరోపణలు ఉన్నాయి. గుత్తి–అనంతపురం రోడ్డులో విభాగినుల మధ్య మొక్కలు నాటారు. ఇప్పుడు అవేవీ లేవు. తాజాగా మళ్లీ రూ.21 లక్షలతో మొక్కలు నాటేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో వైకాపా పురపాలిక అధ్యక్షుల వార్డుల్లో మాత్రమే గుంతలు తీయించి మొక్కలు నాటి మమ అనిపించారు. ఎక్కడా నాటి మొక్క ఎదిగేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రూ.లక్షలు గుంతల పాలయ్యాయి. సందరీకరణ లో భాగంగానే గుత్తి నుంచి గుత్తిఆర్.ఎస్.వరకు రూ.40 లక్షలతో మూడు కి.మీ.ల మేర హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేయించారు. వీటి నిర్వహణ సరిగా లేదు.

**పచ్చదనాన్ని సంరక్షిస్తాం..జబ్బార్‌మియా, కమిషనర్, గుత్తి**

పచ్చదనాన్ని సంరక్షిస్తాం. గతంలో జరిగిన మొక్కల పెంపకం, సుందరీకరణ పనులు విషయం నాకు తెలీదు. గుత్తిలో విభాగినులను విస్తరించి వాటిలో మొక్కలు నాటుతాం. ఇప్పటికే మొక్కల పెంపకానికి రూ.21లక్షలతో పనులు మంజూరయ్యాయి. 15వ ఆర్థిక సంఘం నిధులతో టెండర్లు నిర్వహించి పనులను గుత్తేదారుడికి ఇచ్చాం. త్వరలోనే పనులు చేపడతాం.

## మూగజీవాలకో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి

తిరుపతి : ఫిజియోథెరపీ.. సంతాన సాఫల్య కేంద్రం.. రక్తపరీక్షలు.. ఎక్స్‌రేలు.. ఈసీజీ.. స్కానింగ్.. కార్డియాలజీ.. ఇలాంటి పరీక్షలన్నీ సాధారణంగా మనుషులకు చేస్తుంటారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశువైద్య వర్సిటీలో ఇవన్నీ పెంపుడు జంతువులు, పశువులు, ఇతర జీవాలకూ చేస్తున్నారు. మూగజీవాలకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందుతాయని తెలుసా.. అత్యాధునిక ఆపరేషన్లూ చేస్తారు. రైతులకు సేవలు ఉచితం... రైతులకు చెందిన పశువులు, గేదెలు, మేకలకు అందించే సేవలు, మందులు ఉచితం. ఎన్‌సీసీ గుర్రాలు, ఎస్వీ జూపార్కులోని పులులు, సింహాలు, పక్షులకు ఉచిత



సేవలు ఉంటాయి.

**ప్రత్యేకతలు**

ఓపీ: రోజుకు 150

వార్డులు: 06 (పెంపుడు, పెద్ద జంతువులకు వేర్వేరుగా)

శస్త్రచికిత్సలు: రోజుకు సుమారు 7

పెంపుడు జంతువులకు ఓపీ రుసుము: రూ.50

రక్తపరీక్షలు, ఎక్స్‌రే, శస్త్ర చికిత్సలు, ఇతర పరీక్షలకు: రూ.200 నుంచి రూ.1000 వరకు

**అందే సేవలు..** కంప్యూటరైజ్డ్ ఈసీజీ, కార్డియోగ్రఫీ, రేడియోగ్రఫీ, హిమో డయాలసిస్, అల్ట్రా సౌండ్ స్కానింగ్, ఎక్స్‌రే. శునకాలకు గుండె సంబంధిత వ్యాధుల నిర్ధరణ, చికిత్సలు, విరిగిన ఎముకలకు శస్త్రచికిత్సలు. గుండె సంబంధిత వ్యాధులు, జీర్ణకోశ, గర్భకోశ, కాలేయ, కంటి జబ్బుల చికిత్సలు.కండరాల నొప్పుల నివారణకు ఫిజియోథెరపీ సేవలు. మూగజీవాలకు ఇన్‌పేషెంట్ సౌకర్యం, యజమానులకు వసతి సదుపాయం ఉంది. దేశవాళీ పశువుల ఉత్పత్తికి సంతాన సాఫల్యం కేంద్రం.

## ప్రధాని రాక.. పనుల్లో కదలిక

శ్రీశైలం శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ఈనెల 16న ప్రధానమంత్రి నరేంద్రమోదీ వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. సున్నిపెంటలో హెలిప్యాడ్లు సిద్ధం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ ఇంజినీర్ల ఆధ్వర్యంలో పనులు వేగంగా జరుగుతున్నాయి.

మల్లికార్జున సదన్ తూర్పు వైపు తారు రోడ్డు నిర్మిస్తున్నారు. మల్లికార్జున సదన్ ఎదురు నుంచి గంగా సదన్, సాయిబాలాజీ హొటల్ వరకు రహదారి పక్కన పెద్దఎత్తున మొక్కలు నాటారు. టోల్‌గేటు వద్ద నుంచి మల్లికార్జున సదన్ మీదుగా గంగా సదన్, నంది సర్కిల్ మార్గంలో ప్రధాని రానుండడంతో అక్కడ పచ్చదనానికి ప్రాధాన్యమిచ్చారు. అమ్మవారి ఆలయ మెట్ల పక్కన, రథశాల వర్టికల్ గార్డెన్లు ఏర్పాటు చేస్తున్నారు. వర్టికల్ గార్డెన్లలో త్రిశూలం, ఓంకారం ఆకారాలు ఆకట్టుకునేలా, చుట్టూ పచ్చదనం మొక్కలతో తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టారు.



**నూతన క్యూలైన్ల ఏర్పాటు**

స్వామి, అమ్మవార్ల ఆలయ ప్రాంగణాల్లో ఇనుప క్యూలైన్లను తొలగించి నూతన క్యూలైన్ పనులు చేపట్టారు. ఆలయం వెనుక భాగం ఏనుగుచెర్వు కట్ట వద్ద పచ్చదనంతో కూడిన లాన్ ఏర్పాటు చేశారు. అన్ని ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టారు. ఆలయ అధికారులు నిత్యం పనులను పర్యవేక్షిస్తున్నారు.


**కట్టుదిట్టమైన భద్రత**

డీజీపీతోపాటు ఇంటెలిజెన్స్ డీజీ శ్రీశైలానికి వస్తున్నట్లు తెలుస్తోంది. సీఆర్‌పీఎఫ్, ఎన్‌ఎస్‌జీతోపాటు కేంద్ర ఇంటెలిజెన్స్ అధికారులు సైతం ముందస్తుగా శ్రీగిరికి చేరుకొని భద్రత కట్టుదిట్టం చేయనున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొలిసారిగా వస్తుండడం తో శ్రీశైలం చుట్టూ భద్రత పకడ్బందీగా ఏర్పాటు చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి.

## స్మార్ట్‌కార్డులు ఇప్పుడివ్వలేం


కర్నూలు : అక్టోబరు 1 నుంచి 15వ తేదీ వరకు చౌక దుకాణాల్లో రేషన్ సరకులతో పాటు స్మార్ట్ కార్డులను పంపిణీ చేయాలని జిల్లా యంత్రాంగం డీలర్లను ఆదేశించింది. చౌక దుకాణాల్లో డీలర్లు పంపిణీ చేయగా.. మిగిలిపోయిన కార్డులను ఈనెల 16 నుంచి సచివాలయాల్లో పంపిణీ చేయాలని జిల్లా పాలనాధికారులు ఆదేశించారు. క్షేత్రస్థాయిలో డీలర్లు కార్డుదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేయడం లేదు. సచివాలయాల్లో కార్డులు అందుబాటులో లేవు. జిల్లా యంత్రాంగం ఆదేశాలను డీలర్లు బేఖాతరు చేస్తున్నారు. ముందు రేషన్ సరకులు తీసుకెళ్లండి..ఆ తర్వాత కొత్త కార్డులను పంపిణీ చేస్తామని చెప్పి పంపుతున్నారు.

**ప్రహసనంగా పంపిణీ**




ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,437 చౌక దుకాణాలుండగా.. వాటి పరిధిలో 12 లక్షలకు పైగా కార్డుదారులు ఉన్నారు. ఇంకా కర్నూలు జిల్లాలో 3,47,550 (51.96 శాతం), నంద్యాలలో 4,34,934 (81.67 శాతం) ఇవ్వాల్సి ఉంది. రేషన్ సరకులతో పాటు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయాలంటే కష్టంగా ఉందని, ఒకే వ్యక్తి రెండు పనులు ఎలా చేయగలరని డీలర్లు ప్రశ్నిస్తున్నారు. ప్రతినెలా ఒకటో తేదీన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు క్లస్టర్ల వారీగా పింఛన్లను పంపిణీ చేయిస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో 99 శాతం వరకు సొమ్ము పంచేస్తున్నారు. ఇదే తరహాలో సచివాలయ ఉద్యోగులందరి చేత క్లస్టర్ల వారీగా స్మార్ట్‌కార్డులను పంపిణీ చేయిస్తే మూడు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# దుర్గంలో కబ్జాపర్వం



రాయదుర్గం: మున్సిపాల్టీలో ఒక ఎకరాలో లేఅవుట్ వేయాలంటే 10 శాతం స్థలాన్ని ప్రజాప్రయోజనాలకు వదలాలి. సదరు స్థలాల్లో పాఠశాల, కమ్యూనిటీ భవనాలు, పార్కులు, ఆధ్యాత్మిక కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. అవి కబ్జాకు గురైతే సామాజిక అవసరాలకు ఇబ్బందులు ఎదురవుతాయి.రాయదుర్గంలో అధికారికంగా వేసిన 29 లే అవుట్లలో సామాజిక అవసరాలకు స్థలాలు వదిలినా.. కనుమరుగు అవుతున్నాయి. యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నా పట్టించుకునేవారే కరవయ్యారు.

రాయదుర్గం పట్టణం పరిధిలో సామాజిక స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. ద్వితీయ శ్రేణిస్థాయి నాయకులతోపాటు వారి అనుచరులు రూ.లక్షలు విలువ చేసే స్థలాలను ఆక్రమించి.. నిర్మాణాలు చేపట్టి.. విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతుల్లేకుండా నిర్మాణాలు సాగిస్తూ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పైగా కొందరు మున్సిపల్ సిబ్బంది లంచం తీసుకుని సదరు నిర్మాణాలకు రహదారులు, కాలువల సౌకర్యం కల్పిస్తుండటం గమనార్హం.

**సర్కారువీ వదల్లేదు..**గతంలో పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం వేసిన 11 ఇందిరమ్మ, జగనన్న లేఅవుట్లలో సామాజిక స్థలాలు వదిలారు. అవి సైతం ఆక్రమణకు గురవుతున్నాయి. వాటిని రెవెన్యూ శాఖ అప్పగించలేదని చెప్పి మున్సిపల్ అధికారులు తప్పించుకుంటున్నారు. ఇళ్ల నిర్మాణాలు అయ్యాయంటే సదరు స్థలాలు మున్సిపాల్టీ పరిధిలోకి వెళ్లినట్లేనని రెవెన్యూ అధికారులు అంటున్నారు. దీంతో అక్రమార్కులకు అడ్డు చెప్పేవారే లేకుండా పోయారు. నర్సోజికుంట, వేంకటేశ్వరమాన్యం, శాంతినగర్, డ్రైవర్స్ కాలనీల్లో సామాజిక స్థలాలు ఎక్కువ శాతం కనుమరుగవగా.. కొన్నింటికి మాత్రమే కంచెలు వేశారు.

**తొలగింపునకు చర్యలు తీసుకుంటాం**

మురళీమోహన్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి, రాయదుర్గం

సామాజిక స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. బాధ్యులకు నోటీసులు ఇస్తాం. రెవెన్యూ, మున్సిపల్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సర్వే చేసి.. స్థలాలు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుంటాం.

# నిధులు రాక.. నిర్మాణాలు సాగక



ధర్మవరం : శ్రీసత్యసాయి జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు సరైన భవనాలు లేక చిన్నారులు ఇరుకు గదుల్లో అల్లాడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వం నాడు–నేడు పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసినా.. సకాలంలో నిధులు విడుదల చేయలేదు. ఫలితంగా నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. అందులో కంపచెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి పక్షిగూళ్లకు నిలయాలుగా మారుతున్నాయి. సొంత భవనాలు లేక ఉన్నవి నిర్మాణం పూర్తికాక పోవడంతో చిన్నారులు పడుతున్న ఆగచాట్లు అన్నిఇన్నీ కావు. పూర్వ ప్రాథమిక విద్య (నర్సరీ)ను నేర్చుకోవాల్సిన చిన్నారులు సొంత భవనాలు లేక అద్దె వాటిలోనే నరకయాతన అనుభవిస్తున్నారు.

**ఆర్భాటంగా ప్రారంభించి..**

గ్రామాల్లో రెండు, మూడు ఆపైన ఉన్న కేంద్రాలను విలీనం చేసి అందరిని ఒక్కచోట చేర్చాలనే లక్ష్యంతో నాడు–నేడు పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలను ప్రారంభించారు. ఈ పనులను స్థానికంగా ఉన్న ఐసీడీఎస్ సిబ్బంది పర్యవేక్షణలో పంచాయతీరాజ్ శాఖకు అప్పజెప్పింది. అధికారులు ఆర్భాటంగా పనులు ప్రారంభించారు. బిల్లులు ఏ విధంగా మంజూరు చేశారో.. వాటి ఆధారంగా పనులు చేపట్టారు. అయితే పూర్తిస్థాయిలో బిల్లులు జమ చేయకపోవడంతో అధికారులు పనులు ఆపేశారు. కూటమి ప్రభుత్వం స్పందించి భవనాలకు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని చిన్నారుల తల్లితండ్రులు కోరుతున్నారు.

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు : 2,824

సొంత భవనాలు : 1,015

అద్దెకు తీసుకున్నవి : 1,266

అద్దె లేనివి : 543

నిధులు లేక ఆగినవి : 117

ఆరు నెలల నుంచి 3 సంవత్సరాలలోపు చిన్నారులు : 47,136

3–6 సంవత్సరాల వారు : 38,093

బాలింతలు : 8,483

గర్భిణులు : 9,797

**ప్రతిపాదనలు పంపాం**

అంగన్‌వాడీ కేంద్రాల ప్రస్తుత పరిస్థితులపై పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేశాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేస్తాం.

ప్రమీల, ఐసీడీఎస్ పీడీ

# మీ నిర్లక్ష్యంతో బిడ్డ ప్రాణం పోయింది?

అనంతపురం : 'పని చేయమంటే.. గొడవ పడతారా? ఏం తమాషా చేస్తున్నారా? అందరినీ ఇంటికి పంపిస్తా... మీ నిర్లక్ష్యం.. నిర్వాకం మూలంగా ఓ బిడ్డ ప్రాణం పోయింది' అని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సంచాలకుడు వేణుగోపాల్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. శిశు గృహలో 32 రోజుల మగ బిడ్డ మృతి ఘటనా నేపథ్యంలో ఆయన అనంతకు చేరుకున్నారు. సహాయ కలెక్టర్ సచిన్ రహార్, ఐసీడీఎస్ పీడీ నాగమణితో కలిసి శిశుగృహాన్ని పరిశీలించారు. అక్కడే సిబ్బందితో దాదాపు మూడు గంటలపాటు సుదీర్ఘంగా విచారించారు.మేనేజర్ దీప్తి, సోషల్ వర్కర్ లక్ష్మీదేవి, సహాయకులతో బిడ్డ మృతి ఘటనను ఆరా తీశారు. 'శిశువును శిశుగృహానికి తీసుకొచ్చినపుడు 1.7 కిలోల బరువు ఉంది. నెల రోజుల్లో 2.75 కిలోలకు పెరిగిందని సిబ్బంది వివరించారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడు బిడ్డ ఎలా చనిపోయిందని ప్రశ్నించగా, సిబ్బంది నుంచి సమాధానం రాలేదు. ఒకానొక దశలో స్వయాన డైరెక్టర్ సమక్షంలోనే సిబ్బంది వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. శిశుగృహ పర్యవేక్షణ విషయంలో పీడీ తీరుపైనా అసంతృప్తి వ్యక్తం చేశారు. 'మిషన్ శక్తి సమన్వయకర్తగా నియమిస్తే.. ఇదేనా మీ నిర్వాకం. పనితీరు' అంటూ అక్కడే ఉన్న బీఎన్ శ్రీదేవిపైనా మండిపడినట్లు తెలిసింది. ఐసీడీఎస్ అనుబంధ సమగ్ర బాలల పరిరక్షణ సమితి(ఐసీపీఎస్) డీసీపీఓ మంజునాథ్, పీఓలు, ఇతర సిబ్బంది పనితీరు ఏమాత్రం బాగోలేదన్నారు. జువెనైల్ చట్టం ప్రకారం బిడ్డ మృతి చెందితే పంచనామా చేయాలని తెలీయదా అని ప్రశ్నించారు. స్థానిక పోలీసు, రెవెన్యూ అధికారులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని కటువుగా అడిగారు.

**సీఎం ఫోన్?** శిశుగృహలో సిబ్బందిని విచారిస్తున్న సమయంలో స్వయంగా సీఎం చంద్రబాబు డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి ఫోన్ చేసినట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో బాధ్యులపై చర్యలు ఉంటాయని డైరెక్టర్ తెలిపారు.

## 'బెంగ'ళూరు జాతీయదారి

కల్లూరు : వెల్దుర్తి నుంచి కర్నూలుకు గతంలో 40 నిమిషాలు పట్టేది.. ప్రస్తుతం 1.30 గంటలకుపైగానే పడుతోంది.. డోన్ నుంచి కర్నూలు వెళ్లేందుకు రెండు గంటలు పడుతోంది. ఇదెక్కడో మారుమూల రోడ్డు కాదండోయ్.!! 100 కి.మీ. వేగంతో వెళ్లేలా నిర్మించిన హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారిపై ప్రయాణం.!! ఉమ్మడి జిల్లాలో 75 కి.మీ. మేర విస్తరించి ఉన్న 44వ నంబరు జాతీయ రహదారిపై నిలువెల్లా గుంతలు నెలకొన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు అడుగుకో గుంత నెలకొంది. వాటిని దాటలేక వాహనదారులు అవస్థలు పడుతున్న వైనం బృందం పరిశీలనలో తేలింది.

**లేయర్ మరచి.. ప్యాచ్‌లతో సరిపెట్టి**

ప్రతి 50 కి.మీ. ఒక టోల్‌గేటు ఏర్పాటుచేశారు. అమకతాడు టోల్‌ప్లాజా పరిధిలో నిత్యం 10 వేల వాహనాలు తిరుగుతాయి. నిత్యం రూ.30 లక్షల ఆదాయం వస్తుంది.

నిర్వహణదారులు వాహనచోదకుల నుంచి టోల్ వసూలు చేస్తున్నారు. అందుకు తగ్గట్టు సేవలు అందించడం లేదు.

నిత్యం రహదారిని పరిశీలించి దెబ్బతిన్న ప్రాంతంలో ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాల్సి ఉంది. ఇవేవీ పట్టించుకోవడం లేదు.

నిబంధనల ప్రకారం 2017లో కొత్త లేయర్ వేయాల్సి ఉంది. ఎనిమిదేళ్లు దాటినా ఇప్పటికీ చేపట్టలేదు. దెబ్బతిన్న ప్రాంతాల్లో తారు పూసి వదిలేస్తున్నారు. వర్షం పడినప్పుడల్లా ఇదే సమస్య ఎదురవుతోంది.

**అదుపు తప్పుతున్న వాహనాలు**



ఇటీవల కురిసిన వర్షాలకు ఈ మార్గం పూర్తిగా దెబ్బతింది. అడుగడుగునా గుంతలు పడటంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి.వేగంగా వచ్చే వాహనదారులు గుంతలు తప్పించే క్రమంలో అదుపు తప్పి ప్రమాదాలబారిన పడుతున్నారు. మరికొందరు ఉన్నఫళంగా బ్రేకులు వేయడంతో వెనక వేగంగా వస్తున్న వాహనాలు ఢీకొంటున్నాయి. వెల్దుర్తి సమీపంలోని జాతీయ రహదారిపై 20 రోజుల కిందట ముందు వెళుతున్న ఓ లారీ చోదకుడు ఉన్నట్లుండి బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న ప్రైవేటు బస్సు వేగాన్ని అదుపు చేయలేక లారీని ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు.

**నిర్వహణ దారిణం**

డోన్ నుంచి కర్నూలు వైపు వచ్చే దారిలో 74 గుంతలు ఉన్నాయి. గుత్తిరోడ్డు పైవంతెన నుంచి ఉలిందకొండ వరకు తారు లేచి రోడ్డు అధ్వానంగా మారింది.వెల్దుర్తి నుంచి మదార్‌పురం మధ్య కేవలం 5 కి.మీ. పరిధిలోనే 70 వరకు గుంతలు ఉన్నాయి. మదార్‌పురం ఉపరితల వంతెనపై పెద్దపాటి గుంతలు వాహనదారులకు ఇబ్బందికరంగా మారాయి. మంగంపల్లి స్టేజీ సమీపంలో ఏకంగా 120 వరకు గుంతలు ఉన్నాయి.డోన్ మండల పరిధిలో 33 కి.మీ. మేర అడుగుకో గుంత ఉంది.. జగదుర్తి, అమకతాడు, యు.కొత్తపల్లె వద్ద రహదారికి గుంతలు పడటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

ప్యాపిలి చెక్‌పోస్ట్ నుంచి అరుణాచలం ట్రాన్స్‌పోర్ట్ వరకు 1 కి.మీ. ఉంటుంది.. ఇక్కడ 65 గుంతలు ఉన్నాయి. ఏనుగుమర్రి గ్రామ సమీపంలో కి.మీ. మేర కనీసం ద్విచక్రవాహనం వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

## ప్రయోగం దూరం.. ఫలితాలపై ప్రభావం

కర్నూలు : ఇంటర్మీడియట్ పరీక్షల తేదీలు ఖరారయ్యాయి.. అంతకు నెలరోజుల ముందు ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నారు..ఇప్పటికీ చాలా కళాశాలల్లో ప్రయోగ పాఠాలే ప్రారంభించలేదు.. ప్రభుత్వ కళాశాలల్లోని అవసరమైన పరికరాలు లేకపోవడంతో నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఇంటర్ బోర్డు అధికారులు రెండేళ్ల కిందటే గుర్తించారు. ప్రైవేటు కళాశాలల్లో వీటి గురించే పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రయోగాలపై దృష్టిపెట్టి విద్యార్థులను సన్నద్ధం చేయాల్సి ఉంది.

**ఒక్కొక్కరి నుంచి రూ.275 వసూలు**2025– 26 విద్యా సంవత్సరానికి కర్నూలు జిల్లాలో మొదటి ఏడాది 22,886, రెండో ఏడాది 22,284 మంది విద్యార్థులు చదువుతున్నారు. ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు ఒక్కొక్కరి నుంచి పబ్లిక్ ప్రాక్టికల్స్ నిర్వహణ నిమిత్తం రూ.275 రుసుము వసూలు చేశారు. ఈ సొమ్ముతో నిర్వహించే రోజు విద్యార్థులకు వసతులు కల్పించాలి.

**పనికిరాకుండా మార్చేశారు**

కోసిగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 552 మంది విద్యార్థులున్నారు. ఒకటో గదిని జంతు, వృక్ష శాస్త్ర ల్యాబ్‌గా, రెండో గదిలో భౌతిక, రసాయన శాస్త్ర ల్యాబ్‌గా ఏర్పాటు చేశారు. ప్రయోగశాలలో పుస్తకాలు, బెంచీలు, బియ్యం బస్తాలు, చిక్కీలు, వంట సామగ్రి ఉంచడంతో ల్యాబ్ అంతా చెత్తగా మారింది. పరికరాలు విరిగి, పగిలి పాడైపోయాయి. విద్యార్థులకు ప్రయోగపాఠం కరవైంది.



**ఇక్కడ మరీ దారుణం**

సంజామల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు పదుల సంఖ్యలో మాత్రమే ఉండటంతో ఈ విద్యా సంవత్సరం నుంచి అతిథి అధ్యాపకులతో బోధన సాగిస్తున్నారు. భవిష్యత్తులో ఈ కళాశాలను మూసివేసే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ఓర్వకల్లు, సంజామల, అవుకు, బనగానపల్లి, గోనెగండ్ల, పత్తికొండలోని ప్రయోగశాలల్లో పూర్తిస్థాయిలో వసతులు లేకపోవడం గమనార్హం.

**ప్రైవేటులో ఇష్టారాజ్యం**ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ప్రయోగశాలలు ఉన్నాయా లేవా అని తనిఖీ చేయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రైవేటు కళాశాలల నిర్వాహకులు రూ.500 వసూలు చేస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

**వీటిపై దృష్టి ఏదీ**

ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. వీరు ప్రాక్టికల్స్ తరగతుల కోసం సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఆశ్రయించాల్సి వస్తోంది.

# పార్శిల్ సేవల్లో ఆర్టీసీ వేగం

చిత్తూరు: ఆర్టీసీలోని కార్గో సేవలు రోజు రోజుకు పుంజుకుంటున్నాయి. పార్శిల్ సేవలను ప్రజలకు చేరువ చేస్తూ అంతకంతకు ఆదాయాన్ని ఆర్జిస్తోంది. లాజిస్టిక్ విభాగంలోనూ పైచేయిగానే నిలుస్తోంది. ఒకేసారి 10 నుంచి 12 టన్నుల సరకును నిర్దేశించిన సమయం లోపు చేరవేస్తూ.. ప్రజల్లో నమ్మకాన్ని సంపాదిస్తోంది. 2017లో ప్రారంభమైన కార్గో సేవలు మొదటి రోజూ రూ.10 వేల ఆదాయంతో అడుగులు పెట్టి.. ప్రస్తుత రోజుకు రూ.1.50 లక్షలు సమకూరుస్తోంది. సింగా సొల్యూషన్స్ ప్రైవేటు సంస్థ ఏజెన్సీల ద్వారా పార్శిల్ బుకింగ్ సేవలు నిర్వహిస్తూ.. వాటికి కమిషన్ చెల్లిస్తోంది. ముందుముందు పార్శిల్ సేవలతో పాటు డోర్ డెలివరీలను మరింత పెంచే దిశగా ఆర్టీసీ అడుగులు వేస్తోంది.

**నెలకు రూ.42 లక్షల ఆదాయం..**

చిత్తూరు ఒకటి, రెండో డిపో, పలమనేరు, కుప్పం, పుంగనూరు డిపోలతో పాటు వి.కోట బస్టాండులో కూడా పార్శిల్ సేవలు అందుబా



టులో ఉన్నాయి. ఈ డిపోల పరిధిలో రోజుకు కనీసం 650 పార్శిళ్లు బుక్ అవుతుండగా.. వాటి ద్వారా నెలకు రూ.42 లక్షలకు పైగానే ఆదాయం సమకూరుతోంది.

80 ప్రాంతాల్లో..చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకు ఆర్టీసీ కార్గో సేవలు అందుతున్నాయి. రాష్ట్రంలోని 80 ప్రాంతాల్లో ఉన్న డిపోలకు 10 కి.మీ దూరం వరకు డోర్ డెలివరీలు ఉంటున్నాయి. జిల్లా నుంచి బంతి, చామంతి, బెల్లం, ప్లాస్టిక్, పన్నీరు, కోవా తదితర సరకులు ఎగుమతి అవుతున్నాయి. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సైతం కార్గో సేవలు అందడం విశేషం.

# శిశువిలాపం

కర్నూలు : నవజాత శిశు సంరక్షణ కేంద్రాలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. వివిధ స్థాయిల్లో వైద్య సేవలందించేందుకు ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ఎస్ఎన్‌సీయూ (స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్)లు ఏర్పాటు చేశారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, సున్నిపెంట, ఆత్మకూరు, వెలుగోడు మండల కేంద్రాల్లోని ఆసుపత్రుల్లో కేంద్రాలు ఉన్నాయి. నవజాత శిశువుల్లో ఏవైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే ఈ కేంద్రాల్లో ఉంచి సంరక్షిస్తారు. పుట్టిన పిల్లలు ఏడవకపోవడం, తక్కువ బరువుతో జన్మించడం.. 35 వారాలు నిండకుండా ప్రసవం కావడం, ఫిట్స్ వచ్చే శిశువులు, ఉమ్మనీరు మింగినవారు, శ్వాస సంబంధిత సమస్యలున్న శిశువులకు కేంద్రాల్లో వైద్య సేవలందిస్తారు..

**ప్రైవేటు బిల్లు.. గుండె గుబేలు**

ఎస్ఎన్‌సీయూ సేవలు అత్యంత ఖరీదైనవి. వివిధ సమస్యలతో బాధపడుతున్న పిల్లలను వార్మర్‌పై ఉంచి తల్లి గర్భంలోని వాతావరణం ఉండేలా చేస్తారు. ఒక శిశువును ప్రైవేటుగా ఉంచాలంటే.. ఆస్పత్రి స్థాయిని బట్టి రూ.2 నుంచి 8 వేల వరకు వసూలు చేస్తారు. వైద్య సేవలను బట్టి బిల్లులుంటాయి. మూడు నాలుగు రోజులుంటే.. రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు చేయాల్సిందే. అప్పుడే పుట్టిన పిల్లల్లో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటంతో ఇన్‌ఫెక్షన్లు వేగంగా సోకే ప్రమాదం ప్రమాదముంటుంది.

**ఎక్కడ.. ఎలా ఉందంటే..**

ఆదోని ప్రభుత్వ మాతా, శిశు ఆస్పత్రిలో 2022లో భవ్య ఏజెన్సీ నిర్వహణలో ఎస్ఎన్‌సీయూ సేవలు పీపీపీ విధానంలో ప్రారంభమయ్యాయి. పది పడకలు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ప్రతి నెలా జనన నమోదు 120–130 వరకు ఉంటుంది. పది పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. రెండు కాన్సన్‌ట్రేటర్లు మరమ్మతులకు గురయ్యాయి. ఆక్సిజన్ ప్లాంట్ పనిచేయ నాలుగేళ్లు దాటింది. ఆక్సిజన్ సిలిండర్లు కొనుగోలు చేసి సేవలందిస్తున్నారు. ఇంత పెద్ద కేంద్రం ఏర్పాటుచేసినప్పటికీ అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన శిశువులను నెలలో కనీసం 10–15 మందిని కర్నూలుకు రెఫర్ చేస్తున్నారు.

కర్నూలు జీజీహెచ్‌లో 60 పడకలు ఏర్పాటు చేశారు. ఇందులో 12 వెంటిలేటర్లకు గాను ఆరు మాత్రమే పనిచేస్తున్నాయి. ఎనిమిది మంది వైద్యులు, 25 మంది సిబ్బంది ఉన్నారు. రోజు 30 ఐపీ, నెలకు వెయ్యి మంది వైద్య సేవలు పొందుతున్నారు. ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని కేంద్రాన్ని పబ్లిక్, ప్రైవేటు పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# ఆదాయ గని.. తవ్వేదెవరని!

చీపురుపల్లి: ఉమ్మడి జిల్లాలో సీనరేజ్ వసూలు బాధ్యత 2023లో రెండేళ్ల కాలానికి ఓ కంపెనీకి గత ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. నెలకు రూ.7.14 కోట్లు (జీఎస్టీతో) ఆ సంస్థ చెల్లించేది. ఈ ఏడాది జులై 6తో ఒప్పందం పూర్తవడంతో బాధ్యతల నుంచి తప్పుకొంది.

ఉమ్మడి జిల్లాలో గనులు భూగర్భశాఖ అనుమతితో 153 క్వారీల లీజులు నడుస్తున్నాయి. వీటికి పర్మిట్లు జారీచేసి, సీనరేజ్ వసూలు చేసేందుకు సంస్థ 40 చెక్‌పోస్టులు, 200 మంది సిబ్బందిని వినియోగించినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు పర్యవేక్షణ లేకపోవడంతో రోడ్‌మెటల్, గ్రావెల్ అక్రమంగా తరలుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాస్థాయిలో శాఖ అధికారితో పాటు ఇద్దరు సాంకేతిక సహాయకులు, ఒక ఆర్‌ఐ పర్యవేక్షించడం కష్టమవుతోంది. దీంతో ప్రభుత్వం ఆదాయం కోల్పోతోంది.

మ్యాక్సిట్, విజయనగరం అర్బన్, ఎస్.కోట: గనుల సీనరేజ్ రూపంలో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఉమ్మడి జిల్లాలో గనులకు పర్మిట్లు జారీ నుంచి సీనరేజ్ వసూలు, ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన రికవరీ వరకూ ఓ ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించారు. ఇందుకు గాను నెలకు రూ.7 కోట్లు ప్రభుత్వానికి చెల్లించేవారు. సంస్థ కాలపరిమితి ముగియడంతో ఆ బాధ్యత గనుల శాఖ చేతికే వచ్చింది. అరకొర సిబ్బందితో వీటి నిర్వహణ కష్టమవుతోంది. రెండు నెలలుగా పర్యవేక్షణ కొరవడటంతో ప్రభుత్వం ఆదాయం కోల్పోతోంది.

**ఏం జరుగుతోంది**

ప్రస్తుతం ఒకే పర్మిట్‌తో ఎక్కువసార్లు రవాణా జరుగుతోంది. కొన్నిసార్లు పర్మిట్ లేకుండా తరలిస్తున్నారు.

గతంలో అక్రమ మైనింగ్ జరిగితే ఏజెన్సీ ప్రతినిధుల సమాచారంతో అధికారులు కేసులు నమోదు చేసి, జరిమానాలు విధించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు.

శాఖాపరంగా నిర్వహణ.. ప్రస్తుతం శాఖాపరంగా పర్మిట్లు జారీ, సీనరేజ్ వసూలు చేస్తున్నారు. 85 శాతం రోడ్‌మెటల్ ప్రభుత్వ పనులకు వెళ్తోంది. మిగిలినది ప్రైవేటు వారు తీసుకుంటున్నారు. గ్రావెల్‌పై ఎక్కువ దృష్టిసారించాం. గ్రానైట్ తరలింపుపై అనుమతి ఇవ్వడంలేదు. సిబ్బంది కొరత ఉంది. ఉన్న మేరకు దృష్టిసారించాం. కె.సూర్యచంద్రరావు, జిల్లా గనులు భూగర్భశాఖాధికారి

# నమ్మిస్తాం.. మళ్లీ అమ్మేస్తాం!




విశాఖపట్నం: విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ(వీఎంఆర్‌డీఏ)లో అమ్మేసిన ప్లాట్లను తిరిగి విక్రయించేస్తున్నారు. అధికార యంత్రాంగమే ఆ తప్పిదానికి పాల్పడడంతో పలు లేఅవుట్లలోని కొనుగోలుదారులు బెంబేలెత్తుతున్నారు. తమ ప్లాట్లు ఎక్కడమ్మేశారోనని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. 'ఈసీ'లు తనిఖీ చేసుకుంటున్నారు. మారికవలస వద్ద గతంలో వుడా 'ఓజోన్ వ్యాలీ' లేఅవుట్‌ను డెవలప్ చేసింది. అందులో కొన్ని ప్లాట్లను గతంలోనే అమ్మేశారు. అందులో మిగిలిపోయిన ప్లాట్లకు ఇటీవల వేలం నిర్వహించగా.. అప్పటికే అమ్మేసిన వాటిని కూడా విక్రయించేయడం విస్మయం కలిగిస్తోంది.

**రిజిస్ట్రేషన్ సమయంలో:** గతంలో ప్రైవేటు వ్యక్తుల నుంచి భూములు తీసుకొని 'వుడా' ఓజోన్ వ్యాలీ లేఅవుట్ ఏర్పాటు చేసింది. ఆ సమయంలో భూములు ఇచ్చిన వారికి ఎకరాకు 1,800 గజాల ప్లాట్లను ఒప్పందంలో భాగంగా అప్పగించింది. మిగిలిన స్థలంలో లేఅవుట్ అభివృద్ధి చేసి అన్ని వర్గాలకు వీలుగా మొత్తం 108 ప్లాట్లు వేసింది. అందులో కొన్ని మిగిలిపోయాయి.

మిగులు ప్లాట్లు విక్రయించాలని వీఎంఆర్‌డీఏ ఇటీవల నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఆ లేఅవుట్‌ను ఆధునికీకరించింది. విద్యుద్దీపాలు, కాలువలు నిర్మించి రోడ్లు బాగు చేసింది. అనంతరం అందులో ప్లాట్లు విక్రయానికి ఉంచడంతో అసలు కథ మొదలైంది.

ఆన్‌లైన్‌లో ఈ–కొనుగోలు విధానంలో అందులోని ప్లాట్లను కొందరు కొనుగోలు చేశారు. వేలంలో దక్కించుకున్న వారు డబ్బులు చెల్లించి వీఎంఆర్‌డీఏ నుంచి కొనుగోలు ఒప్పంద పత్రాలు తీసుకున్నారు. తీరా.. రిజిస్ట్రేషన్‌కు సిద్ధమవుతున్న సమయంలో వాస్తవం బయట పడింది. గతంలో అమ్మేసిన పది ప్లాట్లను తిరిగి విక్రయించినట్లు ఆ సమయంలో గుర్తించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆపారు. గతంలోనే కొనుగోలు చేసిన యజమానులు లబోదిబోమన్నారు. వారి స్థలాలకు ఎటువంటి ఇబ్బంది లేదని తేల్చి చెప్పడంతో శాంతించారు.

**ఎలా జరిగింది?**

విక్రయించేసిన వాటిల్లో 311 గజాల స్థలాలు కొన్ని ఉన్నాయి. కొన్ని 250 గజాలు, మరికొన్ని 300 గజాలున్నాయి. ప్రస్తుతం కొనుగోలు చేసిన వారికి అదే లేఅవుట్‌లో ప్లాట్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ తప్పిదంపై వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ ఉద్యోగులపై మండిపడ్డారు. అమ్మేసిన ప్లాట్లను తిరిగి అమ్మకానికి ఎలా ఉంచారన్నది విచారిస్తున్నారు. ఎస్టేట్ విభాగంలో జరిగిన ఈ తప్పిదానికి కారణాలను విశ్లేషిస్తున్నారు. వీఎంఆర్‌డీఏ లేఅవుట్లలో మిగిలిపోయిన ఖాళీ స్థలాలు, ప్లాట్లు ఎక్కడెక్కడ ఉన్నాయనేది గత కొంతకాలంగా గుర్తిస్తున్నారు. కొందరు కొన్న వాటిని అలాగే ఖాళీగా ఉంచేశారు. వాటిని పరిశీలించి నివేదిక రూపొందించాల్సి ఉన్నా...తూతూమంత్రంగా సాగించినట్లు సమాచారం.

# నరాల సమస్యలా.. విమ్స్ ఉందిగా..!



విశాఖపట్నం: ఉరుకులపరుగుల నగర జీవితంలో ఒత్తిడి పెరిగి నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇది నరాల వ్యాధులకు దారితీస్తోంది. ఉద్యోగులు, మహిళలు, యువత ఆయా వ్యాధులతో బాధపడుతూ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందాలంటే రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. హనుమంతువాకలోని విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ(విమ్స్)లోని న్యూరాలజీ విభాగంలో వాటికి ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు.

**ఏయే వ్యాధులకు చికిత్స అందిస్తారంటే..:** తలనొప్పి, మూర్ఛ, పక్షవాతం, వణుకుడు, మతిమరుపు, నరాల బలహీనత, కాళ్లు, చేతుల్లో తిమ్మిర్లు, మంటలు, మెడ, నడుము నొప్పి, కళ్లు తిరగడం, కండరాల జబ్బులు, కంటి నరాల వాపు, తూలినట్లు నడవటం, వెన్నెముక నొప్పులు, తుంటినొప్పి, నరాల బలహీనత, నిద్ర సమస్యలు, చిన్నపిల్లల్లో మానసిక వైకల్యం, మెదడు, వెన్నెముక వ్యాధు లకు చికిత్స చేస్తారు.

**స్మార్ట్‌ఫోన్ల అధిక వినియోగంతో ఇబ్బందులు:** ఇక్కడ ఇద్దరు వైద్యులు, ఆరుగురు సహాయ సిబ్బంది అందుబాటులో ఉన్నారు. నిత్యం ఓపీ (అవుట్ పేషెంట్)కి 70 నుంచి 80 మంది వరకు వస్తున్నారు. 'ఇటీవల ప్రజల జీవన శైలిలో వచ్చిన మార్పు కారణంగా నరాల వ్యాధులు ఎక్కువ అవుతున్నాయి. గంటల తరబడి స్మార్ట్ ఫోన్ల వాడకంతో మెడ, భుజాల నొప్పులు వస్తున్నాయి. ఎక్కువ సేపు కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌ల ముందు కూర్చోవడంతో వెన్నెముక నొప్పి బారిన పడుతున్నారు. చిన్న వయసులోనే మైగ్రేన్, బీపీ, మూతి వంకరపోవటం, కాళ్లు చేతులు తిమ్మిళ్లు, వణుకు లాంటి అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. వాటికి విమ్స్‌లో ఆధునిక వైద్యం అందుబాటులో ఉంది' అని న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ బి.బాలప్రదీప్ తెలిపారు.

**రూ.50వేల విలువైన ఇంజెక్షన్ ఉచితం:** పక్షవాతం వచ్చిన గంటలోపు విమ్స్‌కి తీసుకొస్తే రూ. 50వేల విలువైన ఇంజెక్షన్‌ను ఉచితంగా ఇస్తున్నాం. తద్వారా రోగిలో కదలికలు మొదలై మామూలు స్థితికి వస్తాడు. పేద, మధ్యతరగతి వర్గాలకు ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా చికిత్స అందిస్తున్నాం. బ్లడ్‌బ్యాంకు, అంబులెన్స్‌లు కూడా ఉన్నాయి.
డాక్టర్ రాంబాబు, విమ్స్ డైరెక్టర్

# పెరిగిన సాయం.. పండక్కి ఖాయం..

విశాఖపట్నం: రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు అండగా నిలుస్తామని స్త్రీశక్తి పథకం ప్రారంభించిన రోజే ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ మేరకు అర్హులైన వారికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు ఇటీవల అనంతపురంలో జరిగిన సభలో చంద్రబాబు ప్రకటించారు. గత వైకాపా ప్రభుత్వం రూ.10 వేలు ఇచ్చింది. కూటమి ప్రభుత్వం ఆ మొత్తాన్ని రూ.15 వేలకు పెంచడంతో వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అర్హతలు ఉన్నా నిబంధనల కారణంగా కొందరు వాహన మిత్ర పథకానికి దూరమయ్యారు. ఈ సారి అలా కాకుండా పారదర్శకంగా పథకాన్ని అమలు చేసేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

**జిల్లాలో 40 వేల మందికి లబ్ధి:** రాష్ట్రంలో అత్యధికంగా విశాఖ జిల్లాలో 40 వేల మందికి పైగా లబ్ధి చేకూరనుంది. వీరిలో ఆటోడ్రైవర్లు 30 వేలకు పైగా ఉంటారని, మ్యాక్సీ క్యాబ్‌ల డ్రైవర్లు 10 వేల మంది వరకు ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో వాహన మిత్ర పథకం లబ్ధిదారుల వివరాలను సేకరించే పనిలో రవాణా శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. సొంత వాహనం కలిగి ఉండి వాటిని నడుపుతున్న డ్రైవర్లకు ఈ పథకం వర్తిస్తుంది. పూర్తి వివరాలు సేకరించాక వీరి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలో వాహన మిత్ర ద్వారా లబ్ధి పొందిన వారి సమాచారం ఇప్పటికే ప్రభుత్వం వద్ద ఉంది.

**సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ:** కొత్తగా అర్హులైన వారి దరఖాస్తులు ఈనెల 17 నుంచి 19 వరకు అన్ని వార్డు సచివాలయాల్లో స్వీకరించనున్నారు. ఈనెల 22లోపు పరిశీలన చేసి 24న తుది జాబితాను విడుదల చేయనున్నట్లు అధికారులు తెలియజేశారు. అక్టోబరు 1న అర్హులైన వారి ఖాతాలో రూ.15 వేల జమ చేయనున్నారు.

# అంతా తుస్!

అనకాపల్లి :పెట్రోలు బంకుల్లో వినియోగదారులకు తప్పనిసరిగా తాగునీరు, వాహనాలకు గాలి, మరుగుదొడ్లు అందుబాటులో ఉంచాలి. వీటితో పాటు ధరల పట్టిక, ప్రథమ చికిత్స కిట్లు ఉండాలి. చాలా బంకుల్లో ఇవన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయి. తహసీల్దార్ నుంచి జేసీ వరకు తనిఖీలు చేసే అధికారం ఉంది. ఆయిల్ కంపెనీల అధికారులు తరచూ పరిశీలించాలి. బంకుల్లో తనిఖీలు అంతంత మాత్రంగానే ఉండడంతో వాహనాదారులకు సదుపాయాలు అందడంలేదు. జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన పెట్రోల్, డీజిల్ బంకులు 185 వరకు ఉన్నాయి. అనకాపల్లి నియోజకవర్గంలోనే 26 ఉన్నాయి. వీటిలో 70 శాతం బంకుల్లో నిబంధనలు అమలు కావడంలేదు. అనకాపల్లి – విజయవాడ జాతీయ రహదారిలో కశింకోట ప్రాంతాల్లో 12 వరకు బంకులున్నాయి. వీటిలో తాగునీరున్నా.. మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉంటున్నాయి. బంకు సిబ్బందే ఉపయోగిస్తున్నారు. పలు బంకుల ముందే పంక్చర్ షాపులున్నాయి. ఒక టైరుకు గాలి పెడితే రూ.10 చొప్పున కారు రూ.40 వసూలు చేస్తున్నారు. అనకాపల్లి పట్టణంలో రెండు బంకులున్నాయి. ఒక దానిలో వాహనాలకు గాలి కొట్టింది ఎప్పుడూ లేదు. వీటిలో మరుగుదొడ్లు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియని పరిస్థితి. ఈ విషయాన్ని జాయింట్ కలెక్టర్ జాహ్నవి దృష్టికి తీసుకువెళ్లగా.. బంకుల్లో విధిగా తాగునీరు, మురుగుదొడ్ల సదుపాయం కల్పించడంతోపాటు వాహనాలకు ఉచితంగా గాలి పెట్టాలన్నారు. అన్ని బంకులను తనిఖీ చేస్తామన్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# మూడున్నరేళ్ల యాతన

చీపురుపల్లి: విజయనగరం–పాలకొండ ప్రధాన రహదారిలో చీపురుపల్లిలోని జి.అగ్రహారం వద్ద ఆర్వోబీ నిర్మాణం ప్రారంభించి దాదాపు 30 నెలలు గడుస్తున్నా.. నేటికీ పనులు పూర్తికాలేదు. వంతెన అందుబాటులోకి రాకపోవడంతో విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు ఒడిశా ప్రయాణికులకు అవస్థలు తప్పడంలేదు. ఆర్వోబీ శిథిలావస్థకు చేరుకోవడంతో దాదాపు మూడున్నర ఏళ్ల కిందట భారీ వాహనాల రాకపోకలను నిషేధించారు. రాజాం, పాలకొండ, ఒడిశా వైపు నుంచి చీపురుపల్లి మీదుగా విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, రాజమహేంద్రవరం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, హైదరాబాద్ ప్రాంతాలకు రాకపోకలు సాగించాల్సిన ఆర్టీసీ బస్సులతో పాటు లారీలు, ఇతర రవాణా వాహనాలన్నీ నిలిపేశారు. ప్రస్తుతం కొన్ని చిలకపాలెం మీదుగా.. కొన్ని గరివిడి, గర్భాం మీదుగా వెళ్తున్నాయి.

**ఇదే అసలు సమస్య**

కొత్తగా వంతెన నిర్మాణానికి 2022 ఆగస్టు 16న కేంద్ర రైల్వే బోర్డు రూ.12.97 కోట్లు మంజూరు చేసింది. నిర్మాణాలను 2023 మార్చిలో ప్రారంభించారు. చీపురుపల్లి వైపు కాంక్రీటు గోడ నిర్మిస్తే కొత్తఅగ్రహారం, రిక్షాకాలనీకి వెళ్లేందుకు రోడ్డు సదుపాయం కోల్పోతామంటూ స్థానికులు పలుమార్లు పనులు అడ్డుకున్నారు.

ర.భ.శాఖ అధికారులు సర్వీసు రహదారి నిర్మాణానికి అడ్డంగా ఉన్న



దుకాణాలను కొంతవరకు తొలగించి 12 అడుగుల స్థలాన్ని సిద్ధం చేయించారు.

**ఆర్టీసీకి రూ.37.80 కోట్లు నష్టం**

పాలకొండ డిపో నుంచి చీపురుపల్లి మీదుగా విజయనగరం, విశాఖపట్నం, ఇతర ప్రాంతాలకు రోజూ దాదాపు 49 బస్సులు తిరిగేవి. ఇప్పుడు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి కావడంతో కేవలం 20 మాత్రమే రాకపోకలు సాగిస్తున్నాయి.

వంతెన మీదుగా భారీ వాహనాల రాకపోకలను నిషేధించిన నాటి నుంచి నేటి వరకు పాలకొండ డిపోకు రూ.37.80 కోట్లు నష్టం(రోజుకు రూ.3 లక్షలు) వాటిల్లినట్లు డిపో అధికారులు చెబుతున్నారు. పాలకొండ నుంచి విజయనగరం మధ్య రాజాం, చీపురుపల్లి, గరివిడి, నెల్లిమర్ల వంటి పట్టణాలు ఉన్నాయి. ప్రయాణికులు భారీగా రాకపోకలు సాగిస్తుంటారు. పెద్ద ఎత్తున పరిశ్రమలు ఉన్నాయి. ముడిసరకు రవాణాకు ఇక్కట్లు తప్పడం లేదని వాపోతున్నారు.

**చర్యలు చేపడతాం..**

సర్వీసు రోడ్డు సమస్యతో వంతెనకు సంబంధించిన 40 మీటర్ల కాంక్రీటు గోడ నిర్మాణం ఆగిపోయింది. ఇది పరిష్కారమైతే 20 రోజుల్లో వంతెనను అందుబాటులోకి తెస్తామని గుత్తేదారు ప్రతినిధులు చెబుతున్నారు. విషయం ర.భ.శాఖ ఏఈ కె.మురళీబాబు వద్ద ప్రస్తావించగా.. సర్వీసు రహదారికి అడిగిన 12 అడుగుల స్థలాన్ని సేకరించి ఇచ్చామని, స్థానికులు సరిపోదంటున్నారన్నారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

# గొంతు దిగని గంగ...

## 'కొనలేక బెంగ'

సంతనూతలపాడు : ఒంగోలు నగరానికి కూతవేటు దూరంలోనున్న సంతనూతలపాడుకు గతంలో ఏర్పాటుచేసిన నీటి పథకం నిర్వహణ గాడి తప్పింది. నిధులిచ్చినా మరమ్మతులు లేవు. ఫలితంగా ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడంలేదు.

**ఫిల్టర్ బెడ్లు పూర్తిగా నిరుపయోగం**

చిన్న చెరువులో 10 ఏళ్ల క్రితం మంచినీటి పథకాన్ని ఏర్పాటుచేశారు. పెరుగుతున్న గ్రామ జనాభాకు తగినట్లుగా గ్రామంలోని పెద్ద చెరువు వద్దనున్న బోర్లతో పాటు ఈ పథకం నుంచి సైతం తాగు నీటిని అందించేలా నిర్మించారు. తొలి నాళ్లలో బాగానే నడిచింది. రోజులు గడిచే కొద్దీ నిర్వహణ కొరవడింది. దీంతో మైక్రో ఫిల్టర్ బెడ్‌లు పూర్తిగా నిరుపయోగంగా మారాయి. అప్పటి నుంచి గ్రామంలో రంగు మారిన నీరే సరఫరా అవుతోంది. సుమారు 10వేలకు పైగా జనాభా ఉన్న ఈ గ్రామంలో సగానికి ఈ పథకం నుంచే తాగు నీటిని అందిస్తుంటారు. కానీ స్వచ్ఛమైన నీరు సరఫరా కాకపోవడంతో కేవలం వాడుకకు మాత్రమే వినియోగించాల్సి వస్తోంది.

**బావి నుంచి తెచ్చుకుంటున్నారు**

తాగేందుకు బహిరంగ మార్కెట్లో బబుల్స్ కొనుగోలు చేయాల్సి వస్తోంది. కొనుగోలు చేయలేని వారు పెద్ద చెరువు వద్దనున్న మంచినీటి బావి నుంచి తెచ్చుకుంటున్నారు. ఏళ్లు గడుస్తున్నా పథకానికి మరమ్మతులు చేపట్టడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మరో వైపు దీని నిర్వహణ భారం మోయలేక



పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు 'మీది..మీది' అంటూ మొండి చెయ్యి చూపారు.

**రూ.20 లక్షల నిధుల కేటాయింపు**

మంచినీటి పథకాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు జడ్పీ నుంచి రూ.20లక్షల వరకు నిధులు కేటాయించారు. పథకాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కేటాయించి టెండర్లు పిలిచి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని యోచించారు. ఇందుకు తగ్గట్టుగా నిధులు కేటాయించినా ఇంకా టెండర్లు మాత్రం పిలవలేదు. టెండర్లు పిలిచి మైక్రో ఫిల్టర్ బెడ్‌లను అందుబాటులోకి తీసుకువస్తే గ్రామంలో స్వచ్ఛమైన తాగు నీరు సరఫరా అవుతుంది.

# ఆక్రమణలపై హక్కు.. పేదలకు దక్కు

నర్సీపట్నం : ప్రభుత్వ స్థలాల్లో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న పేదలకు ఊరట లభించనుంది. కూటమి సర్కారు వీరికి ఉపశమనం కలిగించేలా ఆ స్థలాలపై హక్కులు కల్పిస్తూ క్రమబద్ధీకరణ అవకాశం ఇస్తోంది. రెవెన్యూ అధికారులు దరఖాస్తుల స్వీకరణ ఇప్పటికే ప్రారంభించారు. 2019 అక్టోబరు 15కు ముందు 150 గజాల్లోపు చోటుచేసుకున్న ఆక్రమణలను ఉచితంగా క్రమబద్ధీకరించనున్నారు. అంతకంటే ఎక్కువ ఉంటే మార్కెట్ విలువ ఆధారంగా నిర్ణీత రుసుం చెల్లిస్తే పరిశీలించి క్రమబద్ధీకరిస్తారు.

ప్రభుత్వ భూముల్లో వివాదాలు లేని స్థలాల్లోని నివాసాలకు నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరణ సులువవుతుంది. ఆక్రమిత స్థలాల్లోని వారు



అన్ని వివరాలతోపాటు ఇంటి పన్ను, విద్యుత్తు బిల్లు రసీదులతో వార్డు సచివాలయంలో దరఖాస్తు చేయాలి. మండల రెవెన్యూ కార్యాలయాల్లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయి.

నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలో అభ్యంతరం లేని భూముల్లో నివాసం ఉంటున్న వారి వివరాల సేకరణ, సర్వే తహసీల్దార్లు చేపడుతున్నారు. క్రమబద్ధీకరణకు అనువైన వాటిని గుర్తించి వీర్వోల ద్వారా అర్హులైన వారితో దరఖాస్తు చేయిస్తున్నారు.

నర్సీపట్నం మండలంలో ఇప్పటివరకు 30 దరఖాస్తులు అందాయి. అంతకు ముందే తహసీల్దారు రామారావు మండలంలోని అభ్యంతరం లేని భూమలున్న ప్రాంతాలను సర్వే చేసి 17 మందితో దరఖాస్తు చేయించారు. దుగ్గాడ, ధర్మసాగరం, బలిఘట్టం తదితర ప్రాంతాల్లోని గయా, బంజరు, కొండ పోరంబోకు భూముల్లోని వారు ఎవరైనా ఉంటే నేరుగా దరఖాస్తు చేయవచ్చన్నారు.

'డివిజన్లో ఇప్పటివరకు 214 మంది క్రమబద్ధీకరణకు ముందుకు వచ్చారు. వీటిపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపడుతున్నాం. ప్రభుత్వ ఇచ్చిన ఈ అవకాశంతో అర్హులందరికీ ఆస్తిపై పూర్తి హక్కులు లభిస్తాయి. ఆస్తి విలువ పెరగడంతోపాటు బ్యాంకుల నుంచి రుణాలు పొందవచ్చు. ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరు వరకు గడువు ఉంద'ని నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ పేర్కొన్నారు.

# నారీ ఆరోగ్యం.. కుటుంబానికి భద్రం

అనకాపల్లి : ఇల్లాలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం మొత్తం బాగుంటుంది. ఇంటి పనులు చూసుకునే మహిళల్లో చాలామంది తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం లేదు. అనారోగ్యానికి గురైతే మందుల షాపుల నుంచి మాత్రలు తెచ్చుకుని వాటితోనే సరిపెట్టుకుంటున్నారు. వ్యాధి ముదిరాక ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో మహిళల ఆరోగ్యానికి పెద్దపీట వేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిసారిస్తున్నాయి.'స్వస్థ నారీ.. స్వశక్త్ పరివార్ అభియాన్' పేరుతో ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేసేందుకు వైద్యారోగ్య శాఖ సన్నద్ధమవుతోంది. గతంలో జిల్లా వ్యాప్తంగా సర్వే చేసి ప్రజల ఆరోగ్య స్థితిగతులపై నివేదిక రూపొందించారు. 17 నుంచి 49 ఏళ్లలోపు మహిళల ఆరోగ్యంపై గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు చేయనున్నారు. సుగర్, బీపీ, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, ఇతర అనారోగ్య సమస్యలకు చికిత్స అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయిం



చింది. అధిక రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, క్షయ స్క్రీనింగ్, బాలికలు, మహిళలకు రక్తహీనత పరీక్షలు, ఏజెన్సీ ప్రాంతంలో సికెల్‌సెల్ ఎనీమియా పరీక్షలు చేసి నిర్ధారణ అయితే ఆరోగ్య కార్డులు అందజేస్తారు. గత ఏడాది సర్వేలో రొమ్ము క్యాన్సర్‌తో 196 మంది, నోటి క్యాన్సర్‌తో 182, గర్భాశయ క్యాన్సర్‌తో 259, అధిక రక్తపోటుతో 30,600, మధుమే హంతో 18,400 మంది మహిళలు బాధపడుతున్నట్లు గుర్తించారు. 'వ్యాధులపై నిర్లక్ష్యం చూపకుండా ముందుగానే గుర్తిస్తే చికిత్స ద్వారా నయం చేయవచ్చు. గ్రామాల్లో మహిళలు ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. శిబిరాలు నిర్వహించి వైద్య పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యా'యని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి హైమావతి చెప్పారు.

# ఫ్లాట్ కావాలా.. నాయనా!

చిత్తూరు : నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో ఆంధ్రప్రదేశ్ పట్టణ మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీ టిడ్కో) ఆధ్వర్యంలో నిర్మించిన గృహాల్లో ఖాళీగా ఉన్న ఫ్లాట్లను కొత్తవారికి ఇవ్వాలని ప్రభుత్వం తలచింది. ఎవరైనా ఏక మొత్తంలో చెల్లిస్తే వెంటనే వారికి ఇళ్లు అప్పగించనున్నారు. ఆ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు నగరపాలక సంస్థ, పుత్తూరు, శ్రీకాళహస్తి, సూళ్లూరు పేట, నాయుడుపేట, వెంకటగిరి, గూడూరు పురపాలక సంఘాల్లో గత తెదేపా ప్రభుత్వ హయంలో ఏపీ టిడ్కో ఆధ్వర్యంలో షేర్‌వాల్ టెక్నాలజీతో గృహ సముదాయాలను నిర్మించారు. వీటిల్లో చాలావరకు మిగులు ఫ్లాట్లు ఉన్నాయి. వాటిని కొత్తవారికి ఇవ్వాలని ప్రభుత్వం తలచింది. ఇందులో భాగంగా 365 చదరపు అడుగుల ఇంటిని రూ.3.65 లక్షలకు, 430 చదరపు అడుగుల ఇంటిని రూ.4.15 లక్షలకు ఇచ్చేలా ధరలు నిర్ణయించారు.

**వైకాపా ప్రభుత్వంలో నిర్లక్ష్యం**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో పురపాలక సంఘాల్లో ఏడీ టిడ్కో గృహ సముదాయాల పనుల్లో తీవ్ర జాప్యం ఏర్పడింది. కానీ గృహ సముదాయాలకు పార్టీ రంగులు మాత్రం వేశారు. కొన్నిచోట్ల గృహాలు పూర్తయినా లబ్ధిదారులకు ఇవ్వలేదు. అయినా ఈఎంఐ చెల్లించాలని బ్యాంకర్లు కూడా లబ్ధిదారులపై ఒత్తిడి చేసిన సంఘటనలు ఉన్నాయి. దీనిపై అప్పట్లో లబ్ధిదారులు గృహాలు అప్పగించకుండా ఈఎంఐ ఎలా చెల్లిస్తామని అధికారులను నిలదీశారు. చాలామంది లబ్ధిదారులు గృహాలపై స్పష్టత లేకపోవడంతో ఆశలు వదులుకున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

**ఖాళీ ఫ్లాట్లు ఇస్తాం: దేవికా, టిడ్కో ఈఈ**

ఏపీ టిడ్కో ఇళ్ల సముదాయాల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లను కొత్తవారికి ఇవ్వనున్నాం. ఇందుకు లబ్ధిదారులు నగదు మొత్తం చెల్లించాల్సి ఉంది. గృహ నిర్మాణ పనులు పూర్తి కావొచ్చాయి.

# పుర ఆదాయానికి నిర్లక్ష్యపు గండి



హిందూపురం : మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సుల్లోని గదుల నుంచి వచ్చే అద్దె పురపాలికలకు ఓ ప్రధాన ఆదాయ వనరు. హిందూపురం పట్టణంలో ఏటా గదుల అద్దె రూపంలో ఏకంగా రూ.1.50 కోట్ల ఆదాయం మున్సిపాలిటీకి వస్తోంది. గదులను నియమ నిబంధనల ప్రకారం వేలం పాటలు నిర్వహించి అద్దె ప్రతిపాదికన లీజుదారులకు కేటాయిస్తారు. ఇలా ఒక్కసారి వేలం పాటల్లో గదులను పొందితే 25 ఏళ్ల పాటు వాటిలో లీజుదారు వ్యాపారం చేసుకోవచ్చు. మూడేళ్లకు ఒకసారి అద్దెను 33 శాతం పెంచుతారు. గడువు ముగిసిన తరువాత పాత లీజును రద్దు చేసి మళ్లీ బహిరంగ వేలం వేయాలి. ఆరు నెలలు ముందుగానే ఈ విషయాన్ని లీజుదారుకు గుర్తు చేస్తూ మున్సిపల్ రెవెన్యూ విభాగం నోటీసులు ఇవ్వాలి. అద్దె బకాయిలు ఉంటే వసూలు చేసుకోవాలి. అయితే హిందూపురం మున్సిపాలిటీలో నియమ నిబంధనలను తుంగలోకి తొక్కారు. గడువు ముగిసినా పాత లీజుదారులే కొనసాగుతున్నారు. లక్షలాది రూపాయలు మొండి బకాయిలుగా మారాయి. దీంతో మున్సిపాలిటీ రెండు విధాలుగా ఆదాయాన్ని కోల్పోతోంది.

**ఏళ్ల తరబడి పాతవారే...**

ప్రభుత్వాసుపత్రి ముందు భాగంలో ఉన్న మున్సిపల్ లైబ్రరీ కాంప్లెక్సులో ఓ గదికి లీజు కాలపరిమితి ఐదేళ్ల క్రితమే ముగిసింది. ఈ కాంప్లెక్సుల్లోని కొన్ని గదులకు సంబంధించి లక్షలాది రూపాయలు అద్దె బకాయిలు ఉన్నాయి.

పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఇందిరా షాపింగ్ కాంప్లెక్సులో 7 గదులకు సంబంధించి 25 ఏళ్ల లీజు కాలపరిమితి పూర్తి అయింది. వీటిలో సైతం ఓ గదికి రెండేళ్లు, మిగిలిన వాటికి లీజు గడువు ముగిసి ఏడాది దాటింది. అయినా నోటీసులు కూడా ఇవ్వకపోవడం గమనార్హం.

పాత బస్టాండ్ షాపింగ్ కాంప్లెక్సులోనూ పలు గదులకు లీజు కాలపరిమితి ముగిసింది. కొన్నింటికి గడువు ముగిసి ఏడాది, మరి కొన్నింటికి రెండేళ్లు, ఓ గదికి ఐదేళ్లు దాటింది.

**వేలం పాటలు నిర్వహిస్తాం**

–మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్, హిందూపురం

మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సులపై దృష్టి సారించా. వాటి నుంచి ఆదాయం పెరిగేలా చర్యలు చేపట్టా. 25 ఏళ్ల కాలపరిమితి ముగిసిన గదులు ఉన్నట్లు గుర్తించాం. వాటికి వెంటనే వేలం పాటలను నిర్వహించేందుకు కౌన్సిల్ అనుమతి తీసుకొన్నాం. త్వరలో వేలం పాటలు నిర్వహిస్తాం.

# నాణ్యత కొరవడి.. నెర్రెలు వారి!



ఉరవకొండ : ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జాతీయ రహదారి 67 నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లేక ఎక్కడపడితే అక్కడే నెర్రెలు వారుతున్నాయి. మరోవైపు నిర్మాణం అసంపూర్తిగా మారడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. కృష్ణపట్నం–అంకోల జాతీయ రహదారిని 2015 నుంచి 2019లోపు పూర్తిచేయాల్సి ఉన్నా.. పలు కారణాలతో గడువు పొడిగించారు. అయినా అసంపూర్తిగా ఉండటం గమనార్హం. గుత్తి నుంచి రాష్ట్ర సరిహద్దు వరకు సుమారు 55 కిలోమీటర్లు రూ.630 కోట్లతో చేపట్టారు. ఇప్పటికే సుమారు 45 కిలోమీటర్లు మేర పనులు పూర్తయినా... నిర్వహణలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పనుల్లో నాణ్యతాలోపం కారణంగా విడపనకల్లు మండలం పెంచలపాడు, కడదరబెంచి, డొనేకల్లు గ్రామాల మీదుగా వెళ్లే రహదారికి నెర్రెలు వచ్చాయి. సకాలంలో మరమ్మతులు చేయించకపోగా... భారీ వాహనాల రాకపోకలతో పెద్దవిగా మారుతున్నాయి. మరోవైపు డివైడర్లపై, అంచుల్లో కంప పెరగడంతో దారిరూపు కోల్పోతోంది.

**ఏళ్లుగా ఒక వరుసలోనే ప్రయాణం**

పెంచలపాడు, గడేకల్లు, కడదరబెంచి, డొనేకల్లు గ్రామాల వద్ద పనులు పూర్తికాలేదు. దీంతో ఏళ్లుగా వాహనాలు వన్‌వేలో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. కొత్తగా వచ్చే ప్రయాణికులకు ఈ విషయం తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల పోలీసులే కొన్నిచోట్ల ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయడం గమనార్హం.

**తగిన చర్యలు తీసుకుంటాం**

– కోటేశ్వరరెడ్డి, ఎన్‌హెచ్ ఏఈఈ

జాతీయ రహదారిపై ఏర్పడిన పగుళ్లకు మరమ్మతులు చేయిస్తాం. గతంలో పనులు చేసిన గుత్తేదారును ఉన్నతాధికారులు తప్పించారు. కొత్తగా టెండర్లను ఆహ్వానించి గుత్తేదారు కుదిరాక మిగిలిన పనులతో పాటు మరమ్మతులు పూర్తిచేయిస్తాం. అప్పటి వరకు తాత్కాలికంగా అవసరమైన చోట్ల పనులు చేయిస్తాం.

# కారు పరుగు.. ఎప్పుడో దేవుడెరుగు!



పుట్టపర్తి: తనకల్లు మండలం కోటపల్లి పంచాయతీ మరాల పల్లి సమీపంలో ఏర్పాటు చేస్తున్న నిధి మార్క్యు వన్ కార్ రేస్ ట్రాక్ ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలతోపాటు పలు ప్రయోజనాల కోసం 2018లో తెదేపా సర్కారు అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టు ఏర్పాటు శ్రీకారం చేయించింది. పనులు ప్రారంభించి ఆరేళ్లు కావస్తున్నా ఇప్పటికీ కొలిక్కిరాలేదు. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో జిందాల్ సంస్థ ఆర్థిక సహకారంతో ప్రాజెక్టును చేపట్టారు. ఇందుకోసం నిధి మార్క్యు వన్ కార్ రేస్ సంస్థకు 216 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పగించింది. రూ.320 కోట్లతో మూడు విడతల్లో 3.25 కిలోమీటర్ల ట్రాక్ ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు ప్రభుత్వం భూమి అప్పగించింది. రేస్ ట్రాక్, హోటళ్లు, గోల్ఫ్ కోర్టులు, 34 ఎకరాల్లో పార్క్, రిసార్టులు, యుటిలిటీ డెవలెప్‌మెంట్, విల్లాల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. మొదటి విడతలో రూ.40 కోట్లతో 150 ఎకరాల్లో మోటార్ స్పోర్ట్స్ రేస్‌ట్రాక్, ఆటోమోటివ్ టెస్టింగ్, క్లబ్, వసతి గదుల నిర్మాణం, వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ పనులకుగాను 2020 వరకు గడువు నిర్దేశించినా పూర్తి చేయలేదు. రెండో విడతలో రూ.9 కోట్లతో 25 ఎకరాల్లో గోల్ఫ్ కోర్టులు, క్రీడాసముదాయం, ప్రదర్శన కేంద్రాలను భూములు అప్పగించిన 54 నెలల్లో పూర్తి చేయాలి. మూడో విడతలో రూ.100 కోట్లతో 25 ఎకరాల్లో ఆటోమోటివ్ థీమ్డ్ అమ్యూజ్‌మెంట్ పార్కును భూములు అప్పగించిన 90 నెలల్లో ఏర్పాటు చేయాలన్నది ఒప్పందం. 2019 తర్వాత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడం, తగిన సహకారం లేకపోవడంతో పనులు ఊపందుకోలేదని తెలుస్తోంది. ప్రస్తుతం రేస్ ట్రాక్ పనులు 50 శాతం వరకు పూర్తయ్యాయి.

**పూర్తి చేయాలని ఆదేశాలిచ్చాం**

– నర్సయ్య, పర్యాటకశాఖ జిల్లా ఇన్‌ఛార్జి అధికారి

పనులు సకాలంలో పూర్తి చేయాలని నిర్వాహకులను ఆదేశించాం. సహకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రాజెక్టు పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది మందికి ఉపాధి లభించడంతోపాటు ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.

# పరికరం శిథిలం.. తల్లడిల్లుతోంది ప్రాణం

చెన్నేకొత్తపల్లి రాప్తాడు నియోజకవర్గంలో ఉన్న ఒకే ఒక్క 30 పడకల వైద్యశాల చెన్నేకొత్తపల్లి సీహెచ్‌సీ. గత తెదేపా ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉన్న పరిటాల సునీత రూ.మూడు కోట్లతో 30 పడకలతో అధునిక భవన సముదాయాన్ని నిర్మించారు. తర్వాత వైకాపా అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి తన సొంత నిధులు, దాతల సహకారంతో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేస్తానని తెలిపారు. 2021లో ప్రాణవాయువు అందించేందుకు రూ.40 లక్షల విలువ చేసే పరికరాలను దాతల ద్వారా ఆస్పత్రికి చేర్చారు. అప్పటి నుంచి పట్టించుకోకపోవడంతో ఇన్‌స్టలేషన్ పనులు ఆగాయి. కొవిడ్ రెండో దశ వచ్చేలోపు ఆక్సిజన్ ప్లాంట్ సిద్ధం చేస్తామని మరో సమావేశంలో ఆయన వెల్లడించారు. తర్వాత గాలికొదిలేశారు. రూ. 5 లక్షలకు మించి ఆస్పత్రి నిధులు వెచ్చించలేమని ఆసుపత్రి వైద్యురాలు జయలక్ష్మి చెబుతున్నారు. పరికరాలు తుప్పు పడుతున్నాయి. దీనిపైలో రెండుసార్లు కథనాలు రావడంతో స్పందించిన ఉన్నతాధికారులు షెడ్డు నిర్మించి ఇన్‌స్టలేషన్ పరికరాలు, మానిటరింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసి.. 30 పడకలకు ఆక్సిజన్ వెళ్లేలా పైప్‌లైన్ చేశారు. మిగతా ఇన్‌స్టలేషన్ పూర్తి చేస్తే రోగులకు ఎంతో మేలు జరుగుతుంది. ఆత్మకూరు మండల కేంద్రంలోని గ్రామీణ ఆరోగ్య ఉపకేంద్రంలో 2022లో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేశారు.

# అవినీతి దాహం.. అక్రమాలకు దాసోహం

చంద్రగిరి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన జి.మహేశ్వరయ్య అనే వ్యక్తి తన ఉద్యోగ జీవితంలో రూ.30 కోట్లకుపైగా ఆస్తులు కూడబెట్టారని అనిశా అధికారులు గుర్తించారు. ఓ గుత్తేదారు నుంచి రూ.50 వేలు తీసుకుంటుండగా దాడి చేసి పట్టుకోగా అతని సంపద గురించి తెలుసుకుని అధికారులే విస్తుపోయారు. యాదమరి మండలం 14.కండ్రిగ ముస్లింవాడ పంచాయతీ కార్యదర్శి ప్రకాష్.. పనులు జరగకుండానే రూ.4.47 లక్షలు డ్రా చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు. జిల్లా పంచాయతీ అధికారి చేసిన తనిఖీలో వాస్తవమని తేలడంతో ఆయన్ను కలెక్టర్ సుమిత్‌కుమార్ సస్పెండ్ చేశారు.

ఈనాడు– చిత్తూరు, తిరుపతి: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొందరు పంచాయతీ కార్యదర్శుల అవినీతి దాహానికి అంతే లేకుండా పోతోంది. లే అవుట్లు, భవన నిర్మాణాలకు అనుమతులు మొదలుకొని అభివృద్ధి కార్యక్రమాలకు బిల్లుల విడుదలకు లంచాలు తీసుకుంటున్నారు. పలువురు పనులు చేయకుండానే చేసినట్లు చూపి నగదు బొక్కేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తుండటంతో మరింతగా రెచ్చిపోతున్నారు. కొన్నిచోట్ల ఇటువంటి ఉదంతాలు వెలుగు చూసినా ఎంపీడీవోలు సర్దుబాటు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. కేంద్రం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులను ఎప్పటికప్పుడు ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇదే పంచాయతీ కార్యదర్శులకు వరంలా మారింది. కొత్త భవనాలకు



ఆస్తి పన్ను మదింపు, లే అవుట్లు, పన్నుల వసూళ్లు.. ఇలా ప్రతి పనికీ ఓ ధర నిర్ణయించారు. ప్రధానంగా వి.కోట, తిరుచానూరు, బంగారు పాళ్యం, రేణిగుంట, చంద్రగిరి.. ఇలాంటి మేజర్ పంచాయతీల్లో లంచాల బెడద ఎక్కువగా ఉంది.

**ఆడిట్‌లోనూ తప్పించుకుంటూ..**

పంచాయతీల్లో జరిగిన అవకతవకలు కచ్చితంగా ఆడిట్‌లో తేలుతాయి. రికార్డులు క్షుణ్నంగా తనిఖీ చేసి ప్రతి రూపాయి గురించి ఆరా తీస్తే కార్యదర్శుల అవినీతి చిట్టా బయటపడుతుంది. ఇందుకు భిన్నంగా ఆడిట్ బృందం వ్యవహరిస్తోందనే ఆరోపణలున్నాయి.రు అధికారులు ఇచ్చిన డబ్బులు పుచ్చుకుని తూతూమంత్రంగా పరిశీలిస్తున్నారు. ఫలితంగానే నిధుల దుర్వినియోగం గురించి వెల్లడి కావడంలేదు. కొన్ని సందర్భాల్లో స్థానిక సర్పంచ్‌లే ఈ వ్యవహారాన్ని వెలికి తీస్తున్నారు.

**వెంటనే చర్యలు తీసుకుంటేనే..**

వి.కోట మేజర్ పంచాయతీలో కొంతకాలం క్రితం రూ.20 లక్షలు అవినీతి జరిగిందని తేలింది. ఇలాంటి ఉదంతాలు వెలుగు చూసిన వెంటనే చర్యలు తీసుకుంటేనే మిగతావారూ గాడిలో పడతారు. చాలామంది ఎంపీడీవోలు మూసిపెట్టడానికి ప్రయత్నిస్తున్నారే తప్ప ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలేదు. దీనికితోడు రాజకీయ పలుకుబడి ఉపయోగించి అక్కడే తిష్ఠ వేస్తున్నారు.

# అవుకు భూములు ఆరగించారు

నంద్యాల : అవుకు జలాశయం మిగులు భూములు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. జలాశయం నిర్మాణ పనులు 1990లో ప్రారంభించారు. రెండు దశల్లో పనులు చేపట్టి 2005లో పూర్తి చేశారు. 4.148 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా అవుకు, చెర్లోపల్లి గ్రామాల పరిధిలో జలాశయాన్ని నిర్మించారు. ఇందుకు 2,100 ఎకరాలు సేకరించారు. ఇందులో మూడు వందల వరకు ఖాళీగా ఉండగా బనగానపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, వారి అనుచరులు పాగా వేశారు. ఆయా భూముల్లో యథేచ్ఛగా సాగు చేసుకుంటున్నారు. ఆక్రమణకు గురైన భూమి విలువ రూ.50 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

**రక్షణ లేక భక్షణ** చెర్లోపల్లి పూర్తిగా మునగడంతో పునరావాసం కోసం రామాపురం గ్రామ పరిధిలో భూములు కొనుగోలు చేశారు. జలాశ యం నిర్మాణానికి కొంత అటవీశాఖ భూమి తీసుకొన్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా ఆ శాఖకు ఇచ్చేందుకు రామవరం, సంగపట్నం, అవుకు గ్రామాల్లో మరికొంత భూమి సేకరించారు. జలాశయం కట్ట నిర్మాణానికి అవసరమైన మట్టి కోసం సింగనపల్లి, మెట్టుపల్లి, సంగపట్నం, చెన్నంపల్లి, నిచ్చెనమెట్ల, అన్నవరం పరిసరాల్లోనూ కొంత భూమిని కొనుగోలు చేశారు. ఆయా భూములను జలాశయం అవసరాలకు వినియోగించుకోగా మూడు వందల ఎకరాల వరకు మిగిలింది. దాన్ని అధికారులు పర్యవేక్షణ చేయకపోవడంతో అక్రమార్కుల పని సులువైంది.

**'కూటమి' ప్రభుత్వం ఆరా**

అవుకు జలాశయం భూముల కబ్జా కథ తేల్చాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది. విచారణ నివేదిక పంపాలని ఆదేశించడంతో ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో ఆక్రమణదారుల్లో కలవరం మొదలైంది. జలాశయ మిగులు భూములను జలవనరుల శాఖ పరిధి నుంచి తప్పించి రెవెన్యూ శాఖకు బదలాయించాలని భావిస్తోంది. జలాశయ భూముల ఆక్రమణలపై ప్రభుత్వం నివేదిక అడిగిన విషయం వాస్తవమేనని జలవనరుల శాఖ అధికారులు ధ్రువీకరించారు.

**నివేదికలు బుట్టదాఖలు**

జలాశయం నిర్మాణం నేపథ్యంలో ఆయా ప్రాంతాలకు సాగునీరు సమృద్ధిగా అందుబాటులోకి వచ్చింది. భూగర్భ జలాలు గణనీయంగా వృద్ధి చెందడంతో ఆ ప్రాంతమంతా సస్యశ్యామలంగా మారింది. దీంతోపాటు కొన్ని భూములు ప్రధాన రహదారికి సమీపంలో ఉండడంతో ధరలు భారీగా పెరిగాయి. దీంతో ప్రభుత్వానికి భూములిచ్చిన వారితోపాటు ఇతరులు ఆక్రమించుకున్నారు. జలాశయం భూములు పెద్దఎత్తున ఆక్రమణలకు గురయ్యాయన్న అంశంపై గత వైకాపా ప్రభుత్వంలో అధికారులు విచారణ చేశారు. వాస్తవమేనని అధికారులు నిగ్గు తేల్చి నివేదికలు ఇచ్చారు. ఆక్రమించుకున్నవారి నుంచి తీవ్రమైన ఒత్తిళ్లు రావడంతో గత ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు.




## ట్రెడిషనల్ లుక్ లో హీట్ పెంచుతున్న పాయల్..నడుము వయ్యారాలతో!

సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ వాడకం పెరిగిపోయిన తర్వాత ప్రతి ఒక్కరు కూడా తమ ఉనికిని చాటుకోవడానికి నిత్యం శ్రమిస్తూనే ఉన్నారు. అందులో భాగంగానే జూనియర్లను మొదలుకొని సీనియర్ స్టార్ హీరోయిన్ల వరకు ప్రతి ఒక్కరు తమ అందాలు ఆరబోస్తూ ఫాలోవర్స్ ను పెంచుకుంటున్నారు. ఇలా సోషల్ మీడియాలో ఫాలోవర్స్ ను పెంచుకొని అటు దర్శక నిర్మాతల దృష్టిలో పడుతున్నారని చెప్పవచ్చు.. ఈ క్రమంలోనే అవకాశాల కోసం మరో హీరోయిన్ ట్రెడిషనల్ లుక్ లో కనిపిస్తూనే తన అందాలతో హీట్ పెంచుతోంది. ఆమె ఎవరో కాదు పాయల్ రాజ్ పుత్.. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ గ్లామర్ తో ఆకట్టుకునే ఈమె.. గత రెండు మూడు రోజులుగా ట్రెడిషనల్ లుక్కులో దర్శనమిస్తున్న విషయం తెలిసిందే.. ఈ క్రమంలోనే తాజాగా ప్రత్యేకంగా డిజైన్ చేసిన పింక్ కలర్ లెహంగా ధరించి.. దానికి కాంబినేషన్లో గోల్డెన్ కలర్ స్లీవ్ లెస్ డీప్ వీ నెక్ బ్లౌజ్ ధరించి అందరి దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా బ్లౌజ్ లెహంగా మధ్య నడుమును హైలైట్ చేస్తూ ఫోటోలకు



ఫోజులు ఇచ్చిన తీరు చూసి అభిమానులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ట్రెడిషనల్ లుక్ అంటూనే హాట్ లుక్ లో అందాలను ఆరబోస్తూ యువతకు నిద్ర లేకుండా చేస్తోంది ఈ ముద్దుగుమ్మ అంటూ నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు. మొత్తానికైతే పాయల్ షేర్ చేసిన ఈ ఫోటోలు మరింత వైరల్ గా మారుతున్నాయి. పాయల్ రాజ్ పుత్ విషయానికి వస్తే.. 1992 డిసెంబర్ 5న న్యూఢిల్లీలో విమల్ కుమార్ రాజ్ పుత్, నిర్మల్ రాజ్ పుత్ దంపతులకు జన్మించారు. ఈమె తన తల్లిదండ్రులతో కలిసి ముంబైలో నివసిస్తున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా ఇటీవలే పాయల్ తన తండ్రిని కోల్పోయారు. ప్రస్తుతం తల్లితో కలిసి ఉంటున్నారు. చిన్ననాటి నుండే నటనపై మక్కువ ఉండడంతో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి సినీ రంగంలోకి అడుగు పెట్టింది. అలా పాయల్ హిందీ టెలివిజన్ సీరియల్ తో పాటు పంజాబీ సినిమా చన్నా మేరేయా (2017) సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసింది.. 2018లో తెలుగు సినిమా ఆర్ఎక్స్ 100 ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ప్రముఖ డైరెక్టర్ అజయ్ భూపతి దర్శకత్వంలో కార్తికేయ హీరోగా వచ్చిన ఈ సినిమాలో పాయల్ ఒకవైపు హీరోయిన్గా నటిస్తూనే.. మరొకవైపు విలన్ గా చేసి తన నటనతో అబ్బురపరిచింది. ఆర్ఎక్స్ 100 సినిమాతో భారీ క్రేజ్ సొంతం చేసుకున్న ఈ ముద్దుగుమ్మ.. ఒకవైపు పంజాబీ, హిందీ చిత్రాలలో నటిస్తూనే మరొకవైపు తెలుగులో ఎన్టీఆర్:కథానాయకుడు, సీత, ఆర్డిఎక్స్ లవ్, వెంకీ మామ, డిస్కో రాజా, అనగనగా ఓ అతిథి, తీస్ మార్ ఖాన్, జిన్నా, మాయ పేటిక వంటి చిత్రాలలో నటించింది. ఇక చివరిగా మంగళవారం సినిమాలో నటించి ఒక్కసారిగా భయపెట్టేసింది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం తమిళ్ లో కూడా సినిమాలు చేస్తున్నట్లు సమాచారం.

## రీఎంట్రీకి రెడీ అయిన మరో హీరోయిన్

ఫిల్మ్ ఇండస్ట్రీలో ఎవరెప్పుడు ఎలా మెరిసి, ఎలా సడెన్ గా కనుమరుగైపోతారో చెప్పలేం. మరీ ముఖ్యంగా హీరోయిన్లు. కొందరు హీరోయిన్లకు సక్సెస్ వచ్చినప్పటికీ ఇండస్ట్రీలో కనిపించరు. దానికి ఎన్నో రకాల కారణాలుండొచ్చు. అలాంటి ఓ హీరోయినే నటి రేఖ. శ్రీను వైట్ల దర్శకత్వంలో వచ్చి మొదటి సినిమా ఆనందంతో ఎంతో మందిని మెప్పించిన రేఖ తెలుగు ప్రేక్షకులకు బాగా పరిచయస్తురాలే.

**ఏ సపోర్ట్ లేకుండానే..** ఆనందం సినిమా సక్సెస్ తర్వాత తెలుగులో దొంగోడు, ఒకటో నెం. కుర్రాడు, జానకి వెడ్స్ శ్రీరామ్ లాంటి హిట్ సినిమాల్లో కనిపించిన రేఖ కొంతకాలానికి తెలుగు సినిమాకు దూరమై



లైమ్ లైట్ లో కనిపించకుండా పోయింది. కర్ణాటకకు చెందిన రేఖ చిన్న ఏజ్ లోనే సినీ రంగంలోకి ఎంట్రీ ఇచ్చింది. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండానే ఇండస్ట్రీలోకి వచ్చిన రేఖకు అదే టైమ్లో కన్నడ ఇండస్ట్రీ నుంచి కూడా ఆఫర్లు రావడం మొదలుపెట్టాయి.

**పర్సనల్ రీజన్స్ వల్ల ఇండస్ట్రీకి దూరం...** కానీ 2014 తర్వాత రేఖ పర్సనల్ రీజన్స్ మరియు హెల్త్ ఇష్యూస్ కారణంగా రెస్ట్ తీసుకోవాలని నిర్ణయించుకుని, సినీ ఇండస్ట్రీకి దూరమైంది. అలాంటి రేఖ ఇప్పుడు తిరిగి యాక్టింగ్ ను కంటిన్యూ చేయాలని డిసైడైంది. అందులో భాగంగానే టాలీవుడ్ లోకి కంబ్యాక్ ఇవ్వడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. నటిగా తనను ఛాలెంజ్ చేసే పాత్రల కోసం రేఖ ఇప్పుడు వెతుకుతున్నట్టు సమాచారం. సినిమాల్లోనే కాకుండా ఓటీటీ షో లలో ఏదైనా పవర్‌ఫుల్ రోల్స్ ఉన్నా చేయడానికి రెడీ అంటోంది రేఖ. అందులో భాగంగానే రేఖ రీసెంట్ గా తన పేరుతో ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ను కూడా ఓపెన్ చేసి, దాని ద్వారా ఫ్యాన్స్ కు రెగ్యులర్ గా టచ్ లో ఉంటుంది. అయితే ఇన్నేళ్ల తర్వాత కూడా రేఖ అంతే అందంతో కనిపిస్తూ అదే ఆకర్షణతో ఆడియన్స్ ను ఎట్రాక్ట్ చేస్తోంది. మరి తను కోరుకున్న కంబ్యాక్ రేఖకు ఎప్పుడు దొరుకుతుందో చూడాలి.

## బిగ్ బాస్ 9.. డబల్ ఎలిమినేషన్ కి ఫిక్స్ అవ్వొచ్చా..?



బిగ్ బాస్ సీజన్ 9లో ఈ వారం డబల్ ఎలిమినేషన్ ఉండే ఛాన్స్ ఉందని తెలుస్తుంది. ప్రతి సీజన్ లో లాగానే సీజన్ మొదలైన ఐదు వారాల తర్వాత వైల్డ్ కార్డ్ ఎంట్రీస్ ని హౌస్ లోకి పంపిస్తారు. సీజన్ 9 కూడా ఇప్పటికే నాలుగు వారాలు పూర్తి చేసుకోగా ప్రస్తుతం ఐదో వారం నడుస్తుంది. ఈ వీకెండ్ లో సీజన్ 9 సెకండ్ వెర్షన్ అంటే 2.ఓ ని మొదలు పెట్టే ఆలోచనలో ఉన్నారు బిగ్ బాస్ టీం. బిగ్ బాస్ సీజన్ 9 లో ఈ వారం చాలా ట్విస్ట్ లు ఉంటాయని టాక్. అందులో భాగంగా లీడర్ బోర్డ్ టాస్క్ ఒకటి నడుస్తుంది. అంటే వైల్డ్ కార్డ్ ఎంట్రీస్ వస్తున్న ఈ టైం లో హౌస్ లో ఉన్న వాళ్లలో ఎవరు వాళ్లను రీప్లేస్ చేసే అవకాశం ఉంటుందో ఇది నిర్ణయిస్తుంది.

**ఇద్దరు హౌస్ నుంచి బయటకు వస్తారని..** అంతేకాదు ఈ వారం నామినేషన్స్ లో దాదాపు 10 మంది ఉన్నారు. కెప్టెన్ రాము, ఇమ్యూనిటీ సాధించిన ఇమాన్యుయెల్ తప్ప అందరు కూడా నామినేషన్స్ లో ఉన్నారు. ఐతే వీరిలో ఈ వారం ఒకరు కాదు ఇద్దరు హౌస్ నుంచి బయటకు వస్తారని టాక్. ప్రతి వారం హౌస్ నుంచి ఒకరిని ఎలిమినేట్ చేయడం కామన్.. కానీ ఈ వారం డబల్ ఎలిమినేషన్ కి రంగం సిద్ధమైంది. ప్రస్తుతం జరుగుతున్న లీడర్ బోర్డ్ టాస్క్ కూడా అందులో భాగమే అని తెలుస్తుంది. ఈ వీక్ నామినేషన్స్ లో ఉన్న వారిలో డేంజర్ జోన్ లో అంటే లీస్ట్ ఓటింగ్ తో ఉన్న ఇద్దరు కంటెస్టెంట్స్ హౌస్ నుంచి బయటకు వస్తారు. సీజన్ మొత్తం లో ఒకసారి ఈ డబల్ ఎలిమినేషన్ అనేది సర్ ప్రైజ్ చేస్తుంది. ఆడియన్స్ అంతా కూడా ఈసారి ఎలిమినేషన్ ప్రక్రియకు షాక్ అయ్యేలా ప్లాన్ చేశారట బిగ్ బాస్ టీం. సీజన్ 9 లో అంత స్టఫ్ ఉన్న కంటెస్టెంట్స్ ఎవరు కనిపించట్లేదు.

**సీజన్ 9లో రిలేషన్స్ షిప్స్ అది ఒరిజినలా ఫేకా అన్నది..** కేవలం రిలేషన్స్ షిప్స్ అది ఒరిజినలా ఫేకా అన్నది తెలియదు కానీ అందరు అదే పనిలో ఉన్నారు. ఆల్రెడీ ఈ సీజన్ లో బిగ్ బాస్ రెండోసారి టాస్క్ విషయంలో కంటెస్టెంట్స్ కి వార్నింగ్ ఇవ్వడం జరిగింది. ఏ సీజన్ లో కూడా ఇలా బిగ్ బాస్ తో వార్నింగ్ ఇప్పించిన సందర్భాలు చాలా తక్కువ. కానీ ఈ సీజన్ లో అది రిపీట్ అవుతూనే ఉంది. అందుకే ఆడియన్స్ కూడా వైల్డ్ కార్డ్స్ వచ్చిన తర్వాత ఆట మారుతుందని భావిస్తున్నారు.

## ఒక్క రోజు తేడాతో... తగ్గాల్సింది ఎవరు?






కేజీఎఫ్ సినిమా తర్వాత యశ్ స్థాయి అమాంతం పెరిగింది. కేజీఎఫ్ 2 ఏకంగా వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించడంతో యశ్ తదుపరి సినిమా అదే స్థాయిలో ఉండాలని అభిమానులు కోరుకుంటున్నారు. అందుకే చాలా గ్యాప్ తీసుకుని యశ్ టాక్సిక్ సినిమాను చేస్తున్నాడు. ఆ సినిమా మేకింగ్‌కు చాలా ఎక్కువ సమయం పడుతుంది. సాధారణంగానే యశ్ సినిమాలు కాస్త ఎక్కువ సమయం తీసుకుంటారు అంటారు. ఇప్పుడు అంతకు మించి అన్నట్లుగా యశ్ టాక్సిక్ సినిమాకి తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. మొదట 2025లో సినిమా విడుదల చేయాలని మేకర్స్ బలంగా భావించారు. కానీ సినిమా మేకింగ్ ముందుగా అనుకున్నట్లుగా కాకుండా చాలా ఎక్కువ రోజులు తీసుకుంటుంది. అందుకే సినిమాను 2026 కి వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెల్సిందే.

**యశ్ టాక్సిక్ రిలీజ్ డేట్...** కన్నడ సినిమా వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం టాక్సిక్ సినిమాను ఖచ్చితంగా 2026 మార్చి 19న విడుదల చేయబోతున్నారు. ఆ తేదీని చిత్ర యూనిట్ సభ్యులు అధికారికంగా ప్రకటించారు. అన్ని అనుకున్నట్లుగా జరిగితే సినిమా షూటింగ్ మరో నెల రోజుల్లో పూర్తి అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆలస్యం అయితే మహా అయితే అక్టోబర్ వరకు పడుతుంది. ఆ తర్వాత వీఎఫ్ఎక్స్ వర్క్, ఇతర వర్క్ అంతా పూర్తి చేసి 2026 జనవరి చివరి వరకు ఫస్ట్ కాపీ రెడీ చేస్తారు. కనుక మార్చి లో సినిమాను విడుదల చేయడంలో ఎలాంటి ఇబ్బంది ఉండదు అనేది ఇండస్ట్రీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. ఈ మధ్య కాలంలో టాక్సిక్ సినిమాకు సంబంధించి అంచనాలు పెరిగే విధంగా చిత్ర యూనిట్ సభ్యులు లీక్‌లు ఇస్తున్నారు. దాంతో పాన్ ఇండియా స్థాయిలో అంచనాలు పెరిగాయి.

**బాలీవుడ్ మూవీకి పోటీగా...** ఒక వైపు కేజీఎఫ్ తో వచ్చిన స్టార్‌డంతో టాక్సిక్ సినిమాను ఓ రేంజ్‌లో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్న యశ్ కి పోటీగా బాలీవుడ్ మూవీ 'లవ్ అండ్ వార్' పోటీగా దిగే అవకాశాలు ఉన్నాయి. సంజయ్ లీలా భన్సాలీ ఈ సినిమాను రూపొందిస్తున్నాడు. దాదాపు నాలుగు ఏళ్ల తర్వాత ఆయన నుంచి రాబోతున్న సినిమా ఇది. సాధారణంగానే బాలీవుడ్‌తో పాటు అన్ని భాషల్లోనూ సంజయ్ లీలా భన్సాలీ సినిమా వస్తుంది అంటే ఒకరకమైన ఆసక్తి, అంచనాలు ఉంటాయి. అలాగే ఈ సినిమా విషయంలోనూ అదే స్థాయిలో ఆసక్తి ఉంది. ఇప్పుడు లవ్ అండ్ వార్ సినిమా విషయంలోనూ హిందీ ప్రేక్షకుల్లో అంచనాలు భారీగా ఉన్నాయి. పైగా సంజయ్ లీలా భన్సాలీ చాలా కాలం తర్వాత అత్యధికంగా ఈ సినిమాను విదేశాల్లో చిత్రీకరించడం, లవ్ అండ్ వార్ అంటూ విభిన్నమైన టైటిల్ ఉండటంతో అంచనాలు పెరిగి పోయాయి.

**సంజయ్ లీలా భన్సాలీ లవ్ అండ్ వార్...** లవ్ అండ్ వార్ సినిమాలో రణబీర్ కపూర్, విక్కీ కౌశల్, ఆలియా భట్ లు నటించారు. ఇద్దరు హీరోలు నటించిన సినిమా కావడంతో ఆసక్తి మరింతగా పెరిగింది. ముగ్గురి మధ్య ప్రేమ కథగా ఈ సినిమా రూపొందుతున్నట్లు మొదటి నుంచి వార్తలు వస్తున్నాయి. అదే సమయంలో సినిమాలో యాక్షన్ సన్నివేశాలకు పెద్ద పీట వేశారని తెలుస్తోంది. మొత్తానికి ఈ బిగ్ మల్టీస్టారర్ మూవీ పై బాలీవుడ్ ప్రేక్షకుల్లో ఆసక్తి ఉంది. రెండు సినిమాలు కూడా హోరా హోరీగా ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు బాక్సాఫీస్ వద్ద పోటీ పడే అవకాశాలు ఉన్నాయి. అయితే రెండు పెద్ద సినిమాలు ఒకే సారి విడుదల అయితే ఏం జరుగుతుంది అనేది కూలీ – వార్ 2 విషయంలో వెల్లడి అయింది. కనుక చివరి నిమిషంలో ఎవరో ఒకరు తగ్గితే బాగుంటుంది అనే అభిప్రాయంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు.

## కేతిక శర్మ బోల్డ్ ఆఫర్ కి నో చెప్పిందా?

ఢిల్లీ బ్యూటీ కేతిక శర్మ కెరీర్ ప్రారంభించి ఐదేళ్లు అవుతోన్న సంగతి తెలిసిందే. చెప్పుకోవడానికి ఐదారు సినిమాలు చేసింది. కానీ వాటిలో హిట్ అయినవి ఎన్ని అంటే? కనిపించడం కష్టమే. ఇటీవలే రిలీజ్ అయిన సింగిల్ మాత్రమే అమ్మడి కెరీర్ లో తొలి హిట్. ట్రయాంగిల్ లవ్ స్టోరీ లో కేతిక పాత్రకు మంచి మార్కు లే పడ్డాయి. చబ్బీ లుక్ లో యువతని ఆకట్టుకుంటుంది. నటనకు ఆస్కారం ఉన్న రోల్ కావడంతో అందరికీ కనెక్ట్ అయింది. దీంతో అమ్మడికి కొత్త అవకాశాలు ప్రారంభమైనట్లుకనిపిస్తుంది.ల ప్రస్తుతం రాజేష్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తోంది. అలాగే కోలీవుడ్ లో కూడా ఛాన్సులొస్తున్నాయి. అందం, అభినయ గల నాయిక కావడంతో ప్రోత్సహించే వారు వెంట పడుతుతున్నారు. ఈనేపథ్యంలో తాజాగా టాలీవుడ్లో ఓ నిర్మాత అప్రోచ్ అయి ఓఛాన్స్ ఆఫర్ చేసాడుట. అయితే



అది బోల్డ్ కంటెంట్ ఉన్న చిత్రం కావడంతో కేతిక స్టోరీ విని రిజెక్ట్ చేసిందిట. కథలో కేతిక పాత్ర బాగా బోల్డ్ గా ఉంటుందని.. ద్వితియార్థం కథలో మరింతగా బోల్డ్ నెస్ హైలైట్ అవుతుందన్న కారణంగా తిరస్కరించినట్లు తెలిసింది. కేతిక ఇమేజ్ ఆధారంగా రెడీ చేసిన కథ కావడంతో ఆమె ఒప్పుకుంటుందని నమ్మకంతో సదరు దర్శక నిర్మాత కాన్ఫిడెంట్ గా ముందుకెళ్లినా? ఊహించని సమాధానం చెప్పిందని సదరు దర్శక నిర్మాత బయట చెబుతున్నాడు. దీంతో ఇప్పుడాయన మరో నాయికను వెతుక్కునే పనిలో ఉన్నట్లు తెలిపాడు. ఆ హీరోయిన్ కూడా అచ్చంగా కేతిక లుక్ లోనే ఉండే వాళ్లనే ఎంపిక చేస్తానంటున్నాడు. అలాంటి భామ దొరికితే ఒకే లేదంటే? కథలో మళ్లీ మార్పులు చేసి కొత్త భామ కోసం ట్రై చేస్తానన్నాడు. హీరోయిన్లను గుడ్డిగా నమ్మి ముందుకెళ్తే ఇలా ఉంటుంది? అన్నది ఇదో అనుభవంగా చెప్పుకొచ్చాడు. ఏనటి అయినా పోషించే పాత్ర మనసుకు నచ్చితేనే అంగీకరిస్తారు. మనసు చంపుకుని నటించడానికి ఏ నటి సాహసించదన్నది గుర్తించడం అంతే అవసరం.

## శ్రీలీల బాలీవుడ్ డెబ్యూ.. ఇది ఊహించని షాక్?

యంగ్ హీరోయిన్ శ్రీలీలకు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. అందం, అభినయం సమపాళ్లలో ఉన్న ఆమె.. టాలీవుడ్ లో తక్కువ టైమ్ లోనే ఎక్కువ స్టార్ డమ్ సంపాదించుకుంది. ఒక్కసారి సెన్సేషనల్ బ్యూటీగా మారిపోయింది. ఒకే ఏడాది దాదాపు అరడజనుకు పైగా సినిమాలు అనౌన్స్ చేసి షాక్ ఇచ్చిందనే చెప్పాలి. స్టార్ హీరోలతో వరుసగా ఛాన్స్ లు అందుకున్న అమ్మడు.. ఒక్కసారిగా ఫ్లాపులు అందుకుంది. బాక్సాఫీస్ వద్ద పలు సినిమాలు బోల్తా కొట్టడంతో కాస్త అవకాశాలు తగ్గాయి. కానీ క్రేజ్ అలానే ఉంది. ఇప్పుడు మళ్లీ జోరు పెంచిన శ్రీలీల.. కంటెంట్, పాత్ర ప్రాధాన్యత చూసి సినిమాలు ఎంచుకోవాలని నిర్ణయించుకుందని క్లియర్ గా తెలుస్తోంది. అయితే త్వరలో బాలీవుడ్ లోకి శ్రీలీల అడుగుపెట్టనున్న విషయం తెలిసిందే. బాలీవుడ్ స్టార్ నటుడు సైఫ్ అలీ ఖాన్ కుమారుడు ఇబ్రహీం అలీ ఖాన్ డెబ్యూ మూవీ దిలేర్ల తో తెరంగ్రేటం చేయనుంది అమ్మడు. మొదటి నుంచి డైరెక్షన్ పై ఫోకస్ చేసిన ఇబ్రహీం అలీ



ఖాన్.. ఇప్పుడు హీరోగా బిగ్ స్క్రీన్ పై సందడి చేస్తున్నారు. దిలేర్ చిత్రానికి కృణాల్ దేశ్?ముఖ్ దర్శకత్వం వహిస్తుండగా.. ప్రముఖ మాడాక్ ఫిల్మ్స్ సంస్థ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందిస్తోంది. ఇప్పటికే షూటింగ్ జరుగుతుండగా.. సరైన మూవీతో హిందీలో శ్రీలీల లాంచ్ అవుతుందని అంతా ఎక్స్పెక్ట్ చేశారు. కానీ ఇప్పుడు ఆ సినిమా థియేటర్స్ లోకి కాకుండా డైరెక్ట్ గా ఓటీటీలోకి రానుందని వినికిడి. అయితే అది శ్రీలీలకు ఇది పెద్ద ఎదురుదెబ్బనే చెప్పాలి. డెబ్యూ మూవీ ఓటీటీలోకి అంటే కాస్త ఆమోదించాల్సిన విషయం కాదు. పలు విషయాల వల్ల మేకర్స్ అలా చేస్తున్నారని ఇప్పుడు టాక్ వినిపిస్తోంది. దీంతో ప్రస్తుతం ఆ విషయంలో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అమ్మడు మంచి ఛాన్స్ మిస్ అవుతుందని అంటున్నారు. అదే సమయంలో సినిమా రిజల్ట్ తేడా కొడితే డిజిటల్ విడుదల ఆమెను పరాజయం నుంచి కాపాడవచ్చని చెబుతున్నారు. అయితే దిలేర్ ఓటీటీ రిలీజ్ కన్ఫర్మ్ అయితే శ్రీలీల బాలీవుడ్ బిగ్ స్క్రీన్ లాంచ్ కార్తీక్ ఆర్యన్ తో ఆమె చేస్తున్న రొమాంటిక్ డ్రామాకు మారవచ్చు. ఇది కచ్చితంగా థియేటర్స్ లో రిలీజ్ కానుంది. ఆ ప్రాజెక్ట్ తో గ్రాండ్ ఎంట్రీ ఇవ్వనుంది. మరేం జరుగుతుందో వేచి చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536